వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఈ నగరానికి ఏమైంది?

రాజధాని నగరం హైదరాబాద్ రోజురోజుకూ అరాచకంలో కూరుకుపోతున్నది. నేరాలు, ఘోరాలు నిత్యకృత్యంగా మారిపోతున్నాయి. గంగా జమునా తెహజీబ్‌కు పేరుగాంచిన 'చార్‌సౌ సాల్ షహర్'లో యథేచ్ఛగా జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు పోలీసుల అస్తిత్వాన్నే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. గత వారం, పది రోజుల్లో జరిగిన ఘటనలను పరిశీలిస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. చిన్నారులపై లైంగికదాడులు, అపహరణల వార్తలు నిత్యం మీడియాలో కనిపిస్తున్నాయి. నిర్దోషులను కాపాడి, నేరస్థులను శిక్షించడంలో పోలీసుల అలసత్వం, కొన్ని సందర్భాల్లో మిలాఖత్ కావడం చూస్తుంటే ఆందోళన కలిగిస్తున్నది. మరోవైపు పోలీసు జులుం రెచ్చిపోవడం చూస్తుంటే అసలు ప్రభుత్వమనేది ఉన్నదా? అనే సందేహం కలుగుతున్నది. జూలైలో మహిళలపై ఒక్కరోజే మూడు అత్యాచార ఘటనలు నమోదయ్యాయి. అందులో ఒకటి నిర్భయ తరహా నేరం కావడం సురక్షిత నగరంగా పేరొందిన నగరం ఎంతగా దిగజారిపోతున్నదో తెలుస్తున్నది. గ్రేటర్‌లో గత ఏడు నెలల్లో అత్యాచార ఘటనలు వందల సంఖ్యలో జరిగాయి. ఇందులో పోక్సో కేసులు 850 వరకు నమోదయ్యాయి. చిన్నారులు, మైనర్లపై కూడా లైంగికదాడులు పెరిగాయి. ఇదే 7 నెలల వ్యవధిలో 160కు పైగా హత్యలు జరిగాయి. రౌడీ షీటర్ల గ్యాంగ్‌వార్లు, ప్రతీకార హత్యలతో నగరం అట్టుడుకుతున్నది.

సుమారు దశాబ్దకాలం పాటు సుస్థిరమైన శాంతిభద్రతలు నెలకొన్న హైదరాబాద్‌లో 8 నెలల్లో పరిస్థితి తారుమారైంది. సొంత రాష్ట్రం ఏర్పాటు కాగానే అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటగా దృష్టి కేంద్రీకరించింది పోలీసు వ్యవస్థను మెరుగుపరచడంపైనే. ముఖ్యంగా మహిళల భద్రతకు హాక్ ఐ, షీ టీమ్స్ వంటి వినూత్న వ్యవస్థలను అమల్లోకి తెచ్చింది. నేరాల అదుపునకు కేంద్రీకృత నిఘా వ్యవస్థను ప్రవేశపెట్టింది. శాంతిభద్రతలు సవ్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమనే ఆలోచన దీనంతటికీ కారణం. కానీ, ఇప్పుడు అంతా మొదటికొచ్చింది. 'ఫ్రెండ్లీ' పోలీసులు పౌరులను శత్రువులుగా చూస్తున్నారు. లాఠీ ఝుళిపించి ప్రతాపం చూపిస్తున్నారు. షాద్‌నగర్‌లో ఓ దొంగతనం కేసులో దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, కొడుకు ముందే వివస్త్రను చేసి చిత్రహింసలు పెట్టడం సభ్యసమాజాన్ని తలదించుకునేలా చేసింది. ఈ కేసులో పోలీసుల పాత్రపైనే అనుమానాలు తలెత్తడం గమనార్హం. చోరీ సొత్తులో వాటా కోసమే పోలీసులు అత్యుత్సాహం చూపినట్టు ఆరోపణలు రావడం తెలిసిందే. ఈ ఉదంతం పోలీసుల బరితెగింపునకు అద్దం పడుతున్నది. ఓవైపు ఇలా నిర్దోషులు వేధింపులకు గురవుతుంటే మరోవైపు ఓ పోలీసు స్టేషన్ నుంచి ఒక దొంగ వారంలో రెండుసార్లు తప్పించుకోవడం పోలీసుల అసమర్థతకు నిదర్శనం.

పోలీసులంటే వృత్తిపరమైన నైపుణ్యంతో దర్యాప్తు జరిపి న్యాయం చేస్తారనే భరోసా తగ్గిపోతున్నది. ఈ తరహా ఘటనలన్నీ కూడా ప్రభుత్వ పర్యవేక్షణలోని లోపాలను వేలెత్తి చూపుతున్నాయి. ప్రజలకు భద్రత విషయంలో భరోసా కల్పించేందుకు ప్రభుత్వం తన ప్రాధాన్యాలను సమీక్షించుకోవాల్సి ఉన్నది. పోలీసు యంత్రాంగాన్ని కట్టుదిట్టం చేసి భద్రతకు మళ్లీ భరోసా కల్పించాలి.

రుణమాఫీ కాని రైతుల పక్షాన..

'ముందు దగా, వెనుక దగా, కుడి ఎడమల దగా దగా!' అనుభవిస్తున్న శ్రామికవర్గం మన రైతాంగం. రైతులకు పెట్టుబడి కూడా దక్కని వారి పంట మాత్రం మార్కెట్‌లో దళారులకు సిరుల పంట పండిస్తున్నది. సంచెడు కూరగాయలకు పది రూపాయలు గిట్టనిది బజార్లో కిలోకు వందవుతుంది. నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో వ్యాపారులు రైతును నిలువు దోపిడీ చేస్తున్నారు. వీటి బారి నుంచి రైతన్నను కాపాడలేని అశక్త ప్రభుత్వాలు రాయితీల కంటితుడుపుతో బుజ్జగిస్తున్నాయి.



బి.నర్సన్
94401 28169



ఆ ఓదార్పునకు కూడా గండి కొడితే రైతు బాధ వినేదెవరు? లేస్తే చేను చెలకల్లో పొద్దు గడిపేవారికి లోకం పోకడలు తెలియవు. సంఘాలు, ఆందోళనలు తెలియవు. రోడ్డెక్కి న్యాయాన్ని అడిగే తీరు తెలియదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేస్తామని చెప్పిన పంట రుణం సొమ్ము బ్యాంకు ఖాతాలో పడకున్నా దిక్కుతోచని స్థితిలో బెంగ పడుతున్నారు. జవాబు చెప్పే నాథుడు లేక చేష్టలుడిగి కూచున్నారు. రుణమాఫీ అయిపోయింది కదా అన్నట్టే చేతులు దులుపుకొన్నా పాత లెక్కలు ముందేసి ప్రభుత్వాన్ని నిలదీసేవారు కరువయ్యారు.

నేను ఈ మధ్య ఇదే అంశంపై రాసిన వ్యాసాలను చూసిన రైతులు పదుల సంఖ్యలో తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. 'మా అమ్మకు డిపెండెంట్ పింఛన్ వస్తుంది. రేషన్‌కార్డులో ఆమెతో పాటు మా పేరున్నది. పంట అప్పు మాఫీ కాలేదు. ఆమెను అడుక్కోవాలా?' ఒక రైతు అన్నాడు. 'నాకు పెండ్లయినా మా ఇంటి రేషన్ కార్డులోనే నా పేరున్నది. మా ఆయనకు భూమి లేదు. మా తల్లిగారిచ్చిన భూమిపై లోను తీసుకున్నాను. మాఫీ కాలేదు' అని ఓ ఆడబిడ్డ బాధపడింది. ఇలాంటి ఉదంతాలెన్నో ఉంటాయి. అందరికీ పంట రుణం మాఫీ చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్.. పొంతనలేని కిసాన్ సమ్మాన్ నిబంధనలను తెచ్చి మా కొంప ముంచడమేమిటని రాష్ట్ర రైతాంగం కుమిలిపోతున్నది.

అయితే, దీన్ని ఇలాగే వదిలేయాలా లేక ఇదేం అన్యాయమని ప్రభుత్వాన్ని ప్రశ్నించాలా అనేది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న. 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 35 లక్షల రైతు ఖాతాల్లో రూ.16,144 కోట్లను జమ చేసింది. అదేవిధంగా 2018లో 36.68 లక్షల రైతులకు లక్షలోపు రుణమాఫీ కోసం రూ.19,198 కోట్లు బ్యాంకులకు చెల్లించింది. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష లోపు రైతు రుణమాఫీగా కేవలం 11.5 లక్షల రైతుల కోసం రూ.6,098 కోట్లు బ్యాంకుల్లో జమచేసింది. లక్షన్నర అప్పు మాఫీ కోసం రూ.6,190 కోట్లు విడుదల చేసింది. బ్యాంకుల లెక్కల ప్రకారమైతే ఈ ఏడాది మార్చి నాటికి పంట రుణాల మొత్తం రూ.64,940 కోట్లు ఉన్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వం నిర్ణయించిన కటాఫ్ తేదీ 2023, డిసెంబర్ 9 వరకు తీసుకున్నా రూ.49,500 కోట్లు తెలంగాణ రైతులు బ్యాంకుల్లో చెల్లించాలి. ఇందులో అగ్రి గోల్డ్ లోన్లు తీసేస్తే కనీసం రూ.39,000 కోట్లయినా అసలైన పంట రుణాలు ఉండే అవకాశం ఉన్నది. మొదట ప్రభుత్వం కూడా ఇదే మాటన్నది. క్రమంగా మాఫీ మొత్తం తగ్గుతూ వచ్చింది. మూడు విడతల రుణమాఫీలో లబ్ధి కుటుంబాల సంఖ్య 35,49,870 కాగా, వారికి మాఫీ చేస్తున్న సొమ్ము రూ.24,449 కోట్లు అని వ్యవసాయశాఖ ఈ నెల 1న తేల్చింది. అంటే రుణమాఫీ సినిమాకు శుభం కార్డు పడ్డట్టే.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ విషయంపై స్పందిస్తూ రుణమాఫీపై ప్రభుత్వం విధించి న నిబంధనల కారణంగా 70 శాతం రైతులకు మాత్రమే మాఫీ వర్తించిందని, దీనిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. నష్టపోయిన అన్నదాతలు తమ కష్టాలు చెప్పుకోవడానికి ఒక మొబైల్ నెంబ ర్ కూడా తెలిపారు. అయితే ఎన్నిసార్లు కాల్ చేసినా ఆ నెంబర్ బిజీ వస్తున్నది. అందులో ఏదో మతలబు ఉండొచ్చు. కొత్త రైతు చట్టాలతో దేశంలోని రైతులను, వారి పంటలను, భూములను బడా పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేయడానికి సిద్ధపడి, భంగపడిన బీజేపీ మన రైతులకు మేలు చేస్తుందని ఆశించలేం. బీఆర్‌ఎస్ నేతలు మాఫీ తొలి ప్రకటన నుంచే మాఫీ తప్పుల తడక అంటూ, మాఫీ అందని రైతుల గొంతును వినిపిస్తున్నారు. రైతు సంఘాలు, వేదికలు ప్రభుత్వ చర్యను ఖండించడం తప్ప ఎలాంటి కార్యాచరణను చేపట్టినట్టు లేదు. ఒక్క అసెంబ్లీ సీటుతో సీపీఐ మురిసిపోతూ రైతు బాధలను పట్టించుకోకుండా కాంగ్రెస్ వెంట తోకాడిస్తూ తిరుగుతున్నది.

> **అంతా అయిపోయింది అన్నట్టు ప్రవర్తిస్తున్న ప్రభుత్వాన్ని మీ హామీ ఏమిటి, ఈ నిబంధనలు ఏమిటి? అని అడిగేవారు కావాలి. 2014, 2018లో మాఫీ లభించిన వారిలో ఈసారి మాఫీ వర్తించని వారెందరో గ్రామాలవారీగా సమాచారం సేకరించాలి.**

రైతు బృందాలతో కలిసి విపక్షాలు ఆయా ప్రాంతాల్లోని ఎమ్మెల్యేలు, మంత్రుల వద్దకు వెళ్లి రాతపూర్వక నివేదనలివ్వాలి. మాఫీ సాధన సమితిని ఏర్పాటుచేసి రైతుల పక్షాన నిలబడాలి. రూ.2 లక్షల దాకా రుణమాఫీ ఇస్తున్నందువల్ల నిధుల కొరతతో ఈ నిబంధనలు పెట్టవలసి వచ్చిందని ప్రభుత్వం నోట అనిపించాలి.

నిజానికి రుణమాఫీ అనేదానికి లక్ష పరిమితి చాలు. ఆపై అప్పు తీసుకునేవారికి కొంత మెరుగైన ఆర్థిక పరిస్థితే ఉంటుంది. అందుకోసం రూ.లక్ష రుణమాఫీ కోసమైనా పీఎం కిసాన్ నిబంధనలను సడలించి, తెల్ల రేషన్ కార్డు అర్హతను తొలగించాలి. నలభై, యాభై వేల రూపాయల అప్పు ఉన్నవాళ్లకు కూడా ఈ నిబంధనల వల్ల మాఫీ వర్తించకపోవడం శోచనీయం. తక్కువ రుణ పరిమితినో, భూ పరిమితినో దృష్టిలో పెట్టుకొని చిన్న, సన్నకారు రైతులకైనా ప్రభుత్వం మాఫీ వర్తింపజేస్తే ఆ లక్ష్యం నిజంగా నెరవేరినట్టవుతుంది.

నిజానికి రుణమాఫీ అనేదానికి లక్ష పరిమితి చాలు. ఆపై అప్పు తీసుకునేవారికి కొం త మెరుగైన ఆర్థిక పరిస్థితే ఉంటుంది. అం దుకోసం రూ.లక్ష రుణమాఫీ కోసమైనా పీఎం కిసాన్ నిబంధనలను సడలించి, తెల్ల రేషన్ కార్డు అర్హతను తొలగించాలి. రూ.నలభై, యాభై వేల అప్పు ఉన్నవాళ్లకు కూడా ఈ నిబంధనల వల్ల మాఫీ వర్తించకపోవడం శోచనీయం.



తెలుగు యూనివర్సిటీకి సురవరం పేరు పెట్టాలె!

ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి గారికి...

2024, జూన్ 2 నాటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేండ్లు పూర్తయ్యాయి. అదే సమయంలో పునర్విభజన చట్టంలోని హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అనే నిబంధన తొలగిపోయింది. దీంతో హైదరాబాద్‌పై సర్వహక్కులు తెలంగాణకు దఖలు పడ్డాయి. ఈ సందర్భంగా ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నటువంటి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి తెలుగు వైతాళికుడు 'సురవరం ప్రతాపరెడ్డి' పేరు పెట్టినట్టయితే అది తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడానికి తోడ్పడుతుంది.

'అన్నిపక్షాలు కోరుకున్నట్టయితే సురవరం పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టడానికి ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేద'ని 2024 ఆగస్టు 2న ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లో మీరు తెలిపినందుకు ధన్యవాదాలు. ఈ పేరు మార్పు ప్రతిపాదనను సీపీఐ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు చేశారు. వారికీ ధన్యవాదాలు. అట్లాగే ఈ ప్రతిపాదనకు మద్దతు పలికిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుకు కూడా ధన్యవాదాలు. బీజేపీ సైతం ఈ విషయంలో సానుకూలంగా ఉన్నది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనంత త్వరలో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పేరును 'సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం'గా మార్చాలని కవులు, రచయితలు, తెలంగాణవాదులుగా మేమందరం మరొక్కమారు మీకు విజ్ఞప్తి చేస్తున్నాం. తెలంగాణ సాహిత్యం, కళలు, కళారూపాలు, వారసత్వ సంపదను కాపాడుకునేందుకు, ఉన్నతస్థాయి పరిశోధనకు ఇది అత్యావశ్యకం.

తెలంగాణ ప్రజల ఔన్నత్యాన్ని, ప్రతిభను దశదిశలా వ్యాపింపజేసిన దార్శనికుడు, నడుస్తున్న విజ్ఞాన సర్వస్వం సురవరం ప్రతాపరెడ్డి. విరామమెరుగకుండా మూడు దశాబ్దాల పాటు ప్రతిరోజు రచయితగా, జర్నలిస్టుగా తాను సృజించిన రచనలన్నీ ఆణిముత్యాలే. మద్రాసులో వేదము వెంకటరాయశాస్త్రి వద్ద ఆయన విద్యాభ్యాసం చేశారు. తెలుగు సాహిత్యంలో పండితునిగా ఎదిగిన సురవరం ప్రతాపరెడ్డి న్యాయశాస్త్రాన్ని కూడా చదివారు. రెడ్డి హాస్టల్ నిర్మాతగా విద్యావ్యాప్తికి తోడ్పడ్డారు. గోలకొండ పత్రిక స్థాపక సంపాదకులుగా, ఆంధ్రమహాసభ తొలి అధ్యక్షుడిగా, గ్రంథాలయోద్యమ నాయకుడిగా, పౌరహక్కుల ఉద్యమకారుడిగా, రచయితగా, పరిశోధకుడిగా, గ్రంథమాల నిర్వాహకుడిగా, సారస్వత పరిషత్తు స్థాపకుల్లో ఒకరిగా, ఆంధ్ర విద్యాలయ నిర్మాతగా, ప్రచురణకర్తగా, తెలంగాణ అస్తిత్వ పతాకం 'గోలకొండ కవుల సంచిక' సంపాదకులుగా, ఆంధ్రుల సాంఘిక చరిత్రను నిర్మించిన చరిత్రకారుడిగా, అరుంధతీయ సంఘానికి గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించిన సామాజిక సంస్కర్త సురవరం. ఇట్లా బహుముఖాలుగా తెలంగాణ సమాజాన్ని చైతన్యపరిచిన సురవరం ప్రతాపరెడ్డి పేరు తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టడం చాలా సమంజసనీయమైన నిర్ణయం.

ముఖ్యమంత్రిగా మీరు ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందినవాడే కాకుండా హైదరాబాద్ రాష్ట్ర తొలి అసెంబ్లీ లో వనపర్తి నియోజకవర్గం నుంచి శాసనసభకు సురవరం ప్రతాపరెడ్డి ప్రాతినిధ్యం వహించారు. అట్లాంటి బహుముఖ ప్రజ్ఞాశాలిని శాశ్వతంగా చరిత్రపుటల్లోకి ఎక్కించేవిధంగా తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం పేరు పెట్టాలి. అంతేకాకుండా కాళోజీ, దాశరథిల మాదిరిగానే 'సురవరం' పేరిట కూడా ఏటా ఉత్తమ పత్రికా సం పాదకులు/ జర్నలిస్టులు, చరిత్రకారులు, సాహితీవేత్త, సామాజిక సంస్కర్త/ హక్కుల కార్యకర్తలకు అవార్డు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కవులు, రచయితలుగా రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాం.

ఇట్లు

డాక్టర్ నాళేశ్వరం శంకరం, ఆనందాచారి, రంగన్న, వనపట్ల సుబ్బయ్య, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ పసునూరి రవీందర్, మువ్వా శ్రీనివాసరావు, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, ఘనపురం దేవేందర్, దేశపతి శ్రీనివాస్, సైదాబాబ, డాక్టర్ పల్లేర్ల వీరస్వామి, వఝ్జల శివకుమార్, కొల్లాపురం విమల, కందుకూరి శ్రీరాములు, ముచ్చర్ల దినకర్, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, బండారు శంకర్, గుడిపల్లి నిరంజన్, బోలా యాదయ్య, పలుస శంకర్‌గౌడ్, రావూరి వనజ, జ్వలిత, అనిశెట్టి రజిత, డాక్టర్ అంబటి భానుప్రకాశ్, ఇల్లూరి వెంకట్రామయ్య శెట్టి, డాక్టర్ వేణు సంకోజు, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు, తులసి వెంకటరమణాచార్యులు, జయహన్మంత్ నాయక్, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, ఉదారి నారాయణ, వల్లభాపురం జనార్దన, కె.లక్ష్మణ్‌గౌడ్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, వేముగంటి మురళి, ఎదిరెపల్లి కాశన్న, డాక్టర్ సీతామహాలక్ష్మి తదితరులు.

నాటి హుందాతనం కనిపించదేమి?

పదేండ్ల పాటు హుందాతనానికి మారుపేరుగా నిలిచిన రాష్ట్ర శాసనసభ మొన్నటి బడ్జెట్ సెషన్ జరిగిన తీరును చూసి యావత్ తెలంగాణ నివ్వెరబోయింది. సాక్షాత్తూ సభా నాయకుడే వెకిలి చేష్టలతో, కురచ మాటలతో తెలంగాణ అసెంబ్లీ ప్రతిష్టను దిగజార్చగా, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభా మర్యాదను మంటగలిపారు.



దిలీప్ కొణతం



నిజానికి పదేండ్ల తర్వాత ప్రజలు దయతలిస్తే బొటాబొటి ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని తెలంగాణ ప్రజలకు దగ్గరయ్యే అవకాశం గత ఏడెనిమిది నెలలుగా ఉండింది. దశాబ్ద కాలంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన మంచిపనులను కొనసాగిస్తూ, ఏదైనా లోటుపాట్లు జరిగి ఉంటే వాటిని సరిదిద్దుతూ.. నూతన విధానాలు, ప్రాజెక్టులు ప్రవేశపెడుతూ పాలనపై తనదైన మార్క్ వేసే బ్రహ్మాండమైన అవకాశాన్ని తన అవగాహనారాహిత్యం, అవకతవక నిర్ణయాలు, ఒంటెత్తు పోకడలు, కక్షపూరిత ప్రవర్తనతో చేజార్చుకున్నారు రేవంత్ రెడ్డి.

మార్పు మార్పు అంటూ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్ మీద ప్రజలకు భారీ ఆశలేమీ లేకపోయినా కనీసం గుణాత్మకంగా ఏదైనా మార్పు ఉంటుందేమోనని ఎదురుచూసినవారికి ఈ బడ్జెట్ నిరాశే మిగిల్చింది. ఎంతసేపూ కేసీఆర్ మీద అక్కసుతో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చే చౌకబారు ఎత్తుగడలనే కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నమ్ముకున్నట్టు సభలో వారి ప్రవర్తన నిరూపించింది.

ఈసారి చాలామంది తెలంగాణవాదులకు నచ్చింది బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగం. ఆయన సారథ్యంలో గుప్పెడు మంది బీఆర్‌ఎస్ నాయకులు పాండవుల్లాగా సభలో చర్చను డామినేట్ చేశారు. ముఖ్యంగా రోజురోజుకూ పదునెక్కుతున్న కేటీఆర్ నాయకత్వశైలి ఈ సమావేశాల్లో స్పష్టంగా కనిపించింది. సభలో ఎప్పటికప్పుడు అటు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి లాంటి సీనియర్లను, ఇటు అనిల్ జాదవ్, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ వంటి నూతన ఎమ్మెల్యేలనూ సమన్వయపరిచిన తీరు, మహిళా నాయకుల మీద అధికారపక్షపు వెకిలి దాడిని తిప్పికొట్టిన విధానం రాటుదేలుతున్న కేటీఆర్ నాయకత్వశైలికి గీటురాయిగా నిలిచింది. రేవంత్ రెడ్డి 'తాతలు తండ్రుల వారసత్వం' అని ఒక వ్యాఖ్య చేస్తే వెంటనే కేటీఆర్ లేచి 'రాహుల్ గాంధీ, రాజీవ్‌గాంధీ గురించేనా మీ వ్యాఖ్యలు' అంటూ జవాబివ్వడం ప్రజలను ఆకట్టుకున్నది.

ద్రవ్య వినిమయ బిల్లుపై అసెంబ్లీలో జరిగిన చర్చలో కేటీఆర్ తన విశ్వరూపం ప్రదర్శించారంటే అతిశయోక్తి కాబోదు. బడ్జెట్‌లోని డొల్లతనాన్ని ఎత్తిచూపుతూ, రేవంత్ ప్రభుత్వం తీసుకుంటున్న అవకతవక నిర్ణయాలను కేటీఆర్ తూర్పారబట్టారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కేసీఆర్ ఫోబియా పట్టుకున్నదని, ఆయన ఆనవాళ్లు చెరపడం వారి వల్ల కాదని స్పష్టం చేశారు. 'కాళేశ్వరం మొదలుకొని, పాలమూరు, సీతారామ ప్రాజెక్టుల వరకు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, గురుకుల బడి నుంచి యాదాద్రి గుడి వరకు, నిరంతర విద్యుత్తు నుంచి మెడికల్ వైద్య విప్లవం వరకు, చివరికి మీరు కూర్చున్న సచివాలయ సౌధపు రాజసంలో ఉన్న కేసీఆర్‌ను.. ఎక్కడ చెరిపేస్తారు? ఎలా చెరిపేస్తారు?' అంటూ కేటీఆర్ సంధించిన శరపరంపర కాంగ్రెస్ సర్కారును ఉక్కిరిబిక్కిరి చేసింది.

అరచేతిలో వైకుంఠం చూపెట్టి అధికారంలోకి వచ్చి, వందరోజుల్లో ఇస్తామన్న ఒక్క కొత్త పథకమూ ఇవ్వకపోగా ఉల్టా రైతుబంధు లాంటి ఇది వరకున్న స్కీములనే ఎత్తివేసిన కాంగ్రెస్ ప్రభుత్వపు మోసాన్ని కూలంకషంగా వివరించిన కేటీఆర్ 'అన్నవస్త్రాల కోసం పోతే ఉన్న వస్త్రాలు పోయినట్టు అయ్యింద'ని అన్నారు. ఉద్యోగాలు ఇవ్వక నిరుద్యోగులను, రైతు భరోసా ఇవ్వక రైతన్నలను, పథకాలు రద్దుచేసి నేతన్నలను.. ఆర్టీసీ ఉద్యోగుల నుంచి ఆటో డ్రైవర్ల వరకు, మహిళల నుంచి పండు ముదుసలి వరకు నమ్మి ఓటేసిన ప్రతీ ఒక్కరినీ మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు.

అచ్చ తెలుగులో మాట్లాడుతూ, మధ్యలో తెలంగాణ కవులు రాసిన కవితలు, గేయాలను సందర్భోచితంగా ఉటంకిస్తూ, అధికార పక్షానికి కేటీఆర్ మూడు చెరువుల నీళ్లు తాగించారు. 'ఎన్నికల ముందు రజినీకాంత్, ఎన్నికలైపోయాక గజినీకాంత్, గ్యారంటీలకు టాటా, లంకె బిందెల వేట, ఓట్లకు ముందు అభయహస్తం, ఓట్లు పడ్డాక శూన్య హస్తం' అంటూ ప్రాసలతో, పంచ్‌లతో సాగిన కేటీఆర్ ప్రసంగం, అవసరమైన చోట గణాంకాలతో సోదాహరణంగా ప్రభుత్వ అంకెల గారడీని ఎండగట్టింది.

కాంగ్రెస్ వచ్చాక నేతన్నల దైన్యం గురించి వివరిస్తూ అలిశెట్టి ప్రభాకర్ రాసిన 'బతుకు దారాలు, దారులు తొలిగిపోయినయ్.. ముగ్గులు, మగ్గాలు మూగబోయినయ్.. ఇల్లిల్లు దాటి, సిరిసిల్ల దాటి తొందరగా వెళ్లిపోవే తల్లి దసరా' అనే కవితను కేటీఆర్ చదివి వినిపించారు.

> **మార్పు తెస్తామని తెలంగాణ**
> **ప్రజలను కాంగ్రెస్ ఎట్లా మోసం**
> **చేసిందో వివరిస్తూ..**
> **'మార్పు మార్పు అనుచు**
> **పలుమార్లు మార్చి మార్చి**
> **ఏమార్చి పిలిచిన మాత్రాన**
> **మార్పు వచ్చునా తత్వమందు.**
> **గోమారిని పేరు మార్చి**
> **సుకుమారి అని ముద్దుగ**
> **కోరికమేర పిలిచినా**
> **గోవుల నెత్తురు పీల్చకుండునా?'**
> **అంటూ కవి పల్లా దుర్గయ్య పద్యాన్ని**
> **కోట్ చేసి ఆకట్టుకున్నారు.**

తొలిరోజు హరీశ్‌రావు, మరుసటి రోజు జగదీశ్‌రెడ్డి, మూడోరోజు సబితా ఇంద్రారెడ్డి, నాలుగో రోజు కేటీఆర్.. ఇలా ఒక్కోరోజు ఒక్కో బీఆర్‌ఎస్ నాయకుడు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఒక బలమైన ప్రతిపక్షం ఉంటే ప్రభుత్వానికి ముకుతాడు ఎలా వేయొచ్చో చూపించారు.

సభలో బీఆర్‌ఎస్ నాయకులు చేసిన ఎదురుదాడికి కకావికలైన అధికార పార్టీ జవాబు చెప్పలేక చౌకబారు మాటలకు, బూతులకు, బెదిరింపులకు తెగబడింది. సీనియర్ మహిళా శాసనసభ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల మీద ఏకంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అక్కసుతో చేసిన వ్యాఖ్యల మీద సభలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఒక విధంగా చర్చల్లో బీఆర్‌ఎస్ పైచేయి సాధించడాన్ని జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ నాయకత్వం మహిళా నేతలపై దుర్మార్గపు దాడి చేసిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. చేసిన తప్పును సమర్థించుకోవడానికి రేవంత్ ప్రభుత్వం పడరాని పాట్లు పడ్డా ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందనేది మీడియా, రాజకీయ రంగాల్లో ఇప్పుడు జరుగుతున్న చర్చ.

పాలకులు వస్తుంటారు, పోతుంటారు. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా అభివృద్ధి, సంక్షేమం అనేవి జోడెడ్లలా ముందుకుసాగాలి. అధికార మార్పిడి జరిగినప్పుడు కొత్తగా కొలువైన ప్రభుత్వం గత సర్కారు చేసిన మంచి పనులను కొనసాగిస్తూనే మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషిచేయాలి. అంతేకానీ, ఓటమి పాలైన పార్టీపై అభాండాలు వేస్తూ కాలయాపన చేయడం సమంజసం కాదు.

సాగునీళ్లపై రాజకీయాలా?



జీడిపల్లి రాంరెడ్డి
96666 80051



రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేళ దురదృష్టవశాత్తూ కుంగిన మేడిగడ్డ పిల్లర్లనే ప్రచారాస్త్రంగా చేసుకున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రూ.90 వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించగా.. లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ గల్లీ లీడర్ల నుంచి ఢిల్లీ లీడర్ల దాకా మోత మోగించారు. నిజం గడప దాటకముందే అబద్ధం ఊరంతా చుట్టివచ్చిన చందంగా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఎన్నికలు ముగిశాయి, కొత్త ప్రభుత్వం కొలువైంది. బాధ్యతతో వ్యవహరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా కేసీఆర్ సర్కార్‌పై ఇప్పటికీ విషం చిమ్ముతూనే ఉన్నది. వరద వస్తే మేడిగడ్డ కొట్టుకుపోతుందని మొన్నటివరకు కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేశారు. కానీ, గోదావరి వరదలను, కాంగ్రెస్ కుట్రలతో కలెబడి మేడిగడ్డ నిలబడ్డది.

ఉమ్మడి ఏపీలో కరువు కాటకాలతో అల్లాడిన తెలంగాణ రైతాంగాన్ని కష్టాల నుంచి గట్టెక్కించాలనే సంకల్పంతో ఉద్యమనేత కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లకు నీరందించి మెదక్‌తో పాటు పది జిల్లాల సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చారు. కేసీఆర్ హయాంలో 18 టీఎంసీల నీళ్లతో మల్లన్నసాగర్ కళకళలాడుతుండేది. మేడిగడ్డను సాకుగా చూపుతూ కాంగ్రెస్ సర్కార్ నీటి పంపింగ్‌ను నిలిపివేయడంతో మల్లన్నసాగర్ సహా అనేక రిజర్వాయర్లు వట్టిపోయాయి. చుక్క నీరు కూడా ఎత్తిపోయకపోవడంతో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు వెలవెలబోతున్నాయి. నీళ్లు లేక భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. బోర్లు వట్టిపోతున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వచ్చినప్పటికీ కాంగ్రెస్ పాలకులు నీళ్లివ్వలేకపోతున్నారు. దీంతో ఒకటి అనుకుంటే.. ఇంకొకటి జరిగిందని రచ్చబండలు కోడై కూస్తున్నాయి.

తెలంగాణ ఉద్యమం జరిగిందే నీళ్ల గురించి. 'తలాపున పారుతుంది గోదారి.. నీ చేలు, నీ చెలకా ఎడారి' అని పాడుకున్నాం. కరువు, కాటకాలతో తెలంగాణ తల్లడిల్లుతున్నా, గోదావరి జలాలు సముద్రంలోకి వృథాగా పోతున్నా.. ఏ పాలకుడు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ వస్తేనే నీళ్ల గోస తీరుతుందని కేసీఆర్ పదేపదే చెప్పేవారు. చెప్పినట్టుగానే తన మాటను చేతల్లో చేసి చూపించారు. అపర భగీరథుడి దీక్షా, దక్షతలతో 557 మీటర్ల లోతులో ఉన్న గోదావరి జలాలు పంట పొలాలకు చేరాయి. తెలంగాణ సస్యశ్యామలమైంది.

గత నాలుగేండ్లుగా యాసంగిలోనూ కూడవెల్లి వాగు, హల్దీవాగుతో పాటు రామాయంపేట, ఉప్పరపల్లి, దుబ్బాక ప్రధాన కాలువల ద్వారా చెరువులు, కుంటలు నిండిపోయేవి. నీళ్లు విడిచిన మూడు రోజుల్లోనే మండుటెండల్లో సైతం కూడవెల్లి వాగు ద్వారా నర్మాల చెరువుకు గోదారి జలాలు చేరుకునేవి. కానీ, కాంగ్రెస్ సర్కార్ నిర్వాకంతో ప్రస్తుతం చెరువులు, కుంటలు, వాగులు, వంకలు వెలవెలబోతున్నాయి.

మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులకు గోదారి జలాలను తరలిస్తే ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు పరిసర జిల్లాలు కూడా సస్యశ్యామలమవుతాయి. కానీ, కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదు. ఎద్దేడ్చిన ఎవుసం, రైతేడ్చిన రాజ్యం మనుగడ సాగించలేవు. ఇప్పటికైనా భేషజాలకు పోకుం డా ప్రాజెక్టుల్లో నీళ్లు నింపి, పంట పొలాలకు అందించాలె. 'మాకు రాజకీయ కక్షలే కావాలి.. మేమింతే..' అంటే మాత్రం కర్రు కాల్చి ఎప్పుడు వాత పెట్టాలో రైతులకు బాగా తెలుసు. తస్మాత్ జాగ్రత్త..!



ఢిల్లీలో జయశంకర్ సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, వివేకానంద, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, దాసోజు శ్రవణ్ తదితరులు

మహోన్నత స్వాప్నికుడు జయశంకర్ సార్

మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): మహోన్నత స్వాప్నికుడు జయశంకర్ అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. సార్ జయంతి సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 'జయశంకర్ సార్ మార్గంలో, కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. తెలంగాణ ఉద్యమ చరిత్రలో జయశంకర్ ప్రత్యేక స్థానం. జయహో జయశంకర్ సర్ పిడికిలెత్తి పలుకుతుంది తెలంగాణ జోహార్' అంటూ ఆయన ట్వీట్ చేశారు.



తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జయశంకర్ సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మధుసూదనాచారి, నవీన్, శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, దేవీప్రసాద్, రాకేశ్, నగేశ్, ఆంజనేయగౌడ్ తదితరులు

జయశంకర్ సార్ స్ఫూర్తితోనే కేసీఆర్ పాలన

- అన్నివర్గాల సంక్షేమానికి పునాదులు
- పరంపరను కాంగ్రెస్ సర్కార్ కొనసాగించాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఢిల్లీలో జయశంకర్ జయంతి వేడుకలు

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ సార్ స్ఫూర్తితో కేసీఆర్ పదేండ్ల పాలన సాగిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమానికి కేసీఆర్ బలమైన పునాదులు వేశారని, ఆ పరంపరను కాంగ్రెస్ సర్కార్ కొనసాగించినప్పుడే సార్‌కు నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో జయశంకర్‌సార్ జయంతిని బీఆర్‌ఎస్ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాలకు జయశంకర్‌సార్ ప్రత్యక్ష సాక్షి అని, జీవితాంతం రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా పరితపించిన మహానుభావుడు అని కొనియాడారు. కేసీఆర్‌తో కలిసి సార్ ఢిల్లీలో తెలంగాణకు అనుకూలంగా దేశంలోని 36 రాజకీయ పార్టీలను ఒప్పించి లేఖలు ఇప్పించటంలో క్రియాశీలకంగా వ్యవహరించారని గుర్తుచేశారు. సార్ జీవిత లక్ష్యాన్ని కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సమాజం సాధించిందని పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లాకు, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి జయశంకర్‌సార్ పేరుపెట్టి కేసీఆర్ ఘన నివాళి అర్పించారని చెప్పారు. తెలంగాణ సమాజానికి, బీఆర్‌ఎస్‌కు సార్ ఆశీస్సులు ఉండాలని కాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాజ్యసభ సభ్యులు దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ పాల్గొన్నారు.

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రేరణతో పునరంకితం

- బీఆర్‌ఎస్ పక్ష నేత మధుసూదనాచారి
- తెలంగాణ భవన్‌లో జయశంకర్ జయంతి

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో పునరంకితం కావాలని శాసనమండలి బీఆర్‌ఎస్‌పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో జయశంకర్‌సార్ చిత్రపటానికి ఎమ్మెల్సీలు, నేతలతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ దేశపతి మాట్లాడుతూ తెలంగాణతల్లి తన కోసం నియమించుకున్న అడ్వకేట్ జయశంకర్ అని పేర్కొన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమశక్తులను ఏకం చేయటంలో సార్ క్రియాశీల పాత్ర పోషించారని గుర్తుచేశారు. మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణకు జరిగిన అన్యాయాలను రికార్డు చేసిన గొప్ప ఆలోచనాపరుడని కొనియాడారు. బీఆర్‌ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వరంగల్ ఏఎస్పీగా ఉన్న సమయంలో సార్‌ను కలిసిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. మాజీ ఎంపీ చంద్రశేఖర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, రాకేశ్, గెల్లు శ్రీనివాస్, గజ్జెల నగేశ్, ఆంజనేయగౌడ్, అనిల్ కూర్మాచలం, వాల్యానాయక్, వాసుదేవరెడ్డి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు పాల్గొన్నారు.

అసెంబ్లీ ప్రాంగణంలో..

తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

15 రోజుల్లో ఆడిట్ పూర్తి చేయండి

- మార్క్‌ఫెడ్‌కు తుమ్మల ఆదేశం
- 'నమస్తే తెలంగాణ' కథనంపై మంత్రి స్పందన

హైదరాబాద్, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ): ఎరువుల సరఫరాపై 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్‌ను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని మార్క్‌ఫెడ్ అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఎరువుల సరఫరాపై ఆడిట్ జరగకపోవడంతో కొందరు ఉద్యోగులు ఎరువుల సొమ్మును నొక్కేస్తున్నారంటూ 'ఆడిట్ లేదు... అరాచకమే' శీర్షికన ఈ నెల 4న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురించిన నేపథ్యంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. పక్కదారి పట్టిన సొమ్మును రికవరీ చేయాలని చేయాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైనా చర్యలు తప్పవని హెచ్చరించినట్టు తెలిసింది.

20 గంటల్లోనే 30 వేలు

- రుణమాఫీపై బీఆర్‌ఎస్ వాట్సాప్ నంబర్ 83748 52619కు ఫిర్యాదుల వెల్లువ
- వివరాలు పంపుతున్న రైతులు
- రేషన్‌కార్డు లేకపోతే రుణమాఫీ లేనట్టే!



హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): రూ.లక్షన్నర వరకు రుణమాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణభవన్‌లో ఏర్పాటుచేసిన వాట్సాప్ నంబర్ 83748 52619కు కేవలం 20 గంటల్లోనే దాదాపు 30 వేల ఫిర్యాదులు అందడం పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నది. రూ.లక్షన్నర మాఫీపై ప్రభుత్వం చెప్తున్నదానికీ, క్షేత్రస్థాయిలో వాస్తవిక పరిస్థితులకు పొంతన లేదనడానికి ఈ ఫిర్యాదులే నిదర్శనం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతులు తమకు రుణమాఫీ కాలేదంటూ వాట్సాప్ నంబర్‌కు సమాచారం అందజేస్తున్నారు. రుణమాఫీకి, రేషన్‌కార్డుతో సంబంధంలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సహా మంత్రులు చెప్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని వస్తున్న ఫిర్యాదులు స్పష్టం చేస్తున్నాయి. చిన్న చిన్న సాంకేతిక అంశాలను చూపి తమకు రుణమాఫీ చేయడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతాలో ఇంటిపేరు, అసలు పేరు, పేరు చివరన కుల ప్రస్తావన ఇలా అన్నీ మ్యాచ్ కావాలి... ఇందులో ఏ ఒక్కటి లేకపోయినా రుణమాఫీ చేసేది లేదన్నట్టుగా సర్కార్ వ్యవహరిస్తున్నది.

బీఆర్‌ఎస్ కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదుల్లో మచ్చుకు కొన్ని..

- మాది జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామం. నాకు 2.20 ఎకరాల భూమి ఉన్నది. ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్‌లో నా పేరు పెద్దిరాజు గౌడ్ అని ఉన్నది. బ్యాంకులో పెద్దిరాజు అని ఉన్నది. కేసీఆర్ హయాంలో రైతుబంధు, రుణమాఫీ డబ్బులు ఇదే ఖాతాలో పడ్డాయి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆధార్‌కార్డులో ఉన్న పేరుకు బ్యాంకులో ఉన్న పేరు మ్యాచ్ కావడం లేదంటూ రుణమాఫీ చేయలేదు. నాకు రుణమాఫీ వచ్చేలా చూడండి
- నాపేరు కల్వకోలు సురేందర్‌రెడ్డి. మాది కొంగరకలాన్. నాకు పంట రుణం రూ.లక్ష వరకే ఉన్నది. కానీ ఇంత వరకు మాఫీ కాలేదు.
- నా పేరు ఆకుల దామోదర్. మాది వికారాబాద్ జిల్లా చౌడారం మండలం అడవివెంకటాపూర్ గ్రామం. నాకు క్రాప్‌లోన్ రూ.54 వేలే ఉన్నది. ఇంకా మాఫీ కాలేదు.
- మాది పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూర్. నాపేరు దరావత్ కిశోర్. బ్యాంకులో రూ.లక్షా 26 వేల అప్పు ఉన్నది. నాకు రేషన్‌కార్డు లేదని రుణమాఫీ కాలేదు.

రుణమాఫీ జాబితా తప్పుల తడక

- రైతుల జాబితా కూడా సరిగ్గా రూపొందించలేరా?
- వేల కోట్లు ఖర్చు చేసినా ప్రయోజనం లేదు
- మీ వల్ల ప్రభుత్వం బద్నాం
- టెస్కాబ్‌పై తుమ్మల ఆగ్రహం
- 16 మంది ప్యాక్స్ కార్యదర్శుల సస్పెన్షన్



హైదరాబాద్, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ): రుణమాఫీలో రైతుల జాబితా మొత్తం తప్పుల తడకగా ఉన్నదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. 'కనీసం రైతుల జాబితా కూడా సరిగ్గా చేయలేరా? ఎందుకీ తప్పులు జరిగాయి?' అంటూ టెస్కాబ్ సీజీఎం జ్యోతిని నిలదీసినట్టు సమాచారం. మంగళవారం ఆయన సచివాలయంలో రుణమాఫీపై టెస్కాబ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'రుణమాఫీలో టెస్కాబ్ పూర్తిగా విఫలమైంది.. మీ వైఫల్యం వల్ల ప్రభుత్వం బద్నాం అవుతున్నది. రూ.వేల కోట్లు వెచ్చిస్తున్నా.. టెస్కాబ్ తప్పిదాల వల్ల ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం కలగడం లేదు' అని ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. రుణమాఫీ సమస్యల్లో మెజార్టీ టెస్కాబ్ అనుబంధ బ్యాంకులవే ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పులన్నీ సరిచేయాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించినట్టు తెలిసింది.

13 మంది కార్యదర్శులపై చర్యలు

రుణమాఫీలో తప్పుడు లెక్కలు సమర్పించడం, నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు 16 మంది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మరో 13 మంది కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించింది. ఈ మేరకు సహకార శాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన 16 సంఘాల కార్యదర్శులు తప్పుడు లెక్కలు సమర్పించినట్టు, రుణాలు తీసుకోకపోయినా, రుణమాఫీ గడువులో రుణం లేని వాటిని కూడా జాబితాలో పొందుపరిచినట్టు గుర్తించారు. దీంతో వారిపై చర్యలకు ఉపక్రమించారు. మరో 105 మంది కార్యదర్శులు అసలు, వడ్డీల లెక్కలు తప్పుగా పంపించినట్టు గుర్తించి వారిని వివరణ కోరారు. రుణమాఫీలో అధికారులు జాగ్రత్తగా ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.



సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో ఐవోబీ మేనేజర్‌తో మాట్లాడుతున్న రైతులు, నాయకులు

మా రుణాలెందుకు మాఫీకాలె?

బ్యాంకు మేనేజర్‌ను నిలదీసిన రైతులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6: అర్హతలున్నా రుణం ఎందుకు మాఫీ కాలేదని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్‌ను మంగళవారం రైతులు నిలదీశారు. బ్యాంకులో ఖాతాలు ఉన్న 30 మంది రైతులు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరితో కలిసి బ్యాంకుకు చేరుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమకు అన్ని అర్హతలు ఉన్నా రెండు విడతల్లో తమ పేర్లు ఎందుకు రాలేదని మేనేజర్‌ను నిలదీయడంతోపాటు కారణాలు అడిగి తెలుసుకున్నారు. సాంకేతికంగా సమస్య తలెత్తిందని, ఆ సమస్యను అధిగమించి త్వరలోనే అందరికీ మాఫీ అయ్యేలా చూస్తామని బ్యాంకు అధికారులు చెప్పడంతో రైతులు శాంతించారు.

15న 2 లక్షల రుణమాఫీకి ప్రయత్నం

- వైరాలో సీఎం రేవంత్‌తో చేయించేలా ఆలోచన
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): ఈ నెల 15 వరకు ప్రతి రైతుకు రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేస్తామన్న మాటపై ప్రభుత్వం నిలబడే సూచనలు కనిపించడం లేదు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 15న రూ.2 లక్షలలోపు రుణాలను మాఫీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. వైరాలో గోదావరి జలాలను ఖమ్మంకు అందించే సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయించాలని వ్యవసాయ శాఖ ఆలోచన చేస్తున్నదని తెలిపారు. మూడో విడతలో భాగంగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని, ఇందులో సుమారు ఆరు లక్షల మంది రైతులకు రూ.ఆరు వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని వెల్లడించారు. ఈ లెక్క ప్రకారం మూడు విడతల్లో కలిపి ప్రభుత్వం 23.74 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసినట్టవుతుంది. ఈ లెక్కన రుణమాఫీ కోసం ప్రభుత్వం చేసే ఖర్చు రూ.18 వేల కోట్లు మాత్రమే కావడం గమనార్హం.

30 వేల మందికి రుణమాఫీ కాలేదు

గత నెల 29న చేసిన రూ.1.5 లక్షల వరకు రెండో విడత రుణమాఫీలో సాంకేతిక కారణాలతో 30 వేల మంది రైతులకు సాధ్యం కాలేదని మంత్రి వెల్లడించారు. తొలి విడతలో రూ. లక్ష వరకు రుణమాఫీలో 17 వేల ఖాతాలకు రుణమాఫీ కాలేదని, రూ.84 కోట్లు ప్రభుత్వానికి రిటర్న్ వచ్చాయని వివరించారు. 10 వేల ఖాతాలను సరి చేసి రూ.44 కోట్లు తిరిగి రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. ఏడు వేల ఖాతాల సమస్యను పరిష్కరించాల్సి ఉన్నదని చెప్పారు. సాంకేతిక తప్పిదాలతో రుణమాఫీ కాని రైతుల కోసం ఈ నెల 15 తర్వాత కార్యాచరణ ప్రారంభించనున్నట్టు తెలిపారు.

తప్పిదాలకు బ్యాంకులదే బాధ్యత

రుణమాఫీలో తప్పిదాలకు బ్యాంకులే బాధ్యత వహించాలని మంత్రి స్పష్టంచేశారు. అప్పు ఉన్న రైతుల ఖాతాల వివరాలు ఇవ్వాలని మే నెలలోనే బ్యాంకులను కోరినట్టు తెలిపారు. బ్యాంకర్లు పంపిన వివరాల ప్రకారమే రుణమాఫీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. సరైన వివరాలు ఎందుకు పంపించలేదు? ఇందుకు కారణాలేమిటి? అనే అంశంపై వివరణ ఇవ్వాలని బ్యాంకులను కోరినట్టు తెలిపారు. ఆ తర్వాత ఏం జరుగుతుందో చూద్దామని వ్యాఖ్యానించారు.

2022 మే తర్వాత తీసుకున్న రుణాలనే మాఫీ చేయాలి

2022 మే 6న వరంగల్ రైతుసభలో రాహుల్‌గాంధీ రైతు డిక్లరేషన్‌ను విడుదల చేశారని, నాడు ఇచ్చిన హామీ ప్రకారం.. 2022 మే తర్వాత తీసుకున్న రుణాలను మాఫీ చేయాల్సి ఉంటుందని తుమ్మల చెప్పారు. ఐదేండ్ల క్రితం తీసుకున్న రుణాలను కూడా మాఫీ చేస్తున్నామని తెలిపారు.

అప్పుచేసి కడుతున్నారనుకుంటే ఎలా?

రుణమాఫీలో భాగంగా రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాన్ని ముందుగా చెల్లించాలన్న నిబంధనతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, పెట్టుబడి కాలం కావడంతో అప్పు చేసి మరీ మొత్తం చెల్లిస్తున్నారని, ఈ నిబంధనను సడలించాలంటూ రైతు సంఘాలు చేస్తున్న డిమాండ్‌ను మీడియా ప్రతినిధులు మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి... 'రైతులు ఇంట్లో ఉన్నవి కట్టారేమో నాకేం తెలుసు? అందరూ అప్పు తెచ్చి కట్టారని మీరెలా అనుకుంటారు?' అంటూ ఎదురు ప్రశ్నించడం గమనార్హం. రూ.2 లక్షలకు ఎక్కువ ఉన్న మొత్తాన్ని చెల్లించి ఆ తర్వాత పది లక్షలు తీసుకో అది మీ ఇష్టం అంటూ రైతులకు సలహా ఇచ్చారు. ఈ వ్యాఖ్యలు రైతులను కించపరిచేలా ఉన్నాయని రైతులు, రైతు సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఫలితమివ్వని గ్రీవెన్స్ కమిటీ

- రైతులు ఫిర్యాదులు చేసినా స్పందన కరువు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 300కు పైగా ఫిర్యాదులు

మేడ్చల్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ వర్తింపుకాని రైతుల కోసం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీతో ఎలాంటి ఫలితం లేదని రైతులు మండిపడుతున్నారు. రెండు విడతలుగా రుణమాఫీకాని రైతులు గ్రీవెన్స్ కమిటీలో ఫిర్యాదులు చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా బౌరంపేట్, దూలపల్లి, డబిల్‌పూర్, మేడ్చల్, కీసర, శామీర్‌పేట్, పూడూర్, ఘట్‌కేసర్, అల్వాల్‌లో సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల పరిధిలో ఇప్పటి వరకు 3,091 మంది రైతులకు రూ. 17 కోట్లు మాత్రమే రుణమాఫీ అయింది. రుణమాఫీకాని రైతులు 300 మంది గ్రీవెన్స్ కమిటీలో ఫిర్యాదులు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ సంఖ్య వేలల్లో ఉన్నా అధికారులు గోప్యంగా ఉంచుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు ఇచ్చిన రైతులకు ఎలాంటి సమాధానాలు అధికారులు ఇవ్వలేదని చెప్పారు. గ్రీవెన్స్ కమిటీలో రైతుల ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించినా కింది స్థాయి అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నెల చివరివారంలో అందిస్తామన్న రూ.2 లక్షల రుణమాఫీ ఎంత మందికి వర్తింపజేస్తారన్న ఆందోళన రైతుల్లో నెలకొన్నది.

రైతుభరోసా ఇప్పట్లో ఇవ్వలేం

> మొదటిపేజీ తరువాయి...

స్పష్టత రావాల్సి ఉన్నదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పంట వేయని భూములకు రైతుబంధు రూ.25 వేల కోట్లు ఇచ్చారని, వాటిని రికవరీ చేయబోమని స్పష్టంచేశారు.

రైతుల ఎదురుచూపులు

వానకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రైతులు సాగు పనుల్లో బీజీ అయిపోయారు. సగం పంటల సాగు కూడా పూర్తయింది. దీంతో రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. సాగు సమయంలో పెట్టుబడి సాయం పంపిణీ చేస్తే ఎరువులు, విత్తనాలు, దుక్కి ఖర్చులు, కూలీలకు ఇలా ఏదో ఒకరకంగా రైతులకు ఆ డబ్బులు ఉపయోగపడుతాయి. రైతుబంధు (రైతుభరోసా) ముఖ్య ఉద్దేశం కూడా ఇదే. కానీ ప్రభుత్వం మాత్రం పెట్టుబడి సాయంపై కాలయాపన చేసే దిశగా సాగుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అసెంబ్లీలో చర్చేది... కమిటీ రిపోర్టు ఏదీ?

రైతుభరోసాపై ప్రభుత్వం కావాలనే ఆలస్యం చేస్తున్నదనే విమర్శలొస్తున్నాయి. ఇందుకు అభిప్రాయ సేకరణ అని ఒకసారి, అసెంబ్లీలో చర్చ అని మరోసారి, మంత్రుల కమిటీ అని ఇంకోసారి సాకులు చెప్తున్నదనే విమర్శలున్నాయి. మొన్నటివరకు రైతుభరోసాపై అసెంబ్లీలో పూర్తిస్థాయిలో చర్చించి ఆ తర్వాత రైతులకు పెట్టుబడి సాయం పంపిణీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు ప్రకటించారు. కానీ అసెంబ్లీలో రైతుభరోసా అంశమే చర్చకు రాలేదు. మంత్రులతో సబ్ కమిటీ వేశామని, ఆ కమిటీ అసెంబ్లీ సమావేశాల వరకు అన్ని జిల్లాలు పర్యటించి రైతుల అభిప్రాయాలు సేకరించి నివేదిక ఇస్తుందని, దాని ఆధారంగానే పంపిణీ చేస్తామని చెప్తూ వచ్చారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయినా, మంత్రుల కమిటీ నివేదిక మాత్రం ప్రభుత్వానికి అందలేదు.

రుణమాఫీ ఎర్రర్ లిస్ట్ ఎందుకు పంపలే?

- పీఏసీఎస్ సిబ్బందిపై డీసీవో ఫైర్
- ప్యాక్స్‌లో ఘరానా మోసంపై విచారణ


నమస్తే ఎఫెక్ట్

గండీడ్, ఆగస్టు 6 : 'మీ నిర్లక్ష్యం వల్ల రైతులకు ఇబ్బందులు రావొద్దు' అని డీసీవో పద్మ మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బందికి సూచించారు. లోన్ తీసుకోకపోయినా రుణమాఫీ లిస్ట్‌లో పేరు వచ్చిందని ఫోన్‌కు మెసేజ్‌లు వస్తున్నాయంటూ సోమవారం రైతులు ఆందోళన చేయడంతో 'నమస్తే తెలంగాణ'లో 'పీఏసీఎస్‌లో ఘరానా మోసం!' పేరిట కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన డీసీవో మంగళవారం గండీడ్ పీఏసీఎస్‌ను సందర్శించారు. రుణమాఫీలో అవకతవకలపై వివరాలు సేకరించారు. రుణమాఫీ లిస్ట్ వెంటనే పంపించాలని, సరిగ్గా పనిచేయకపోతే వేటు తప్పదంటూ హెచ్చరించారు.

సీఎం రేవంత్ గద్దె దిగాలి

- 8 నెలలైనా హామీలు బుట్టదాఖలు
- ప్రజాభవన్‌లో మహిళల ఆగ్రహం

జూబ్లీహిల్స్, ఆగస్టు 6: ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీల హామీల అమలులో పూర్తిగా విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి గద్దె దిగాలని పలువురు మహిళలు మండిపడ్డారు. మంగళవారం ప్రజాభవన్‌కు వచ్చిన ముస్లిం మైనార్టీ మహిళలు ప్రజాపాలనలో 8 నెలల క్రితం ఇచ్చిన తమ దరఖాస్తులు ఏమయ్యాయని నిలదీశారు. బాలానగర్ చింతల్‌కు చెందిన షను, కుత్బుల్లాపూర్‌కు చెందిన తాహెరా బేగం మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్ ఇప్పటికీ అందలేదని, రూ.500కు సిలిండర్ ఉత్త గ్యాసేనని ఎద్దేవా చేశారు. బస్సు ఫ్రీ ఇస్తే మహిళలకు సీటులేదని వాపోయారు. మహిళలకు రూ.2500పథకం బూటకమని దుయ్యబట్టారు. 100 రోజులలో చేస్తామన్న పథకాలు 8నెలలైనా అమలు జరుగలేదని, రేవంత్ పాలన బేకార్ అని వ్యాఖ్యానించారు. మళ్లీ కేసీఆర్, కేటీఆర్‌ను దించుతామని.. రేవంత పాలనలో భద్రత కూడా కరువయ్యిందని ఏకరువు పెట్టారు..



ప్రజాభవన్ వద్ద మాట్లాడుతున్న మహిళలు షను, తాహెరా బేగం

5,200 వేతనంతో ఎట్లా బతికేది ?

ఉపాధి హామీ పథకం అటెండర్ల ఆవేదన

ప్రజాభవన్, ఆగస్టు 6 : ప్రజాపాలన తెస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి 8 నెలలుగా ఉపాధి హామీ సిబ్బంది వేతనాల ఊసే ఎత్తడంలేదని.. ప్రజావాణి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడంలేదని సంబంధిత ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం టీఎంఏ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దేవేందర్, షేక్ బీపాషా ఆధ్వర్యంలో ప్రజాభవన్‌కు చేరుకున్న సిబ్బంది ప్రభుత్వం ఇచ్చే రూ.5200 జీతంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవో కార్యాలయాల్లో నియమితులైన 540 మంది ఎంసీసీ అటెండర్ల జీతభత్యాలు ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణాలే సరిపోయాయన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

బుధవారం WEDNESDAY 7.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం Pages: 12+4 + 8 Pages NIPUNA supplement | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 63 ‖ వెల (Price) రూ.6.50

తదియ

బుధవారం, సూర్యోదయం: 5-57, సూర్యాస్తమయం: 6-46. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం శుక్ల పక్షం తిథి: తదియ రాత్రి 10-06 వరకు. నక్షత్రం: పూర్వఫల్గుణి రాత్రి 8-30 వరకు. వర్జ్యం: తెల్లవారుజామున 4-38 నుంచి మర్నాడు ఉదయం 6-26 వరకు. రాహుకాలం: పగలు 12-21 నుంచి పగలు 1-57 వరకు. దుర్ముహూర్తం: పగలు 11-56 నుంచి పగలు 12-47 వరకు. అమృతకాలం: పగలు 1-21 నుంచి పగలు 3-09 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

ఫోగాట్ పతక గర్జన

ఒలింపిక్స్ ఫైనల్‌కు తొలి భారత మహిళా రెజ్లర్

అరుదైన రికార్డు సొంతం చేసుకున్న వినేశ్

› 12





ఫైనల్‌కు నీరజ్ చోప్రా

జావెలిన్‌త్రోలో తుది పోరుకు

తొలి ప్రయత్నంలోనే 89.34 మీటర్ల దూరం

› 12

5,560 కోట్లతో పైప్‌లైన్!

- హైదరాబాద్‌కు నీళ్ల కోసమంటూ పరిపాలన అనుమతి
- మల్లన్నసాగర్ నుంచి నగరానికి 15 టీఎంసీల తరలింపు
- 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 60 శాతం ఏజెన్సీ ఖర్చు
- రెండేండ్లలో భారీ పైపులైన్, నీటిశుద్ధి కేంద్రాల నిర్మాణం
- కేసీఆర్ ప్రభుత్వంలో గోదావరి మొదటి దశ పూర్తి
- కాళేశ్వరం 30 టీఎంసీలతో నగరానికి శాశ్వత భరోసా

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగర భవిష్యత్తు తాగునీటి అవసరాలు తీర్చేందుకు 'గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లయ్ ఫేజ్-2'కు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ మంగళవారం జీవో 345 జారీచేశారు. గోదావరి రెండో దశ పనులకు ప్రభుత్వం రూ.5,560 కోట్లు కేటాయించింది. హెచ్‌ఏఎం మోడ్‌లో భాగంగా 40 శాతం ప్రభుత్వ వాటా, 60 శాతం సంబంధిత ఏజెన్సీ ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు దక్కించుకున్న ఏజెన్సీ రూ.3,336 కోట్లు తొలుత భరించి ఆ తర్వాత జలమండలి నుంచి వసూలు చేయనుంది. 40 శాతం ప్రభుత్వ వాటా కోసం రూ. 2,224 కోట్ల హడ్కో › 2వ పేజీలో

పైప్‌లైన్‌లో పారేదేంది?

గోదావరి మంచినీటి పథకం వెనుక మతలబేమిటో?

గ్రావిటీ వద్దని నిధుల 'పంపింగ్'కే సర్కారు మొగ్గు

అదనంగా 27 కిలోమీటర్లు పెరిగిన పైప్‌లైన్

రూ.540 కోట్లకుపైగా అదనపు భారం

మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు ఇప్పటికే పంప్‌హౌజ్, కాల్వలు సిద్ధంగా ఉన్నాయి. వ్యవసాయ అవసరాల కోసం కొండపోచమ్మను ఎట్లాగూ నింపాల్సిందే. దగ్గర్లో ఉన్న కొండపోచమ్మ నుంచి గ్రావిటీలో సిటీకి నీళ్లు తెచ్చుకునే వీలున్నా దాన్ని కాదని దూరంగా ఉన్న మల్లన్న సాగర్‌కు పైప్‌లైన్ వేయడం ఎందుకన్నది నిపుణుల ప్రశ్న


నాడొకమాట.. నేడొక మాట తుమ్మిడిహట్టిలో నీటి లభ్యత లేదని, ప్రాణహితలో ఉన్నదని కేసీఆర్ కాళేశ్వరాన్ని ఎంచుకుని ప్రాజెక్టు కడితే కాంగ్రెస్ దాన్ని తప్పన్నది. మరిప్పుడేమో కొండపోచమ్మలో నీళ్లు తక్కువని, మల్లన్నసాగర్‌లో మాత్రమే ఉన్నాయని అక్కడ నుంచి పైప్‌లైన్ వేస్తున్నది.



సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌లోకి మంగళవారం కాళేశ్వరం నుంచి గోదావరి జలాలను విడుదల చేశారు. చంద్లాపూర్‌లోని సర్జ్‌పూల్ నుంచి రెండు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు.

- కొండపోచమ్మ నుంచి గ్రావిటీపై కేసీఆర్ సర్కార్ డిజైన్
- తాజాగా మల్లన్నసాగర్‌ను ఎంచుకున్న రేవంత్ సర్కార్
- దగ్గరలోనే ఉన్న కేశవాపురం కాదని దూరానికి పైప్‌లైన్
- మార్పుపై నీటి పారుదల, జలమండలి చెరో వాదన
- 108 మీటర్ల మేర నీటి ఎత్తిపోతకు ఖర్చు తడిసిమోపెడు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/సిటీబ్యూరో, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన కొండపోచమ్మ సాగర్ ఎఫ్‌ఆర్‌ఎల్ 618 మీటర్లు! ఇదే పథకంలో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌ఆర్‌ఎల్ 557 మీటరు! మరి 595 మీటర్ల ఎత్తులో ఉన్న మేడ్చల్ జిల్లాలోని ఘన్‌పూర్ ప్రాంతానికి గోదావరి జలాలను తరలించాలంటే ఎవరైనా దేనిని › 2వ పేజీలో





తెలంగాణలో జీవన ఇంధన ప్లాంట్ కోసం అమెరికాలో ఒప్పందం చేసుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, ప్రవీణ్ పరిపాటి

ఒప్పందం 'స్వచ్ఛ'మేనా?

జీవ ఇంధన ప్లాంట్‌పై అగ్రిమెంట్.. అనేక అనుమానాలు

- స్వచ్ఛ్ బయోతో ఒప్పందం అంటూ సీఎంవో ప్రకటన
- దాని చైర్‌పర్సన్ ప్రవీణ్ పరిపాటితో పత్రాల మార్పిడి
- ప్రవీణ్ పరిపాటి పేరు మీద కనిపించని స్వచ్ఛ్ బయో
- అసలు స్వచ్ఛ్ బయో పేరుతో కంపెనీయే కరువు
- రికార్డుల్లో ఉన్నది స్వచ్ఛ్ బయో గ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్
- డైరెక్టర్‌గా సీఎం తమ్ముడు జగదీశ్వర్‌రెడ్డి ఎనుముల
- 15 రోజుల కిందే ఏర్పాటు.. షేర్ క్యాపిటల్ 10 లక్షలు

లేని కంపెనీతో ఒప్పందం జరిగిందా?

సీఎం తమ్ముడి కంపెనీ పేరు తప్పు రాశారా?

సీఎంవో వివరణ ఇవ్వాలన్న నెటిజన్లు

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో రూ.వెయ్యి కోట్లతో బయో ఫ్యూయెల్స్ ప్లాంటును ఏర్పాటు చేసేందుకు 'స్వచ్ఛ్ బయో' అనే కంపెనీ ముందుకొచ్చింది. సోమవారం న్యూయార్క్‌లో జరిగిన చర్చల అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో కంపెనీ చైర్మన్ ప్రవీణ్ పరిపాటి ఎంవోయూ కుదుర్చుకున్నారు. మొదటిదశలో దాదాపు రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో ప్లాంట్ నిర్మించనున్నారు. ఈ ప్లాంట్ ఏర్పాటులో 250 మందికి ప్రత్యక్షంగా, 250 మందికి పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. స్వచ్ఛ బయోతో అంతర్జాతీయ భాగస్వామిగా ఉన్న సుగనిత్ బయో రెన్యువబుల్స్ కంపెనీ.. › 6వ పేజీలో

రైతుభరోసా ఇప్పట్లో ఇవ్వలేం

పెట్టుబడి సాయం పంపిణీ ఆలస్యం అవుతుంది

రైతులు, మేధావుల అభిప్రాయ సేకరణ పూర్తికాలేదు

విధివిధానాలపై అసెంబ్లీలో చర్చించలేకపోయాం

రైతు, కౌలురైతు అంశంపై ఇంకా స్పష్టత రావాలి

పంట వేసిన రైతులకే రైతుభరోసా: మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ): వానకాలం సీజన్ రైతు భరోసా (రైతుబంధు) పెట్టుబడి సాయం పంపిణీపై ప్రభుత్వం చేతులెత్తిసినట్టే కనిపిస్తున్నది. పెట్టుబడి సాయం ఇప్పట్లో ఇవ్వలేమని, ఆలస్యమవుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. రైతుభరోసా విధి విధానాలపై రైతులు, మేధావులతో అభిప్రాయ సేకరణ పూర్తి కాలేదని తెలిపారు. మంగళవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రైతుభరోసాపై చర్చలు జరుపుతున్నామని, పంట వేసిన రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం భావిస్తున్నదని వెల్లడించారు. ఇందుకోసం రైతులు, రైతు సంఘాల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికి ఐదారు ఉమ్మడి జిల్లాల్లో మాత్రమే అభిప్రాయ సేకరణ పూర్తయిందని, మరో మూడు నాలుగు జిల్లాలు మిగిలి ఉన్నాయని పేర్కొన్నారు. శాసన సభ సమావేశాల కారణంగా అభిప్రాయ సేకరణ వాయిదా పడినట్టు తెలిపారు. అభిప్రాయ సేకరణ పూర్తయిన తర్వాత నిజమైన, పంట వేసిన రైతులకు మాత్రమే ఇవ్వాలనేదే ప్రభుత్వ ఆలోచన అని స్పష్టంచేశారు. దీంతోపాటు రైతులు, కౌలు రైతుల అంశంపై కూడా › 3వ పేజీలో



15 లోగా 2 లక్షల మాఫీకి ప్రయత్నిస్తం

- తప్పులతో మాఫీ కాకపోతే బ్యాంకులదే బాధ్యత
- రెండో విడతలో 30 వేల మందికి సమస్యలు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



రుణమాఫీపై ఫిర్యాదుల వెల్లువ

- బీఆర్‌ఎస్ వాట్సాప్ నంబర్‌కు రైతుల నుంచి మెసేజ్‌లు
- 20 గంటల్లో 30 వేల మంది రుణమాఫీ బాధితుల ఫిర్యాదు

› 3

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేపై జులుం

- తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద అధికార పార్టీ నేతల దౌర్జన్యం
- ప్రొటోకాల్‌ను అపహాస్యం చేసిన కాంగ్రెస్ నాయకుడు
- తొలుత మోటర్లను ఆన్ చేసిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- ఆ తర్వాత వచ్చి మోటర్లను బంద్ చేయించిన సంపత్‌కుమార్
- రైతులకు నీళ్లివ్వాలని పోలీసుల కాళ్లు పట్టుకున్న ఎమ్మెల్యే
- విజయుడి అరెస్టుపై నిరసనలు

› 2

స్పీకర్‌కు గడువు పెడ్తం

మీ వైఖరి ఏమిటో చెప్పండి..!

నిర్దిష్ట గడువులోగా నిర్ణయించాలని సుప్రీంకోర్టు చెప్పింది కదా?

పార్టీ ఫిరాయింపుల కేసులో అడ్వకేట్ జనరల్‌కు హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలోగా పరిష్కరించాలని తాము స్పీకర్‌కు గడువు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని, దీనిపై మీ వైఖరి ఏమిటో చెప్పాలని అడ్వకేట్ జనరల్‌ను హైకోర్టు ప్రశ్నించింది. బీఆర్‌ఎస్ తరఫున ఎన్నికై కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు దాఖలుచేసిన పిటిషన్లపై హైకోర్టులో మంగళవారం కూడా వాదనలు కొనసాగాయి. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం వెలువరించిన ఉత్తర్వుల ప్రకారం ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై పిటిషన్లను మూడు నెలల్లోగా పరిష్కరించాలని చెప్పారు. దీనిపై అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి స్పందిస్తూ.. స్పీకర్‌కు కోర్టులు ఆదేశాలు జారీ చేయరాదన్నదే తమ వాదన అని, పిటిషన్‌కు విచారణార్హత లేదని ప్రకటించాలని తాము మొదటినుంచి వాదిస్తున్నామని, ఈ పరిస్థితుల్లో కోర్టు ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. మణిపూర్ ఎమ్మెల్యేలకు సంబంధించి కేశం మెఘచంద్ కేసులో సుప్రీంకోర్టు నిర్దిష్ట గడువులోగా స్పీకర్ తన ముందున్న పిటిషన్‌పై ఉత్తర్వులు జారీచేయాలని చెప్పింది కదా? అని హైకోర్టు ప్రశ్నించింది. మరో సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ కల్పించుకుంటూ.. స్పీకర్ ముందున్న పిటిషన్లను విచారణ చేయాలని ఇప్పటివరకు సుప్రీంకోర్టు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని చెప్పారు. మణిపూర్ ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని 142వ అధికరణం కింద స్పీకర్‌కు నోటీసులు జారీ చేసిందని గండ్ర మోహన్‌రావు గుర్తుచేశారు. స్పీకర్ రాజ్యాంగ విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని గండ్ర మోహన్‌రావు ఆరోపించారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో పార్టీ ఫిరాయింపుల పిటిషన్‌పై › 6వ పేజీలో





నల్లా కనెక్షన్లలో తెలంగాణ ఫస్ట్

- గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ ట్యాప్ కనెక్షన్
- 2020-21నాటికే పెద్ద రాష్ట్రాల్లో మనమే టాప్
- నల్లా కనెక్షన్లలో దేశ సగటు 77.83 శాతం మాత్రమే
- రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర జల్‌శక్తి మంత్రి


హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ నల్లా కనెక్షన్ల ద్వారా తాగునీటిని అందించడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచింది. దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో 2021నాటికే 100శాతం ట్యాప్ కనెక్షన్ ద్వారా తాగునీటిని అందించిన రాష్ట్రంగా ఖ్యాతి గడించింది. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ సోమవారం రాజ్యసభకు వెల్లడించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ › 5వ పేజీలో

మాపై ఎన్ని ఒత్తిళ్లో మీకేం తెలుసు?

- మా స్థానంలో మీరు కూర్చుంటే తెలుస్తది
- లాయర్లపై సీజేఐ చంద్రచూడ్ ఆగ్రహం
- ముందుగా తమ పిటిషన్లను విచారించాలన్న ఒత్తిడిపై తీవ్ర అసహనం

› 8





యూనస్‌కు బంగ్లా పగ్గాలు

- తాత్కాలిక ప్రభుత్వాధినేతగా నోబెల్ గ్రహీత
- విద్యార్థుల ప్రతిపాదనకు దేశాధ్యక్షుడి ఆమోదం
- బంగ్లా రాజకీయ సంక్షోభానికి తాత్కాలిక తెర
- షేక్ హసీనా రాజీనామాతో రాజకీయ సంక్షోభం
- పార్లమెంటును రద్దు చేసిన అధ్యక్షుడు షహాబుద్దీన్
- తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సమ్మతి
- జైలు నుంచి మాజీ ప్రధాని ఖలీదా జియా విడుదల

› 7

గ్రూప్-1 అంతా సక్రమమే!

- న్యాయచిక్కులు ఉండొద్దనే జీవో 55ను సవరించాం
- జీవో29 లోనూ రిజర్వేషన్లు పాటించాలనే ఉన్నది
- తొలుత జనరల్ మెరిట్.. ఆ తర్వాతే 1:50 ఎంపిక
- షార్ట్‌ఫాల్ ఉంటే కిందివారికి అవకాశం కల్పించాం
- జనరల్ మెరిట్‌లో ఏ కులాలవారున్నా తీసుకున్నాం
- మెయిన్ పూర్తికాగానే కటాఫ్ మార్కులు వెల్లడిస్తాం
- ఇకముందు కూడా ఇంటర్వ్యూల విధానం ఉండదు
- అభ్యర్థుల అనుమానాలపై అధికార వర్గాల వివరణ
- నిబంధనల మేరకే ఎంపిక జరిగిందన్న ప్రభుత్వ వర్గాలు

› 5



కటాఫ్ మార్కులు చెప్పరెందుకు?

- జీవో 29 ప్రకారం నియామకాలతో రిజర్వ్ కోటాలో అన్నివర్గాలకు అన్యాయం
- బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

› 5



బోధన్ సీఐ ఆఫీసు ముందు ఆందోళనకు దిగిన బాలిక బంధువులు

లిఫ్ట్ ఇస్తానని బాలికపై కౌన్సిలర్ లైంగికదాడి

- కారులో ఎక్కించుకొని అఘాయిత్యం.. నిజామాబాద్ జిల్లాలో ఘటన
- నిందితుడిని చితకబాదిన స్థానికులు.. పోక్సో కింద కేసు నమోదు

› 6

రగులుతున్న బ్రిటన్

- వలసదారుల వ్యతిరేక ఆందోళనలు ఉద్రిక్తం
- దేశవ్యాప్తంగా అల్లర్లు.. ఆస్తుల ధ్వంసం
- పోలీస్‌పై పెట్రో బాంబులు.. 370 మంది అరెస్ట్

› 7

గ్రూప్-1 అంతా సక్రమమే!

రిజర్వేషన్ నిబంధనల మేరకే మెయిన్స్‌కు ఎంపిక చేశాం

- జనరల్ మెరిట్‌లో అన్ని కులాల వారినీ తీసుకున్నం
- అభ్యర్థుల అనుమానాలపై అధికారవర్గాల వివరణ
- ఏ ఒక్కరికీ అన్యాయం జరగబోదంటూ భరోసా

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ ఎంపిక జాబితాపై అభ్యర్థులకు ఎన్నో సందేహాలు. ఓపెన్‌లోనే కటాఫ్ చేశారని, దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరిగిందన్నది ఆ అభ్యర్థుల ప్రధాన ఆరోపణ. ఎక్కువ మందిని ఓపెన్ కోటాలో ఎంపిక చేశారని, దీంతో సామాజిక న్యాయం జరగలేదన్నది వారి అనుమానాలు. అధికారవర్గాలు మాత్రం వీటిని కొట్టిపారేస్తున్నాయి. ఇది పూర్తిగా అవాస్తమని స్పష్టం చేస్తున్నాయి. జీవో-29 రిజర్వేషన్లకు విరుద్ధంగా లేదని, రిజర్వేషన్ విధానాన్ని పాటిస్తూనే మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేశామని అధికారులు తేల్చి చెప్తున్నారు. జనరల్ మెరిట్‌ను అంతా ఓపెన్ అనుకుంటున్నారని స్పష్టత ఇచ్చారు. అభ్యర్థులు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని పేర్కొంటూ, వారి సందేహాలపై అధికారవర్గాలు ఇచ్చిన వివరణలు ఒక్కోదానిపై ఈ కింది విధంగా సవివరంగా ఉన్నాయి.



• అభ్యర్థుల సందేహం

గ్రూప్-1 మెయిన్స్ ఎంపికలో సామాజిక న్యాయం జరగలేదు. రిజర్వేషన్లు పాటించకపోవడం, ఓపెన్ కటాఫ్ ప్రకారం ఎంపిక చేయడంతో ఎస్సీ, ఎస్సీ, బీసీల రిజర్వేషన్లకు తూట్లు పొడిచారు.?

అధికారుల వివరణ

అలాంటిదేం జరగలేదు. జీవో-29లోనూ రిజర్వేషన్లు పాటించాలనే ఉన్నది. మొదట జనరల్ మెరిట్ ప్రకారం ఎంపిక చేశాం. ఆ తర్వాత ఏ సామాజిక వర్గానికి ఎన్ని పోస్టులుంటే అన్ని పోస్టుల ప్రకారం 1:50 ప్రకారం ఉన్నారో లేదో చూశాం. షార్ట్‌ఫాల్ ఉంటే కింది నుంచి అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేశాం. ఉదాహరణకు మల్టీజోన్-1లో బీసీ (ఏ) క్యాటగిరీలో 5 పోస్టులుంటే 250 మంది బీసీ (ఏ) అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉన్నది. ఓపెన్ మెరిట్‌లో 190 మంది మాత్రమే ఎంపికై ఉంటే, బీసీ (ఏ) సామాజిక వర్గానికి చెందిన మరో 60 మందిని మెరిట్ ప్రకారం ఎంపిక చేశాం. అన్ని సామాజిక వర్గాలకు ఇదే ఫార్ములా పాటించాం. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నుంచి మెయిన్స్‌కు ఎంపిక చేయడంతో ఇదే విధానాన్ని పాటించాం.

• అభ్యర్థుల సందేహం

జనరల్ మెరిట్ అంటే అంతా ఓపెన్ క్యాటగిరీ అభ్యర్థులే అయ్యి ఉండొచ్చు కదా?

అధికారుల వివరణ

ఇది పూర్తిగా తప్పు. జనరల్ మెరిట్ అంటే పూర్తిగా ప్రతిభావంతులని అర్థం. ఈ ప్రతిభావంతుల్లో అత్యధికులు ఎస్సీలు, ఎస్టీలు, బీసీలూ అయి ఉండొచ్చు. వీరంతా పూర్తిగా మెరిట్ అభ్యర్థులని అర్థం. మెరిట్‌లో ఏ కులాల వారు ఉన్నా తీసుకున్నాం.

• అభ్యర్థుల సందేహం

జనరల్ మెరిట్‌లో ఒక క్యాటగిరీలో పోస్టులకు మించి అభ్యర్థులు ఉంటే తొలగిస్తారా?

అధికారుల వివరణ

అలా అస్సలు జరగదు. వారంతా మెరిట్ వారు కనుక తొలగించడం ఉండదు. పోస్టుల సంఖ్యకు తగిన నిష్పత్తిలో అభ్యర్థులు ఎంపిక కాకపోతే మాత్రం మెరిట్ ఆర్డర్‌లో కింద ఉన్న అభ్యర్థులను ఎంపిక చేస్తాం.

• అభ్యర్థుల సందేహం

జీవో-55ను ఎందుకు రద్దు చేశారు. కొత్తగా జీవో-29ని ఎందుకు తెచ్చారు?

అధికారుల వివరణ

గతంలో గ్రూప్-1 నియామకాల కోసం మెయిన్స్ ఎంపిక కోసం కులాలతో సంబంధం లేకుండా మెరిట్ ప్రకారం 1:50ని ఎంపిక చేయాలని 1997లో అప్పటి ప్రభుత్వం జీవో-570 జీవో జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ బాలోజీ బదావత్ సహా 30 మంది అభ్యర్థులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు డివిజన్ బెంచ్ రిజర్వేషన్లను పాటిస్తూ 1:50 చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేయాలని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును ఏపీపీఎస్సీ 2009లో సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. కులాలతో సంబంధం లేకుండా జనరల్ మెరిట్ ప్రకారమే ఎంపిక చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును అమలు చేయాలని గత గ్రూప్-1 నోటిఫికేషన్ సమయంలోనే కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే న్యాయ పరమైన చిక్కులెదురుకావొద్దనే గతంలో ఉన్న జీవో-55ను సవరించి జీవో-29ని జారీచేశాం.

• అభ్యర్థుల సందేహం

గ్రూప్-1 మెయిన్స్‌కు 1:50 కాకుండా 1:100 రేషియోను ఎందుకు అమలు చేయడం లేదు.

అధికారుల వివరణ

గ్రూప్-1 నోటిఫికేషన్‌లో 1:50 నిష్పత్తిని అమలు చేస్తామని ముందే ప్రకటించాం. జీవో-29లోనూ దీనినే స్పష్టం చేశాం. ఎలా ఎంపిక చేయాలన్న దానిపై సుప్రీంకోర్టు పిట్టా నవీన్‌కుమార్ వర్సెస్ రాజనర్సయ్య కేసులో స్పష్టమైన తీర్పు ఇచ్చింది. 2003లో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేయగా, ఏపీపీఎస్సీ 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసింది. ఆ తర్వాత కొందరు అభ్యర్థులు ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన వారిని మెయిన్స్‌కు అనుమతించాలని ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ తీర్పునిచ్చింది. దీనిని ఏపీపీఎస్సీ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, ఇది న్యాయసమ్మతం కాదని, మధ్యలో ఇష్టానుసారంగా నిష్పత్తిని మార్చరాదని, ఎంపిక చేసిన వారిని జాబితా నుంచి తొలగించాలని తీర్పును ఇచ్చింది. దీంతో నోటిఫికేషన్‌లో ఉన్నట్లుగానే 1:50 నిష్పత్తిని అమలు చేస్తున్నాం.

• అభ్యర్థుల సందేహం

గ్రూప్-1 మెయిన్స్‌కు క్వాలిఫై అయిన వారి వివరాలను క్యాటగిరీ వారిగా కటాఫ్ మార్కులను ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారు. ఎందుకు వెల్లడించడం లేదు

అధికారుల వివరణ

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు పూర్తికాగానే ఫలితాల సమయంలో పూర్తి వివరాలను ప్రకటిస్తుంది. అదే సమయంలో ప్రిలిమ్స్ కటాఫ్, మెయిన్స్ కటాఫ్. క్వాలిఫై అయిన వారి పూర్తి వివరాలను వెల్లడిస్తాం. పూర్తి పారదర్శకంగా ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాం. దీంట్లో దాపరికం, గోప్యత లేనే లేదు.

జీవో-29 ప్రకారం ఎంపిక జరుగుతుందిలా..

- తొలుత జనరల్/ఓవరాల్ మెరిట్ ప్రకారం మల్టీజోన్ వారీగా 1:50 నిష్పత్తి చొప్పున అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేస్తారు. ఈ జాబితాలో అన్ని కులాలకు చెందిన వారు ఉంటారు. ఇది పూర్తిగా మెరిట్ ఆధారంగా జరుగుతుంది.
- ఆ తర్వాత మల్టీజోన్ వారీగా రిజర్వేషన్లను అమలు చేస్తారు. ఈ విధానంలో జనరల్ మెరిట్ ప్రకారం ఎంపిక చేసిన అభ్యర్థుల్లో ఆయా రిజర్వేషన్‌లో ఎన్ని పోస్టులుంటే అన్ని పోస్టులకు 1:50 నిష్పత్తిని అమలు చేస్తారు. ఇలా ఉన్నారో లేదో పరిశీలిస్తారు.
- జనరల్ మెరిట్‌లో ఆయా రిజర్వేషన్ వారుంటే ఓకే. లేకపోతే (షార్ట్‌ఫాల్ ఉంటే) మాత్రం ఆయా నిష్పత్తి ప్రకారం ఎంత మంది కావాలంటే అంత మందిని మెరిట్ ఆధారంగానే కింది నుంచి ఎంపిక చేస్తారు. అదనంగా ఎంత మంది అవసరముంటే అంత మందిని మెయిన్స్ కోసం తీసుకుంటారు.

1:50

• అభ్యర్థుల సందేహం

మన పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో జీవో-5 ప్రకారం చేపడుతున్నారు కదా?

అధికారుల వివరణ

మన దగ్గర మెయిన్స్‌కు 1:50 చొప్పున ఎంపిక చేస్తుండగా, ఏపీలో ఈ విధానం అమలులో లేదు. అక్కడ కటాఫ్ మార్కులను అమలు చేస్తున్నారు. కటాఫ్ మార్కులు కమిషన్ అభీష్టం మేరకే జరుగుతుంది. కటాఫ్ మార్కుల ప్రకారం తీసిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగుల కోటాలో అభ్యర్థులు రిజర్వేషన్ ప్రకారం ఎంపిక కాకపోతే కటాఫ్ మార్కుల నిబంధనలను సడలించి ఆయా వర్గాల నుంచి మరికొందరికి అవకాశం ఇస్తున్నారు. ఇదే ఫార్ములాను జీవో-29లోనూ అనుసరించాం. యూపీఎస్సీ సైతం 1:12 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి, ఇదే తీరును అనుసరిస్తున్నది.



• అభ్యర్థుల సందేహం

గ్రూప్-1లో మళ్లీ ఇంటర్వ్యూలు ఉంటాయా?

అధికారుల వివరణ

ఇంటర్వ్యూలు ఉండవు. ఇంటర్వ్యూలను గతంలోనే ప్రభుత్వం రద్దుచేసింది. ఇదే విధానం అమలులో ఉంటుంది.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో బీఆర్‌ఎస్ నేతలు తుంగ బాలు, ఆంజనేయగౌడ్, రామ్మూర్తి

గ్రూప్-1 అభ్యర్థుల కటాఫ్ ఎంత?

- ఓపెన్ క్యాటగిరీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు ఎందరు?
- ఓపెన్ క్యాటగిరీ అగ్రవర్ణాలవారికేనా?
- జీవో 29 ప్రకారం రిజర్వ్ కోటాలో అన్నివర్గాలకు అన్యాయం
- బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): 'గ్రూప్-1 అభ్యర్థుల కటాఫ్ మార్కులు ఎన్ని? క్యాటగిరీలవారీగా ఎంపిక కటాఫ్ మార్కులు ఎన్ని అనేది ఎందుకు చెప్పడం లేదు' అని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. 2022లో కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన జీవో 55ను రద్దుచేసిన రేవంత్‌రెడ్డి సర్కారు, జీవో 29ని తీసుకొచ్చి నిరుద్యోగుల నోట్లో మట్టికొడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతున్నదని, వారి హక్కులను ప్రభుత్వం కాలరాస్తున్నదని మండిపడ్డారు. సామాజిక న్యాయం కోసం కట్టుబడి ఉన్నామని రాహుల్‌గాంధీ రాజ్యాంగం పట్టుకొని తిరుగుతుంటే ఆ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయానికి తూట్లు పొడుతున్నారని విమర్శించారు. మంగళవారం తెలంగాణభవన్‌లో ఆర్‌ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతోపాటు స్పెషల్ క్యాటగిరీ అభ్యర్థులకు రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగంతోపాటు సుప్రీంకోర్టు సైతం అనేక తీర్పుల్లో చెప్పిందని గుర్తుచేశారు. కానీ, రేవంత్ సర్కారు తెచ్చిన జీవో 29 దీనికి తూట్లు పొడుస్తున్నదని తెలిపారు. జీవో 29 ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపడితే రిజర్వ్ కోటాలో అన్నివర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని చెప్పారు. గ్రూప్-1లో ఓపెన్ క్యాటగిరీ అంటేటే అగ్రవర్ణాలవారికేనా? అని నిలదీశారు. రాష్ట్రంలో గ్రూప్-1 పోస్టులు 563కుగాను 1:50 ప్రకారం మొత్తం 28,150 మందిని ఎంపిక చేయాల్సి ఉన్నదని వివరించారు. కేసీఆర్ తెచ్చిన జీవో 55 ప్రకారం ఓపెన్ క్యాటగిరీలో 40 శాతం అంటే 209 పోస్టులకు 10,450 మందిని, రిజర్వేషన్ క్యాటగిరీలో 60 శాతం అంటే 354 పోస్టులకు 17,700 మంది ఓసీ, ఈడబ్ల్యూఎస్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, స్పోర్ట్స్ కోటా అభ్యర్థులను ఎంపికచేయాల్సి ఉన్నదని తెలిపారు. కానీ, బదావత్ తీర్పు ఆధారంగా హడావుడిగా జీవో 29 తీసుకొచ్చి రిజర్వేషన్ కోటాలను పరిగణనలోకి తీసుకోకుండా ఒకే ముద్దగా 28,150 మందిని టీజీపీఎస్సీ ఎంపిక చేసిందని విమర్శించారు. ఏ వర్గాల అభ్యర్థులు ఎందరున్నారని వెల్లడించడం లేదని మండిపడ్డారు.

యూపీఎస్సీలో కూడా రిజర్వేషన్..

యూపీఎస్సీ కూడా ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూలో సామాజిక కోటాలను పాటిస్తున్నదని ప్రవీణ్‌కుమార్ చెప్పారు. కర్ణాటక, హర్యానా, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, జార్ఖండ్ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు కూడా రిజర్వేషన్లు పాటిస్తున్నాయని, వీటికి సుప్రీంకోర్టు తీర్పులు అడ్డం రావడం లేదా? అని నిలదీశారు. ఓపెన్ క్యాటగిరీలో ఎంపిక చేసిన 10,400 అభ్యర్థుల్లో ఏ వర్గాలకు చెందిన వారు ఎంత మంది ఉన్నారనే లెక్కలను ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. ఇదీ కాకుండా 3,232 మందిని అదనంగా ఏ ప్రాతిపదికన తీసుకున్నారనేదీ సీఎస్, టీజీపీఎస్సీ, రేవంత్‌రెడ్డి చెప్పడం లేదని మండిపడ్డారు. మెరిట్ అభ్యర్థులు అంతా ఓపెన్ క్యాటగిరీలోకి వస్తే మరో 14 వేల మంది అర్హత పొందే అవకాశం ఉన్నదని, వీరందరికీ అన్యాయం జరుగుతున్నదని విమర్శించారు. అ అంశంపై ప్రభుత్వం పునరాలోచించాలని, లేకుంటే బీఆర్‌ఎస్ తరఫున మళ్లీ విజ్ఞాపనలు చేస్తామని చెప్పారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు తుంగ బాలు, ఆంజనేయగౌడ్, బొమ్మెర రామ్మూర్తి పాల్గొన్నారు.

మెడికల్ సీట్లలో తెలంగాణ బిడ్డలకు అన్యాయం

స్థానికత నిబంధనలు వెనక్కి తీసుకోవాలి: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): స్థానికత విషయంలో తీసుకొచ్చిన కొత్త నిబంధన వల్ల మెడికల్ సీట్లలో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే ఈ నిబంధనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరు అనేక అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొన్నారు. జీవో-33 ప్రకారం నిర్దేశించిన స్థానికతలో ని అంశాలు ప్రభుత్వం వేలితో విద్యార్థుల కండ్లను పొడిచినట్టే ఉన్నాయని మండిపడ్డారు. 9 నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదివిన విద్యార్థులే స్థానికులు అవుతారని ప్రభుత్వం చెప్తున్నదని, దీంతో చాలామంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో లోకల్ అవుతారని ఆందోళన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ఉన్నందున ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు చాలామంది ఇక్కడే విద్యాభ్యాసం చేస్తున్నారని, కొత్త నిబంధనల ప్రకారం వారంతా తెలంగాణలో లోకల్ అవుతారని, అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లో చదివే తెలంగాణ విద్యార్థులు నాన్‌లోకల్ అయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. 2023-24 వరకు 6 నుంచి 12 తరగతి వరకు నాలుగేండ్లు గరిష్ఠంగా ఎక్కడ చదివితే అదే స్థానికతగా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ ఉదహరించారు. దాంతో మన విద్యార్థులు ఇంటర్మీడియెట్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినా వారు లోకల్‌గానే పరిగణించబడేవారని వివరించారు. వేలాది మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో లోకల్ అవుతారని, మన విద్యార్థులు మెడిసిన్ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు.

జీవో 33ని ఉపసంహరించుకోవాలి

వైద్య విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు విడుదల చేసిన జీవో 33తో విద్యార్థులు నష్టపోతున్నారని, ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తెలంగాణ వైద్య విద్యార్థుల పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవిప్రసాద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. గతంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు.. ఏడేండ్లలో నాలుగేండ్లు తెలంగాణలో చదివితే స్థానికత ఉన్నట్టుగా గుర్తించేవారని, ఇప్పుడు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు వరుసగా 4 ఏండ్లు చదివితేనే స్థానికులుగా గుర్తించడం సరికాదని వాపోయారు.


పాత వెసులుబాటు గడువు ముగిసింది

జీవో 33పై వైద్యారోగ్యశాఖ వివరణ

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్ అడ్మిషన్లలో జీవో 33కి సంబంధించి వైద్యారోగ్యశాఖ వివరణ ఇచ్చింది. గతంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేండ్లు చదివిన ప్రాంతాన్ని లోకల్‌గా నిర్ధారించే వెసులుబాటుకు కాలపరిమితి ముగిసినట్టు పేర్కొన్నది. 2017లో ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని గుర్తుచేసింది. రాష్ట్రంలో 15 శాతం ఉమ్మడి కోటా కింద ఉండేదని, ఏపీ, తెలంగాణ విద్యార్థులు మెరిట్ ప్రకారం ఈ సీట్లు పొందేవారని పేర్కొన్నది. స్థానికత నిర్ధారణకు 2 రకాల నిబంధనలు ఉండేవని వెల్లడించింది. మొదటి ఆప్షన్‌లో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు వరుసగా నాలుగేండ్లు చదివిన ప్రాంతాన్ని లోకల్‌గా, రెండో ఆప్షన్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడేండ్లలో వరుసగా నాలుగేండ్లు చదివిన ప్రాంతాన్ని లోకల్‌గా నిర్ధారించారని పేర్కొన్నది. ఈ ఏడాది జూన్ 2తో ఉమ్మడి కోటా రద్దయినప్పుడే స్థానికత రెండో వెసులుబాటు కూడా రద్దయిందని వెల్లడించింది.

నల్లా కనెక్షన్లలో తెలంగాణ ఫస్ట్

ఆగస్టు 1నాటికి గ్రామీణప్రాంతాల్లో నల్లా కనెక్షన్లు ఉన్న రాష్ట్రాలు (శాతాల్లో)



మొదటిపేజీ తరువాయి...

భగీరథ పథకం ద్వారా ఇది సాధ్యమైంది. వివిధ రాష్ట్రాల్లో ఇంటింటికీ నల్లా కనెక్షన్లపై జల్ జీవన్ మిషన్ (జేజేఎం) ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నది. జేజేఎం పథకం (2019 ఆగస్టు 15) ప్రారంభించడానికే ముందే తెలంగాణలో 15.68 లక్షల (29.05 శాతం) గ్రామీణ కుటుంబాలకు ట్యాప్ కనెక్షన్ ఉన్నది. 2019-20 సంవత్సరంలో 20.18 లక్షలు, 2020-21 సంవత్సరంలో 18.12 లక్షల గ్రామీణ కుటుంబాలకు అంటే మొత్తం 53.98 లక్షల (100శాతం) గ్రామీణ కుటుంబాలకు నల్లా కనెక్షన్ల ద్వారా తాగునీటి సరఫరా జరిగింది. యూటీలో అండమాన్ నికోబార్, చిన్న రాష్ట్రాల్లో గోవా మనతోపాటు 2020-21 నాటికే 100 శాతం గ్రామీణ కుటుంబాలకు నల్లా కనెక్షన్లు ఇచ్చాయి. పంజాబ్, గుజరాత్ వంటి పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ నాలుగేండ్ల క్రితమే ప్రతి గ్రామీణ కుటుంబానికి నల్లాల ద్వారా రక్షిత మంచినీరు ఇచ్చిన రాష్ట్రంగా నిలిచింది. తెలంగాణలో 53.98 లక్షల గ్రామీణ కుటుంబాలు ఉండగా 2020-21 నాటికే అన్ని కుటుంబాలకు నల్లా కనెక్షన్ ద్వారా సురక్షిత తాగునీరు అందించినట్టు కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. ఇద్దరు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆ శాఖ మంత్రి సోమవారం సమాధానం ఇచ్చారు. గ్రామీణ కుటుంబాలకు అందించే నల్లా కనెక్షన్లలో దేశ సగటు 77.83% మాత్రమే. తెలంగాణతోపాటు 11 రాష్ట్రాలు/యూటీలు ప్రతి ఇంటికి (100శాతం) నల్లా కనెక్షన్ ద్వారా తాగునీటిని అందించే రాష్ట్రాలుగా మారాయి. ఇందులో తెలంగాణ, గోవా, గుజరాత్, హర్యానా, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం, పుదుచ్చేరి, దాద్రానగర్‌హవేలి, అండమాన్ నికోబార్ దీవులు ఉన్నాయి. దేశంలో రాజస్థాన్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల్లో 33 శాతం, మరికొన్ని రాష్ట్రాల్లో 67 శాతం గ్రామీణ కుటుంబాలకు నల్లా కనెక్షన్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల ట్యాప్ కనెక్షన్లలో పశ్చిమబెంగాల్ అట్టడుగున ఉన్నది. ఆ తర్వాత రాజస్థాన్, కేరళ, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలు వరుసగా ఉన్నాయి.



2019 ఆగస్టు నాటికి 16.08 శాతమే

జల్‌జీవన్ మిషన్ ప్రారంభించిన 2019 ఆగస్టు నాటికి దేశవ్యాప్తంగా 3.23 కోట్ల నివాసాలకు (16.08 శాతం) మాత్రమే నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 41.41 లక్షల కనెక్షన్లు కలుపుకొని 2024 ఆగస్టు 1 నాటికి దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని గ్రామీణ ప్రాంతంలో ఉన్న 12.80 కోట్ల నివాసాలకు ట్యాప్ కనెక్షన్లు ఇచ్చారు. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 19.32 కోట్ల నివాసాలు ఉండగా, ఇందులో 15.03 కోట్లకుపైగా (77.83 శాతం) నివాసాలకు ట్యాప్ కనెక్షన్ ద్వారా రక్షిత తాగునీరు అందుతున్నది.

రూ.40 వేల కోట్ల 'భగీరథ' ఫలితం

ఇంటింటికీ నల్లా ద్వారా నీరందించే భగీరథ పథకానికి తెలంగాణ ప్రభుత్వం దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చుచేసింది. తెలంగాణకు జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.188.23 కోట్లు విడుదలచేశారు. కృష్ణా, గోదావరి నదులతోపాటు ఇతర జలాశయాలను కలిపి 1.30 లక్షల కిలోమీటర్ల పైప్‌లైన్ మార్గం ద్వారా రాష్ట్రంలోని 24 వేల గ్రామాలు, 65 పట్టణాల్లోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించింది. అనేక రాష్ట్రాలు ఈ పథకాన్ని ఆదర్శంగా తీసుకున్నాయి. తమ రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్టులను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జల్ జీవన్ మిషన్‌కు కూడా తెలంగాణలోని భగీరథ ప్రాజెక్టు స్ఫూర్తిగా నిలుస్తున్నది.

హాల్‌మార్క్ ఆభరణమే కొనాలి

- రాష్ట్రంలో 12 జిల్లాల్లో తప్పనిసరిగా అమల్లోకి
- నిబంధనలు పాటించని వర్తకులపై బీఐఎస్ చర్యలు
- హాల్‌మార్కింగ్ ఖర్చు జీఎస్టీతో కలిపి రూ.45 మాత్రమే

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): నకిలీ, కల్తీ బంగారు ఆభరణాలు కొని వినియోగదారులు మోసపోకుండా భారతీయ ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) నిబంధనలను మరింత కట్టుదిట్టం చేస్తున్నది. దేశవ్యాప్తంగా బంగారం అమ్మకాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. ప్రతి ఆభరణం శుద్ధతను పరీక్షించిన తర్వాతే ఓ ప్రత్యేక కోడ్ కేటాయించి విక్రయానికి అనుమతి ఇస్తున్నది. రాష్ట్రంలోనూ హైదరాబాద్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టింది. బీఐఎస్ ఆమోదం లేని, హాల్‌మార్క్ ముద్రలేకుండా బంగారు ఆభరణాలు అమ్మే వారిపై చర్యలు తీసుకుంటున్నది.

హాల్‌మార్క్ అంటే..

బంగారం, వెండి వంటి విలువైన ఆభరణాల శుద్ధతను నిర్ధారించేందుకు భారత ప్రభుత్వం హాల్ మార్కింగ్ వ్యవస్థను ప్రవేశ పెట్టింది. చిన్న దుకాణం నుంచి కార్పొరేట్ వర్తకుల దాకా ప్రతి ఒక్కరు ప్రతి ఆభరణంపై హాల్‌మార్క్ ముద్రించిన తర్వాతే అమ్మాలి. ప్రతి ఆభరణాన్ని తయారీదారులు దగ్గరలోని బీఐఎస్ ఆమోదిత అసేయింగ్, హాల్‌మార్కింగ్ కేంద్రానికి తరలిస్తారు. అక్కడ శుద్ధత పరీక్షల అనంతరం ప్రతి ఆభరణానికి బీఐఎస్ కంప్యూటర్ ఆధారిత ఐడీ నంబర్‌ను కేటాయిస్తుంది. దీన్నే హాల్‌మార్కింగ్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (హెచ్ యూఐడీ)గా పరిగణిస్తారు. బరువు, రకంతో సంబంధం లేకుండా కొనే ప్రతి ఆభరణంపై మూడు ముద్రలు (1.బీఐఎస్ లోగో, 2.ఆభరణం క్యారెట్లు, శుద్ధత, 3.హెచ్‌యూఐడీ నంబర్ ఆరు అంకెలు) ఉంటేనే అది హాల్‌మార్క్ బంగారంగా గుర్తించాలి.



బీఐఎస్ కేర్ యాప్‌తో నాణ్యత నిర్ధారణ

బంగారు ఆభరణాల శుద్ధతను వినియోగదారులు స్వయంగా పరిశీలించుకొనేందుకు బీఐఎస్.. బీఐఎస్ కేర్ అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లో ఆభరణం నాణ్యతను తెలుసుకోవచ్చు. హాల్‌మార్కింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్న ఉమ్మడి జిల్లాల పరిధిలోని 12 జిల్లాల్లో హాల్‌మార్కింగ్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ జిల్లాల్లో వర్తకులు హాల్‌మార్కింగ్ లేకుండా అమ్మినట్టు బీఐఎస్ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఆ 12 జిల్లాలు ఇవే: హైదరాబాద్, రంగారెడ్డి, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్, హనుమకొండ, ఖమ్మం, మేడ్చల్ మల్కాజిగిరి, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ. ఉద్దేశపూర్వకంగా వినియోగదారులకు నష్టం కలిగించేలా బంగారు ఆభరణాల వర్తకులు హాల్‌మార్క్ లేని బంగారం అమ్మడం సెక్షన్ 14, 15 కింద నేరం. ఈ చట్టాలను ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 29 ప్రకారం ఏడాది జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉన్నది.

నిబంధనలు పాటించాలి

వర్తకులు కచ్చితంగా హాల్‌మార్కింగ్ నిబంధనలు పాటించాలి. పాటించనట్టు మా దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు సైతం హాల్‌మార్క్ ఉన్న ఆభరణాలే కొనాలి. ఒకవేళ హాల్ మార్క్‌పై సందేహం ఉన్నా, ముద్ర లేదని గుర్తించినా బీఐఎస్ కేర్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయండి. ఏ ఆభరణం హాల్‌మార్కింగ్‌కు అయినా అదనంగా అయ్యే ఖర్చు జీఎస్టీతోపాటు రూ.45 మాత్రమే. ఎక్కువ వసూలుచేసినా ఫిర్యాదు చేయవచ్చు.

- పీవీ శ్రీకాంత్, డైరెక్టర్, హైదరాబాద్ బీఐఎస్ శాఖాధిపతి

పైప్‌లైన్‌లో పారేదేంది?

మొదటిపేజీ తరువాయి...

ఎంచుకుంటారు!? ఎత్తులో ఉన్న కొండపోచమ్మ సాగర్ నుంచి తరలిస్తే గ్రావిటీ (భూమ్యాకర్షణ శక్తి) మీదనే వస్తున్నందున దాన్నే ఎంచుకోవాలని చిన్న పిల్లాడు కూడా చెబుతాడు. గ్రావిటీ అంటే తమ పేటెంట్‌గా భావించే కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున కచ్చితంగా కొండపోచమ్మ సాగర్‌కే మొగ్గుచూపాలి. కానీ హైదరాబాద్ మహానగరానికి రెండోదశ గోదావరిజలాల తరలింపులో కాంగ్రెస్ సర్కారు రూటు మార్చింది. 'గ్రావిటీ వద్దు.. పంపింగే ముద్దు' అంటున్నది. కేసీఆర్ హయాంలో గ్రావిటీ ద్వారా గోదావరి జలాల తరలింపుతో మంచినీటి పథకాన్ని డిజైన్ చేస్తే.. తూచ్! అన్న రేవంత్ సర్కారు గ్రావిటీ వదిలి ఏకంగా దాదాపు 108 మీటర్ల ఎత్తిపోతలకు నడుంబిగించింది. అంతే కాదు..23కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండపోచమ్మసాగర్‌ను వదిలి 50 కిలోమీటర్ల దూరంలోని మల్లన్నసాగర్‌ను ఎంచుకున్నది. ఓవైపు ఎత్తిపోతల నిర్మాణ భారం, మరోవైపు 27 కిలోమీటర్ల అదనపు పైప్‌లైన్ నిర్మాణ వ్యయం, వీటిన్నింటికీ మించి ఇప్పటికే కృష్ణా, గోదావరిజలాల మంచినీటి పథకాల కరెంటు బిల్లులకు ఏటా రూ.500 కోట్లు చెల్లిస్తున్న జలమండలిపై సంవత్సరానికి మరిన్ని వందల కోట్ల అదనపు భారం పడనున్నది.

ఇంతకీ.. ఇన్ని అదనపు వ్యయాలు, భారాలతో రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ మహానగరానికి రెండో దశ గోదావరిజలాల తరలింపు పథకానికి రూ.5,560 కోట్లతో పాలనా అనుమతి ఎందుకు ఇచ్చిందంటారు!? ఆ ఒక్కటీ అడగొద్దు సుమా..!

హైదరాబాద్ మహానగరానికి భవిష్యత్తులోనూ మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండటంతో పాటు మూసీ ప్రక్షాళన కోసం కాళేశ్వరం పథకం నుంచి గోదావరి జలాలను తరలించాలని గత కేసీఆర్ ప్రభుత్వమే నిర్ణయించింది. ఈ మేరకు కాళేశ్వరం పథకం రూపకల్పనలోనే అన్నిరకాల వెసులుబాట్లు కల్పించింది. హైదరాబాద్ తాగునీటి కోసం ఏటా 30 టీఎంసీల కేటాయింపును కాళేశ్వరం డీపీఆర్‌లోనే పొందుపరిచింది. ఎల్లంపల్లి జలాశయం నుంచి నగరానికి మొదటి దశలో గోదావరి జలాల తరలింపు కొనసాగుతున్నది. ఈ పథకం కింద ఏటా 10 టీఎంసీల జలాలు వాడుకుంటున్నారు. రెండోదశలో కూడా మరో పది టీఎంసీల గోదావరి జలాలు తరలించి హైదరాబాద్ మహానగరవాసులకు అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం డీపీఆర్‌ను కూడా తయారు చేసింది. కాళేశ్వరం పథకంలో 15 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న కొండపోచమ్మ సాగర్ నుంచి గ్రావిటీ పైనే ఈ జలాలను మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సమీపంలోని ఘన్‌పూర్ వద్దకు తరలింపుతో పాటు శుద్ధి చేసిన నీటిని ప్రజలకు అందించే సాంకేతిక అంశాలన్నీ అందులో ఉన్నాయి. ఇదేగాకుండా కొండపోచమ్మసాగర్ నుంచి సాగునీటి కోసం నిర్మించిన 127 కిలోమీటర్ల సంగారెడ్డి కాల్వ డిజైన్‌లోనే మూసీ ప్రక్షాళన కోసం ముందుచూపుతో నీటి కేటాయింపు చేపట్టారు. వాస్తవంగా సంగారెడ్డి కాల్వ గరిష్ఠ వరద ప్రవాహ సామర్థ్యం 5054 క్యూసెక్కులు ఉండగా ఇందులో సాగునీటికి 4,354 క్యూసెక్కులు, మూసీ ప్రక్షాళన కోసం 700 క్యూసెక్కులను జంట జలాశయాలకు తరలించేందుకు డిజైన్ చేశారు.



సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్‌లోని అన్నపూర్ణ పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి బయటికి దుంకుతున్న గోదావరి జలాలు

లింక్-2లో గోదావరి పరవళ్లు.. రంగనాయకసాగర్ వైపు పరుగులు

సిద్దిపేట, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ధర్మారం/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట: గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. పదిరోజులుగా ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరుకు పరిగెడుతున్న జలాలు, మంగళవారం నుంచి సిద్దిపేట జిల్లాలోని రంగనాయనాయక సాగర్ జలాశయం వైపు సాగాయి. దిగువన కాళేశ్వరం ప్రాజెక్ట్ లింక్-2లోని నంది, గాయత్రీ పంప్‌హౌస్‌లలో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్‌కు జలాలు చేరుతుండగా, ఇక్కడి పంప్‌హౌస్‌లో రెండు బాహుబలి మోటర్ల ద్వారా 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి తరలిస్తున్నారు. ఇక్కడ గేట్లు తెరిచి అంతే మొత్తంలో రంగనాయకసాగర్‌కు వదులుతున్నారు. రంగనాయక్‌సాగర్‌కు నీళ్లు రావడంతో సిద్దిపేట రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం లేఖ రాసిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. రంగనాయకసాగర్ నుంచి మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లను నింపనున్నట్టు అధికారులు తెలిపారు.

పథకం స్వరూపాన్ని మార్చిన రేవంత్ సర్కారు

కేవలం గ్రావిటీ మీద నగరానికి రెండోదశ గోదావరి జలాల తరలింపు పథకాన్ని రేవంత్ ప్రభుత్వం పక్కన పెట్టింది. ఇంతకంటే మెరుగైన డిజైన్, తక్కువ వ్యయంతో పథకం రూపకల్పన చేస్తే బాగుండేది. కానీ గ్రావిటీని కాదని ఎత్తిపోతలను ఎంచుకోవడమే కాకుండా పైప్‌లైన్ దూరం పెంచి, జలమండలిపై అదనంగా కరెంటు ఖర్చును కూడా మోపేలా కొత్త డిజైన్ రూపొందించింది. ఈ మేరకు మంగళవారం రూ.5,560 కోట్లతో రెండోదశ గోదావరిజలాల తరలింపు పథకానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. కేసీఆర్ హయాంలోని డిజైన్‌తో తాజా డిజైన్‌ను బేరీజు వేస్తే పథకం నిర్మాణ వ్యయంతో పాటు నిర్వహణ వ్యయం కూడా కోట్లాది రూపాయల మేర పెరిగిందని స్పష్టమవుతున్నది.

1. కేసీఆర్ ప్రభుత్వ డిజైన్ ప్రకారం: కొండపోచమ్మ సాగర్ నుంచి మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సమీపంలోని ఘన్‌పూర్ వరకు గోదావరి జలాలను గ్రావిటీ ద్వారా తరలించవచ్చు. ఎత్తిపోతల భారం ఉండదు. పంపుహౌస్, మోటర్లు అవసరం లేదు.

రేవంత్ ప్రభుత్వ డిజైన్ ప్రకారం : మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్‌కు గోదావరి జలాలను ఏకంగా 108 మీటర్లు ఎత్తిపోయాలి. ఇందుకుగాను భారీ మోటర్లు అవసరం. పంపుహౌస్ నిర్మించాలి. ఇందుకు వందల కోట్లు ఖర్చు చేయాలి. ఏటా నిర్వహణ వ్యయం కూడా కోట్లల్లో ఉంటుంది.

2. కేసీఆర్ ప్రభుత్వ డిజైన్ ప్రకారం: కొండపోచమ్మ సాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు 23 మీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం సరిపోతుంది.

రేవంత్ ప్రభుత్వ డిజైన్ ప్రకారం: మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు 50 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మించాలి. అంటే 27 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ నిర్మాణం పెరిగింది. ప్రస్తుత ఎస్ఎస్ఆర్ ప్రకారం కిలోమీటర్ పైప్‌లైన్ నిర్మాణానికి సుమారు రూ.20 కోట్లు ఖర్చవుతుందని అధికారులు తెలిపారు. ఈ చొప్పున అదనంగా 27 కిలోమీటర్లకు రూ.540 కోట్ల భారం పెరిగింది. పైప్‌లైన్ నిర్వహణ భారం కూడా ఏటా జలమండలిపై పడుతుంది.

3. కేసీఆర్ ప్రభుత్వ డిజైన్ ప్రకారం : కొండపోచమ్మ సాగర్ నుంచి గ్రావిటీ ద్వారా జలాల తరలింపు ఉంటున్నందున ఎత్తిపోతలకు కరెంటు ఖర్చు ఉండదు.

రేవంత్ ప్రభుత్వ డిజైన్ ప్రకారం : మల్లన్నసాగర్ వద్ద సుమారు 108 మీటర్ల మేర నీటిని ఎత్తిపోయాలి. అంటే కరెంటు బిల్లు తడిసి మోపెడవుతుంది. ఇప్పటికే జలమండలి కృష్ణా మూడు దశలు, గోదావరి మొదటి దశ జలాల తరలింపునకు ఏటా సుమారు రూ.500 కోట్ల కరెంటు బిల్లులు చెల్లిస్తున్నది. ప్రస్తుతం రూ.4,500 కోట్ల కరెంటు బిల్లుల బకాయి కూడా జలమండలి నెత్తిన ఉన్నది. రెండో దశ గోదావరిజలాల తరలింపునకు మరిన్ని వందల కోట్లు కరెంటు ఖర్చు రూపంలో శాశ్వతంగా జలమండలిపై భారంగా ఉంటుంది.

ఇద్దరిదీ డొల్ల వాదనే..

కొండపోచమ్మ కాకుండా మల్లన్నసాగర్‌ను ఎంచుకోవడంలో అటు నీటిపారుదల శాఖ, ఇటు జలమండలి అధికారులు తలో వాదన వినిపిస్తున్నారు. ఇద్దరి వాదనల్లోనూ డొల్లతనమే ఉండటం గమనార్హం.

నీటిపారుదల శాఖ అధికారుల వాదన: కొండపోచమ్మ సాగర్‌కు కాళేశ్వర జలాలు రావాలంటే మల్లన్నసాగర్ తర్వాత రెండు దశల్లో జలాలు ఎత్తిపోయాలి. గోదావరి మంచినీటి పథకంలో మల్లన్నసాగర్‌ను ఎంచుకోవడం వల్ల ఆ రెండు దశల ఎత్తిపోతల భారం తగ్గింది.

వాస్తవానికి హైదరాబాద్ మంచినీటి కోసమే మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు గోదావరి జలాలను తరలించడం లేదు. బృహత్తర కాళేశ్వరం పథకంలో భాగంగా సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి, మేడ్చల్ జిల్లా పరిధిలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. అందులో భాగంగానే కొండపోచమ్మ సాగర్‌లో నీటిని నింపుతారు. హైదరాబాద్ మంచినీటి పథకం కోసమే నింపడం అనేది జరగదు. పైగా ఇప్పుడు మంచినీటి పథకాన్ని మల్లన్నసాగర్‌కు మార్చినందున కొండపోచమ్మసాగర్‌ను నింపకుండా ఉండరు కదా!

జలమండలి అధికారుల వాదన: కొండపోచమ్మసాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 15 టీఎంసీలు. అదే మల్లన్నసాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 50 టీఎంసీలు. అక్కడ నీటి లభ్యత ఎక్కువగా ఉంటుంది.

ఎన్ని టీఎంసీలున్నా గోదావరి మంచినీటి పథకంలో భాగంగా సుమారు 500-600 క్యూసెక్కుల కంటే ఎక్కువ తీసుకోరు. నీటి నిల్వ సామర్థ్యమే ప్రామాణికం అనుకుంటే. ప్రస్తుతం నగరానికి మూడు దశల కృష్ణాజలాల తరలింపు కింద రోజుకు 270 ఎంజీడీల నీళ్లు వస్తున్నాయి. ఇందుకోసం ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ముడినీటిని సేకరిస్తున్నారు. ఈ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కేవలం 1.5 టీఎంసీలు. అంటే అక్కంపల్లి కంటే కొండపోచమ్మ సాగర్ పదిరెట్లు ఎక్కువ సామర్థ్యంతో ఉన్నది. అలాంటప్పుడు నీటి నిల్వ సామర్థ్యం అనేది అసలు ప్రామాణికమే కాదు.

ఈ రూపంలోనూ మరో భారం..

వాస్తవానికి మంచినీటి పథకాల్లో వాటర్ సోర్స్ (నీటిని సేకరించే వనరు) సమీపంలోనే మంచినీటి శుద్ధికేంద్రం (డబ్ల్యూటీపీ) నిర్మించాలని నిపుణులు తెలిపారు. దీని ద్వారా అక్కడే నీటిని శుద్ధి చేయడం వల్ల సరఫరా భారం తగ్గుతుంది. వంద లీటర్ల మంచినీటి కోసం అంతకంటే కనీసంగా 20 శాతం ఎక్కువ ముడినీటిని అంటే సుమారు 120 లీటర్లు తీసుకోవాలి. అందులో టర్బిడిటీ, ఇతరత్రా అన్నింటినీ తొలగించడం ద్వారా శుద్ధినీరు వస్తుంది. అందుకే నీటి వనరు సమీపంలోనే ఈ కేంద్రాలు నిర్మించడం వల్ల 20 శాతం మేర సరఫరా భారం తగ్గుతుంది. అంతేకాకుండా మార్గమధ్యలో ఉన్న గ్రామాలకు సైతం శుద్ధినీరు అందించే అవకాశం ఉంటుంది. కానీ తాజా మంచినీటి పథకంలో 50 కిలోమీటర్ల దూరం ముడినీటిని తరలించిన తర్వాత ఘన్‌పూర్ వద్ద శుద్ధి చేస్తున్నారు. కేసీఆర్ హయాంలోనూ ఇదేరీతిన డిజైన్ ఉందనుకున్నా గత డిజైన్‌లో దూరం 23 కిలోమీటర్లు మాత్రమే. కానీ ఇప్పుడు రెట్టింపునకు పైగా పెరిగింది. తద్వారా ఈ రూపంలోనూ భారం పెరగనుంది.

5560 కోట్లతో పైప్‌లైన్!

మొదటిపేజీ తరువాయి...

రుణాన్ని తీసుకోనున్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయించనుంది. ప్రాజెక్టు ద్వారా నగరానికి అదనంగా గోదావరి జలాలు తరలించడంతో పాటు హియాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలకు పునరుజ్జీవం తేనున్నారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 30 టీఎంసీలు కేటాయించి నగరానికి తాగునీటి భరోసా కల్పించారు. ఇందులో భాగంగానే గోదావరి రెండో దశ పనులు చేపట్టేందుకు సర్కారు నిర్ణయించింది.

2030 అవసరాలకు తగ్గట్టు..

జలమండలి రోజూ హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు కృష్ణా మూడు దశలు, గోదావరి తొలి విడత, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, సింగూరు, మంజీరాల నుంచి 580 ఎంజీడీల నుంచి 600 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నది. దాదాపు 13 లక్షల నల్లా కనెక్షన్లకు తాగునీటిని అందిస్తున్నది. హైదరాబాద్ విస్తరిస్తుండటం, ఓఆర్ఆర్ వరకు జలమండలి పరిధి విస్తరించడంతో 2030 వరకు నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని 170 ఎంజీడీల అదనపు జలాల సరఫరాను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. గోదావరి నుంచి మొత్తం 30 టీఎంసీలు వాడుకునే వెసులుబాటు ఉండగా గోదావరి ఫేజ్-2 ద్వారా అదనపు జలాలు వాడుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. 2030 వరకు హైదరాబాద్ తాగునీటి డిమాండ్ 750 ఎంజీడీల వరకు పెరగనున్నదని అధికారులు అంచనావేస్తున్నారు. 2050 నాటికి 1014 ఎంజీడీలుగా ఉండనున్నది. ఈ డిమాండ్ మేరకే ప్రాజెక్టు పట్టాలెక్కిందని అధికారులు చెబుతున్నారు.

రెండేండ్లలో ప్రాజెక్టు నిర్మాణం

గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లయ్ ఫేజ్-1 కింద నగర ప్రజల నీటి అవసరాల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలి ఇప్పటికే 10 టీఎంసీల నీరు తరలిస్తున్నది. రెండో దశ ద్వారా మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి మరో 15 టీఎంసీల నీటిని వాడుకునే అవకాశం ఉన్నది. 15 టీఎంసీల్లో 10 టీఎంసీలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు పోను మూసీ ప్రక్షాళనలో భాగంగా జంట జలాశయాల పునరుజ్జీవనానికి మరో 5 టీఎంసీలు ఉపయోగించనున్నారు. డీపీఆర్ (డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)ను వ్యాప్కోస్ కంపెనీ సిద్ధంచేసింది. పంప్‌హౌస్‌లు, సబ్‌స్టేషన్లు, మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు 3600 ఎంఎం డయా పైపులైన్ నిర్మించనున్నారు. ఘన్‌పూర్, శామీర్‌పేట్ వద్ద 780 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటిశుద్ధి కేంద్రాన్ని (డబ్ల్యూటీపీ) నిర్మించనున్నారు. ఘన్‌పూర్ నుంచి ముత్తంగి వరకు పంపింగ్ మెయిన్ నిర్మాణం, ఇతర పనులు చేపట్టనున్నారు. రెండేండ్లలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ప్రాజెక్టు విశేషాలు

- మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు 15 టీఎంసీల నీటి తరలింపునకు 3600 ఎంఎం డయా భారీ పైపులైన్ నిర్మాణం.
- ఘన్‌పూర్ నుంచి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌కు ఐదు టీఎంసీల నీటి తరలింపు.
- ఘన్‌పూర్ వద్ద 780 ఎంఎల్‌డీ సామర్థ్యంతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు.
- ఉస్మాన్‌సాగర్ (గండిపేట) వద్ద 120 ఎంఎల్‌డీ, హిమాయత్‌సాగర్‌లోని రాజేంద్రనగర్ వద్ద 70 ఎంఎల్‌డీ సామర్థ్యంతో డబ్ల్యూటీపీ ప్లాంట్ నిర్మాణం
- ఘన్‌పూర్ డబ్ల్యూటీపీ నుంచి ముత్తంగి జంక్షన్ వరకు 3000 ఎంఎం డయారింగ్ మెయిన్ ద్వారా నీటిని తరలించి వెస్టన్ పార్ట్‌లో ఓఆర్ఆర్ పరిధిలో నీటి తరలింపు.

వరద కాల్వకు గండి



నల్లగొండ జిల్లా అనుముల మండలంలోని మారేపల్లి-పులిమామిడి గ్రామాల మధ్య మంగళవారం ఉదయం వరద కాల్వకు గండి పడింది. 40 మీటర్ల మేర కట్ట కోత పడడంతో నీళ్లన్నీ హాలియా వాగులోకి వృథాగా పారాయి. దీంతో అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. ఐదు రోజుల్లో గండిని పూడ్చివేస్తామని ఇరిగేషన్ ఏఈ ఆంజనేయులు తెలిపారు. - హాలియా



నాగార్జునసాగర్ ప్రాజెక్టు 22 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు పరుగులు తీస్తున్న జలాలు

22 గేట్లెత్తి సాగర్ నీటి విడుదల

- నిండుకుండల్లా శ్రీశైలం, జూరాల

నందికొండ/చింతలపాలెం/గద్వాల/అయిజ/శ్రీశైలం, ఆగస్టు 6: నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద పోటెత్తండంతో 22 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులకు సోమవారం రాత్రికి 585 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు 22 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,08,770 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం, జూరాల ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. జూరాలకు 2,52,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా 33 గేట్లు ఎత్తి 2,49,359 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 3,71,093 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 10 క్రస్ట్ గేట్లను 12 అడుగులమేర ఎత్తి 3,72,053 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు.

పులిచింతలలో విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభం

నాగార్జునసాగర్ నుంచి వరద పోటెత్తుతుండటంతో పులిచింతలలోని తెలంగాణ జెన్‌కో విద్యుత్తు కేంద్రంలో విద్యుత్తు ఉత్పత్తిని మంగళవారం ప్రారంభించారు. జెన్‌కోలో 4 యూనిట్లలో విద్యుత్తు ఉత్పాదనకు అవకాశం ఉండగా ప్రస్తుతం 10 వేల క్యూసెక్కుల నీటితో మూడు యూనిట్లను నడిపిస్తూ 60 మెగావాట్లను ఉత్పత్తి చేస్తున్నట్టు ఎస్ఈ దేశ్యానాయక్ తెలిపారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై జులుం

- తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద అధికార పార్టీ దౌర్జన్యం
- మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ వైఖరి వివాదాస్పదం
- మోటర్లను ఆన్ చేసిన ఎమ్మెల్యే విజయుడు
- బంద్ చేయించిన సంపత్‌కుమార్
- రైతులకు నీళ్లివ్వాలని పోలీసుల కాళ్లు పట్టుకున్న ఎమ్మెల్యే
- ఎమ్మెల్యే విజయుడి అరెస్టుపై నిరసనలు

రాజోళి, ఆగస్టు 6: జోగుళాంబ గద్వాల జిల్లా తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడిపై అధికార కాంగ్రెస్ పార్టీ జులుం ప్రదర్శించింది. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ప్రొటోకాల్ పద్ధతినే అపహాస్యం చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలకు తలొగ్గిన అధికారులు ఎమ్మెల్యేనే అరెస్ట్ చేయించారు. తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన ఈ ఘటన మంగళవారం జరిగింది. పెద్ద ఎత్తున వరద రావడంతో ప్రొటోకాల్ ప్రకారం ఇరిగేషన్ అధికారుల పిలుపుమేరకు ఎమ్మెల్యే విజయుడు ఎత్తిపోతల మోటర్లను ఉ.7:15 గంటలకు రన్ చేశారు.విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే సంపత్ అనుచరులతో ప్రాజెక్టు వద్దకు చేరుకొని మోటర్లను బంద్ చేయించారు. అక్కడున్న సిబ్బందిపై అధికార పార్టీ నాయకులు చేయిచేసుకున్నట్టు స్థానికులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సంపత్ వైఖరిపై ఎమ్మెల్యే విజయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. మోటర్లు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌ను, ఇరిగేషన్ అధికారులను కోరారు. ఎన్నిసార్లు విన్నవించినా ఆన్ చేయకపోవడంతో ఎమ్మెల్యే లిఫ్ట్ వాటర్ డెలివరీ పాయింట్ డీ-22 వద్దకు చేరుకొని రైతులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసనకు దిగారు. మోటర్లు ఆన్ చేసేవరకు నిరసనలు ఆపేది లేదని టెంటు వేసి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రైతులు వంటావార్పు చేపట్టారు. సాగునీరు అందించాలని తాను వస్తే రాజకీయం చేయడం సరికాదని ఎమ్మెల్యే విజయుడు మండిపడ్డారు.నడిగడ్డరైతులకు కేసీఆర్ ఇచ్చిన వరం తుమ్మిళ్ల ప్రాజెక్టు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



రైతులకు నీళ్లివ్వాలని పోలీసుల కాళ్లు పట్టుకుంటున్న ఎమ్మెల్యే విజయుడు

పోలీసుల కాళ్లు పట్టుకున్న ఎమ్మెల్యే

అడిషనల్ ఎస్పీ గుణశేఖర్, ఇతర పోలీస్ అధికారులు అక్కడకు చేరుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మోటర్లను ఈ రోజు ప్రారంభించం, అందరూ వెళ్లిపోవాలని కోరారు. మోటర్లు ఆన్ చేసేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని ఎమ్మెల్యే తేల్చిచెప్పారు. రైతులకు సాగునీరు అందించాలని, అదే తన లక్ష్యమని వేడుకుంటూ అడిషనల్ ఎస్పీ గుణశేఖర్ కాళ్లు పట్టుకొని ఎమ్మెల్యే విజయుడు విన్నవించారు. అయినా వినని పోలీసులు ఎమ్మెల్యేతో పాటు రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేసి శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో రైతులు, కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే సంపత్ అక్కడికి చేరుకొని పంపులను ఆన్ చేయాలని అనుచరులు, రైతులతో కలిసి బైఠాయించారు. ఆర్డీఎస్ ఉన్నతాధికారులు, కలెక్టర్‌కు ఫోన్ చేశారు. అధికారులు మోటర్లను ఆన్ చేయడంతో పూజలు నిర్వహించారు. అనంతరం సంపత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని అయిజ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఇదేనా ప్రజాపాలన: కేటీఆర్

అలంపూర్ ఎమ్మెల్యే విజయుడి పట్ల ప్రభుత్వ అధికారులు వ్యవహరించిన తీరుపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో ప్రతినిధులకు రోజూ అవమానాలేనా? అని నిప్పులు చెరిగారు. ఎమ్మెల్యే విజయుడు పట్ల గద్వాల జిల్లా అధికార యంత్రాంగం వ్యవహరించిన అనుచిత తీరుపై మండిపడ్డారు. ప్రజల చేతిలో తిరస్కరించబడిన కాంగ్రెస్ నేతలను అధికారిక సమావేశాలకు, కార్యక్రమాలకు ఎందుకు ఆహ్వానిస్తున్నారో చెప్పాలని, రాష్ట్రంలో ప్రజాప్రతినిధులను అవమానించేందుకు ప్రభుత్వం ప్రొటోకాల్ విధానాలను మార్చిందా.. అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రశ్నించారు.

లోకం పోకడ



రుణాలు మాఫీ కావడం లేదని ప్రభుత్వాన్ని ఎందుకు బద్నాం చేస్తారయ్యా? ఆయన పేరు మీద నేను తీసుకున్న రుణం మాఫీ అయ్యింది గదా!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	36.8°c	23.5°c
నల్లగొండ	35.9°c	22.0°c
రంగారెడ్డి	35.8°c	22.2°c
మెదక్	34.4°c	22.6°c
నిజామాబాద్	32.4°c	24.5°c
మహబూబ్‌నగర్	30.0°c	22.2°c
హైదరాబాద్	29.6°c	24.5°c
వరంగల్	28.0°c	24.0°c
కరీంనగర్	28.0°c	25.0°c
ఖమ్మం	26.0°c	24.0°c



జనగామ జిల్లాలోని చీటకోడూరు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

రెండు నెలలైనా సాగు నీరివ్వరా?

- చీటకోడూరు రిజర్వాయర్ ఎండుతున్నది
- 4 రోజులైతే జనగామకు మంచినీరు బంద్
- దేవాదుల అధికారులపై ఎమ్మెల్యే పల్లా ఫైర్

జనగామ, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): 'చిన్నచిన్న కారణాలు చెప్పి రైతులకు సాగునీరు, జనగామ పట్టణ ప్రజలకు తాగునీళ్లు ఇవ్వకుండా చీటకోడూరు రిజర్వాయర్‌ను ఎండబెడుతరా? మొన్నటి దాకా మేం (కేసీఆర్ ప్రభుత్వం) నీళ్లు ఇచ్చాం కదా? ఎవరైనా నీళ్లు ఇవ్వద్దని మీకు చెప్పారా?' అంటూ నీటిపారుదల శాఖ సీఈ అశోక్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి ఫోన్‌లో నిలదీశారు. మంగళవారం ఆయన జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కౌన్సిలర్లు, జిల్లా నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి జనగామ జిల్లా జనగామ మండలం చీటకోడూరు రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఫుట్‌బాల్స్ తేలి నీరు అడుగంటడాన్ని చూసి ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే సంబంధిత దేవాదుల, నీటిపారుదల శాఖ ఉమ్మడి జిల్లా అధికారులకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. జనగామ పట్టణ ప్రజలకు తాగునీరు అందించే రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరిందని,మూడు ఫుట్‌బాల్స్‌లో రెండు పైకి తేలాయని, రెండు, మూడురోజుల్లో నీరు మొత్తం అడుగంటి జనగామ ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే అశ్వారావుపల్లి నుంచి జనగామకు తాగునీటి కోసం నీళ్లు వదలాలని కోరారు. ధర్మసాగర్ నుంచి ఆర్ఎస్ ఘన్‌పూర్‌కు నీటిని వదిలి రెండో పంపు ఆన్ చేస్తే.. అక్కడి నుంచి అశ్వారావుపల్లికి వచ్చి.. అక్కడి నుంచి చీటకోడూరుకు నీళ్లు రావడానికి నాలుగురోజులు పడుతుందని వివరించారు. ధర్మసాగర్ నుంచి గండిరామారానికి కూడా నీటిని విడుదల చేయాలని సూచించారు. తపాస్‌పల్లి, బొమ్మకూర్, గండిరామారం రిజర్వాయర్ల ఆయకట్టు కింద 40 శాతం కూడా నాట్లు పడలేదని, నార్లు ముదిరిపోతున్నాయని, చిన్న చిన్న కారణాలు చెప్పి నీళ్లు వదలకుండా రైతులను గోస పెడుతరా? అంటూ సీఈ అశోక్ కుమార్‌ను ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి నిలదీశారు.



ఇంటి ఆవరణలోకి మొసలి

పెబ్బేరు, ఆగస్టు 6: వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం జానంపేటలో మంగళవారం ఓ ఇంట్లోకి మొసలి వచ్చింది. గ్రామానికి చెందిన నాగన్న ఇంటి వద్ద మంగళవారం తెల్లవారుజామున కుక్కలు పెద్దగా అరిచాయి. నాగన్న నిద్రలేచి చూడగా బాత్‌రూం పక్కనే మొసలి కనిపించింది. వెంటనే 100కు ఫోన్ చేయగా పోలీసులు, సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్ అక్కడకు చేరుకొని మొసలిని బంధించారు. అటవీ శాఖ అధికారి రాణి సమక్షంలో కృష్ణానదిలో మొసలిని వదిలారు. రామసముద్రం చెరువు నుంచి రావొచ్చని గ్రామస్తులు తెలిపారు.

కారు ప్రయాణం కులాసాగా సాగాలంటే.. ఏసీ పక్కాగా పనిచేయాలి. అద్దాలు దించుకుంటే గాలి వస్తుంది కానీ, ఆహ్లాదాన్ని ఇవ్వదు. పైగా.. భీకర శబ్దంతో ప్రయాణం చికాకుగా మారిపోతుంది. అందుకే, కారు ఎక్కీఎక్క గానే.. ఏసీ వేసుకొని జాయ్‌ఫుల్ జర్నీకి శ్రీకారం చుడతారు. అయితే, మనకు చల్లదనాన్ని పంచే ఏసీని సరిగ్గా నిర్వహించడం చాలా అవసరం.

కారు ఏసీ జర భద్రం



కారు స్టార్ట్ చేయగానే వెంటనే ఏసీ ఆన్ చేయడం సరికాదు. కొత్త కారైతే పర్వాలేదు కానీ.. కాస్త పాత మోడల్ అయితే, ఇంజిన్‌పై భారం పడొచ్చు. జర్నీ మొదలయ్యాక ఐదు నిమిషాలకు ఆన్ చేయడం మంచిది.

ఒకసారి ఏసీ వేసి.. మళ్లీ కారు ఆగే వరకూ ఆఫ్ చేసేది లేదు అనుకోవద్దు. గంట తర్వాత కొన్ని నిమిషాలపాటు ఏసీ ఆఫ్ చేయడం వల్ల లైఫ్ బాగుంటుంది. ఇది ఏసీ సిస్టమ్ లూబ్రికేషన్‌కు సాయపడుతుంది.

ఏసీ ఫిల్టర్‌ను శుభ్రం చేయడం మర్చిపోవద్దు. ప్రతి 15వేల కిలోమీటర్లకు ఒకసారి ఏసీ ఫిల్టర్స్‌ను శుభ్రం చేయాలి. లేకపోతే గాలి ప్రవాహం మందగిస్తుంది. ఏసీ సామర్థ్యాన్ని కోల్పోతుంది.

క్లియర్ కండెన్సర్, ఎవాపరేటర్లలో చెత్త లేకుండా చెక్ చేసుకోవాలి. దుమ్ము పేరుకుపోతే.. ఏసీ పనితీరుపై ప్రభావం పడుతుంది. ఏసీ గ్రిల్స్‌ను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం వల్ల.. ఎలాంటి అడ్డంకులు లేకుండా విస్తారంగా గాలి రావడానికి ఆస్కారం ఉంటుంది.

కారు డాష్‌బోర్డ్‌తోపాటు, ఏసీ ఫిల్టర్స్‌లో దుమ్ము, ధూళి, ఇతర హానికారక పదార్థాలు ఉన్నట్టయితే.. ఏసీ వేయగానే క్యాబిన్ అంతా దుర్వాసన వచ్చే అవకాశం ఉంది. కారు ఏసీ ఫిల్టర్లు గ్యాస్, ఇతర ఘాటైన వాసనలను నిరోధించగలిగేంత బలంగా ఉండవు. మీ వాహనం గ్యాస్ లీక్ చేస్తున్నట్టయితే, ఏసీ ద్వారా అది కారు క్యాబిన్‌లోకి ప్రవేశించే అవకాశం ఉంది. గ్యాస్ లీక్ కావడం ప్రమాదకరం. అలాంటి వాసన వస్తే.. వెంటనే ఏసీ ఆఫ్ చేయాలి. సాధారణ మెకానిక్‌ను సంప్రదించడం కన్నా.. ఆథరైజ్డ్ సర్వీస్ సెంటర్‌లో చూపించడం మంచిది.

ఏసీ వేశాక కూడా.. చల్లబడకపోయినా, ఉష్ణోగ్రతలో ఆకస్మిక మార్పులు కలిగినా, అసాధారణమైన శబ్దాలు వచ్చినా.. వెంటనే మెకానిక్‌ను సంప్రదించడం అవసరం. నిర్లక్ష్యం చేస్తే వంద రూపాయలతో పోయేది వేలకు పెరగొచ్చు.

ప్రయాణాల్లో ఉన్నప్పుడు, మిగతా సమయాల్లోనూ కారును మండుటెండలో కాకుండా.. నీడ పట్టున పార్క్ చేయడం అవసరం. ఇది ఏసీ పనితీరును మెరుగుపరుస్తుంది.

సీడ్ సైక్లింగ్ అంటే..?

ఫుడ్ సైన్స్

హలో జిందగీ. ఇటీవల వినిపిస్తున్న సీడ్ సైక్లింగ్ అంటే ఏమిటి? దీని వల్ల గర్భాశయ ఆరోగ్యానికి కలిగే మేలేంటి? ఇందుకోసం ఏం తినాలి? ఎంతెంత తినాలి? తెలియజేయండి.

• ఓ పాఠకురాలు

రుతుక్రమం అన్నది పూర్తిగా మహిళ శరీరంలోని హార్మోన్ల మీద ఆధారపడి ఉంటుంది. వాటి స్థాయులు ఎలా ఉన్నాయన్నదే... రుతుక్రమాన్నీ, గర్భధారణనూ ప్రభావితం చేస్తుంది. ఈ హార్మోన్లను సమతుల్యం చేసి, మహిళల్లో గర్భధారణ ఫలవంతం అయ్యేందుకు సహకరించే ఆహార పద్ధతినే సీడ్ సైక్లింగ్ అని పిలుస్తారు.

రుతుక్రమాన్ని రెండు విభాగాలుగా విడగొట్టొచ్చు. మొదటిది నెలసరి ప్రారంభం అయినప్పటినుంచి అండం విడుదల అయ్యేరోజు వరకూ... రెండోది అండం విడుదల అయినప్పటి నుంచి నెలసరి వచ్చేవరకు. ఈ సమయాల్లో కొన్ని రకాల గింజలు తీసుకోవడం ద్వారా పిల్లలు పుట్టే అవకాశాన్ని పెంచవచ్చు.

ఇందులో తొలిదశలో అంటే.. నెలసరి ప్రారంభం అయినప్పటినుంచి అండం విడుదల అయ్యేరోజు వరకూ లేదా 1–14 రోజుల వరకూ... రోజూ ఒక టేబుల్ స్పూన్ అవిసె గింజలు, ఒక టేబుల్ స్పూన్ గుమ్మడి గింజలు తినాలి.

రెండో దశలో అంటే.. అండం విడుదల అయినప్పటినుంచి నెలసరి వచ్చేవరకు లేదా 15– 28 రోజుల వరకూ... రోజూ ఒక టేబుల్ స్పూన్ పొద్దుతిరుగుడు గింజలు, ఒక టేబుల్ స్పూన్ నువ్వులు తినాలి.

ఇలా చేయడం వల్ల శరీరంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్లు సమతుల స్థితిలో ఉంటాయి. ఒక్క గర్భధారణ కోసమనే కాదు, పీసీఓఎస్, ఇర్రెగ్యులర్ పీరియడ్స్, థైరాయిడ్ వల్ల రుతుక్రమం దెబ్బతిన్నప్పుడు కూడా ఇది చక్కగా పనిచేస్తుంది. పిల్లలు పుట్టాక వచ్చే పిగ్మెంటేషన్ సమస్యలు, మెనోపాజ్ సమయంలోనూ ఇది మంచిదే. అయితే కనీసం మూడు నెలలు క్రమం తప్పకుండా ఇలా చేస్తే దీని ఫలితాలు కనిపించడం ప్రారంభం అవుతాయి. తొలి దశలో గుమ్మడి, అవిసె



గింజలు... ఈస్ట్రోజెన్ స్థాయుల్ని అదుపులో ఉంచుతాయి. అవిసెల్లో ఉండే లిగ్నన్‌లుగా పిలిచే పాలీఫినాల్స్ అధిక ఈస్ట్రోజెన్‌ను పట్టి ఉంచుతాయి. గుమ్మడి గింజల్లో ఉండే జింక్ ప్రొజెస్టిరాన్ ఉత్పత్తికి సహకరిస్తుంది. పొద్దుతిరుగుడు గింజలు, నువ్వులు కూడా ప్రొజెస్టిరాన్ ఉత్పత్తిని పెంచేవే. అయితే నువ్వుల్లో ఉండే లిగ్నన్‌లు ప్రొజెస్టిరాన్ స్థాయులను అదుపులో ఉంచుతాయి. పొద్దుతిరుగుడు గింజల్లో ఉండే విటమిన్– ఇ ప్రొజెస్టిరాన్ ఉత్పత్తికి సహకరిస్తే... ఇందులోని సెలీనియం కాలేయంలో ఉండే అధిక ఈస్ట్రోజెన్‌ను తొలగిస్తుంది.



మయూరి ఆవుల
న్యూట్రిషనిస్ట్
Mayuri.trudiet@gmail.com

వానకాలంలో చర్మ సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది. తేమతో కూడిన వాతావరణంలో, చర్మం నిగారింపు కోల్పోతుంది. పోయిన అందాన్ని రెట్టింపుగా పొందాలంటే.. ఇంట్లోనే తయారు చేసుకున్న ఈ సహజమైన ఫేస్ స్క్రబ్‌లను ప్రయత్నించండి.

స్క్రబ్ చేద్దాం..



ఒక గిన్నెలో రెండు టేబుల్ స్పూన్ల శనగపిండి, అర టీ స్పూన్ పసుపు, రెండు టేబుల్ స్పూన్ల పాలు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లయ్ చేసి ఐదు నిమిషాలపాటు బాగా రుద్దుకోవాలి. పదిహేను నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత.. చల్లటినీళ్లతో ముఖాన్ని రుద్దుతూ శుభ్రం చేసుకుంటే.. చర్మం కొత్త కాంతిని సంతరించుకుంటుంది.

రెండు టేబుల్ స్పూన్ల ఓట్‌మీల్‌ను మెత్తగా, పౌడర్‌లా గ్రైండ్ చేసుకోవాలి. ఇందులో ఒక చెంచా తేనె, ఒక చెంచా పెరుగు వేసి బాగా మిక్స్ చేయాలి. ఈ స్క్రబ్‌ను ముఖానికి అప్లయ్ చేసి పదిహేను నిమిషాలు ఉంచుకోవాలి. తర్వాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేయాలి. ఈ స్క్రబ్.. చర్మంలోని మృతకణాలను తొలగించి, మెరుపు తీసుకొస్తుంది.

రెండు టేబుల్ స్పూన్ల చక్కెర, ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం, ఒక టేబుల్ స్పూన్ ఆలివ్ నూనె మిక్స్ చేయాలి. ఈ స్క్రబ్‌ను ముఖంపై సున్నితంగా రుద్దుకోవాలి. పది నిమిషాల తర్వాత శుభ్రం చేసుకుంటే.. మీ అందం రెట్టింపు అవుతుంది.



ఆమె ఆరోగ్యంగా ఉంటే.. ఇంటిల్లిపాదికీ మహాభాగ్యం. ఆరోగ్యకరమైన సమాజమూ నిర్మాణం అవుతుంది. అదే ఇల్లాలికి సుస్తీ చేస్తే... జాతికి చీడ పట్టినట్టే! అమ్మ కలత చెందకుండా ఉంటేనే సమాజం పరిఢవిల్లుతుంది. ప్రగతి సాధిస్తుంది. ఆ తల్లి ఆరోగ్యంగా ఉండాలంటే? ఈ ఆలోచనే ఆ కలెక్టరమ్మను 'శుక్రవారం గ్రామసభ'కు పిలుపునిచ్చేలా చేసింది. ప్రతి ఇల్లాలినీ ఆరోగ్యవంతురాలిని చేయాలనే సంకల్పంతో ఈ క్రతువుకు శ్రీకారం చుట్టారు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి. మహిళల సంపూర్ణ ఆరోగ్యమే 'శుక్రవారం గ్రామసభ' లక్ష్యం. రెండు నెలలుగా అమలవుతున్న ఈ కార్యక్రమం.. పల్లెపల్లెకూ ఆరోగ్యలక్ష్మిని పరిచయం చేస్తున్నది.

శుక్రవారం.. గ్రామలక్ష్మి

ఏ పట్టాలూ అందుకోకున్నా.. బహుముఖ ప్రజ్ఞ అతివ సొంతం. ఇల్లాలిగా కుటుంబ పోషణ చూసుకుంటుంది. భార్యగా కట్టుకున్నవాడి మర్యాద నిలబెడుతుంది. అమ్మగా తన పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతుంది. కుటుంబ శ్రేయస్సే పరమావధిగా జీవనం సాగిస్తున్న మహిళలు.. తమ గురించి తాము పట్టించుకునే పరిస్థితులు చాలా అరుదు. ఈ నిర్లిప్త ధోరణి వారి ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నది. రక్తహీనత, పోషకాహార లేమి ఆడబిడ్డలను పట్టి పీడిస్తున్నాయి. అయినా తన వారి పోషణ, కుటుంబ రక్షణే ముఖ్యంగా భావించి తమ అనారోగ్యాన్నీ అంతగా పట్టించుకోకుండా, ముఖంపై నవ్వు పులుముకొని భారంగా బతికీడుస్తున్న తల్లులు ఎందరో! అయితే, ఇల్లాలు మంచాన పడితే.. ఆ కుటుంబం రోడ్డున పడ్డట్టే!! ఈ పరిస్థితులను అర్థం చేసుకున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి సరికొత్తగా ఆలోచించారు. గృహిణి ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇల్లు, కుటుంబం బాగుంటుందన్న నినాదాన్ని బలంగా గ్రామాల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. అందుకోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి శుక్రవారం గ్రామసభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటి పరిధిలో 5,116 మంది గర్భిణులు, 3,536 మంది బాలింతలు ఉన్నారు. వీరితోపాటు చిన్నపిల్లల తల్లులున్నారు. ప్రతి శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే శుక్రవారం గ్రామసభకు వీరంతా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతివారం కలెక్టర్ ఏదో ఒక అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే సభకు స్వయంగా హాజరవుతున్నారు.

ఎన్నో ప్రయోజనాలకు వేదిక

'శుక్రవారం గ్రామసభ' క్షేత్రస్థాయిలో గృహిణులు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యల పరిష్కారానికి వేదికగా నిలుస్తున్నది. మహిళలకు సంబంధించి ఆరోగ్య సమస్యలు కావచ్చు, వ్యక్తిగత సమస్యలు కావచ్చు, ఇతరత్రా ఏవైనా ఇబ్బందులు కావచ్చు ఈ సభలో చెప్పుకోవచ్చు. ఇన్నాళ్లూ ఎవరికి చెప్పుకోవాలో తెలియక లోలోపల మానసికంగా కుంగిపోతున్న మహిళలు ఎందరో వారి ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. ఇదిలా ఉండగా, శుక్రవారం గ్రామసభ మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నది. సభలో మహిళా శిశు సంక్షేమ అధికారులతోపాటుగా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మాత్రమే కాకుండా వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. రక్తహీనతతో బాధపడే వారిని గుర్తించి.. అవసరమైన మందులు ఇచ్చేలా చూస్తున్నారు. ఇతర అనారోగ్య సమస్యలు ఏమైనా ఉంటే.. అవసరమైన పరీక్షలు, వీలైన మేరకు స్కానింగ్ చేయిస్తున్నారు. గ్రామసభలో సాధ్యం కాకపోతే శాంపిల్స్ సేకరించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో పరీక్షలు చేయించే ఏర్పాటుచేశారు. ఆ పరీక్షా ఫలితాల ఆధారంగా సరైన వైద్య సేవలు అందేలా చూస్తున్నారు. చిన్నచిన్న సమస్యలకు ప్రైవేట్ దవాఖానలకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని చెబుతున్నారు. వారి పరిధిలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల వివరాలు, అక్కడ అందుబాటులో ఉన్న వైద్య సేవల వివరాలను తెలియజేస్తున్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిస్థితిపై పరీక్షలు చేసి.. వారికి సలహాలు, సూచనలు ఇస్తున్నారు. గర్భిణులు ఏయే నెలల్లో ఎలాంటి పరీక్షలు చేసుకోవాలి? స్కానింగ్‌లకి ఎప్పుడు వెళ్లాలి? మంచి పోషకాహారం తీసుకోవడం వల్ల ఉండే ప్రయోజనాలను వివరిస్తూ మహిళల్లో కొత్త ఆలోచనలకు అవకాశం కల్పిస్తున్నారు. ఇలా ఆడబిడ్డల ఆరోగ్య కేంద్రంగా శుక్రవారం గ్రామసభ కొనసాగుతున్నది. ఆరోగ్య సూత్రాలు చెబుతూనే, అనారోగ్య సమస్యలను పరిష్కరిస్తున్న కలెక్టరమ్మకు పల్లె పడుచులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

... కడపత్రి ప్రకాశ్‌రావు

ఇల్లాలు బాగుంటే


పురాణాలే కాదు.. శాస్త్రాలు, సర్వేలు, అధ్యయనాలు మనకు ఒక్కటే సూచిస్తున్నాయి. ఇల్లాలి ఆరోగ్యం బాగుంటేనే ఇంటిల్లిపాది బాగుంటుందని చెబుతున్నాయి. కానీ, చాలామంది మహిళలు ఈ దిశగా ఆలోచించడం లేదు. తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం లేదు. దీంతో ఇల్లాలి ఆరోగ్యం కుంటుపడుతున్నది. తద్వారా కుటుంబ భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారవుతున్నది. వ్యాధి ముదిరితే.. వైద్యానికి అయ్యే ఖర్చులు ఆ కుటుంబ ఆర్థిక వ్యవస్థనే ఛిన్నాభిన్నం చేస్తాయి. సమస్యను మొగ్గలోనే తుంచాలంటే.. ఆరోగ్యంపై అతివలకు అవగాహన కల్పించాలి. రుగ్మతల బారినపడకుండా ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలియజేయాలి. దానిని ఆచరణలో తీసుకురాగలిగితే ఇల్లాలి ఆరోగ్యం బాగుంటుంది. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం రూపుదిద్దుకుంటుంది. ఈ లక్ష్యంతోనే 'శుక్రవారం గ్రామసభ' నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి మంచి స్పందన వస్తున్నది. దీనిని మరింత బలోపేతం చేయాలనే సత్సంకల్పంతో నాతోపాటు అధికార యంత్రాంగం ప్రయత్నిస్తున్నది.

• **పమేలా సత్పతి,** కరీంనగర్ జిల్లా కలెక్టర్

పదార్థం అంటుకోకుండా..!

నాన్‌స్టిక్ కడాయి, పాన్లు లేని వంటిల్లు లేదిప్పుడు. ఈ పాత్రల అతి వినియోగం అనారోగ్యానికి హేతువని చాలా పరిశోధనలు చెబుతున్నాయి. ప్రతి రోజూ నాన్‌స్టిక్ పాన్‌లో వండుకున్న ఆహారం తినడం వల్ల క్యాన్సర్ వంటి తీవ్ర రుగ్మతలు కూడా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నాయి. వీటికి బదులు స్టీల్ పాన్, ఇనుప కడాయిలో వండుకోవడం శ్రేయస్కరమన్నది నిపుణుల మాట. అయితే స్టీలు, ఐరన్ పాత్రల్లో వండినప్పుడు అడుగు పేరుకుపోతుంటుంది. వాటిని శుభ్రం చేయడం కష్టంగా భావించి.. నాన్‌స్టిక్ పాన్‌లో వండుకొని రోగాలు కొని తెచ్చుకుంటామా చెప్పండి! ఈ సమస్యకు పరిష్కారం... స్టీలు పాత్రలు వాడినప్పుడు అడుగు మాడు పేరుకుపోకుండా చూసుకోవడమే! అందుకోసం ఈ టిప్స్ ఫాలో అవ్వండి..

- స్టీలు కడాయి, పాన్ వాడినప్పుడు అది సరిగ్గా వేడెక్కాలి. పాత్ర మరీ వేడెక్కితే.. నూనెలో పదార్థాలు వేయగానే వాటిలోని తేమ బయటికి వచ్చి ఆహారం అడుగున అంటుకోవడం మొదలవుతుంది. అయితే, కడాయి సరైన మోతాదులో వేడెక్కిందని నిర్ధారించడానికి రెండు పద్ధతులు ఉన్నాయి. పాన్ బాగా వేడెక్కినప్పుడు దానిపై కొన్ని చుక్కల నీళ్లు చిలకరించాలి. పెద్ద శబ్దంతో నీళ్లు ఆవిరైతే పాన్ అతిగా వేడెక్కిందని గుర్తుంచుకోండి. నీరు బుడగలుగా మసిలినట్లయితే.. మోతాదు వేడిగా ఉందని అంచనాకు రావొచ్చు. అంటే సరైన వేడితో ఉందన్నమాట. ఈ ఉష్ణోగ్రత వద్ద నూనె వేసి.. వంట కొనసాగించాలి.
- స్టీల్ పాన్ వేడిని వెన్న ద్వారా కూడా నిర్ణయించొచ్చు. పాన్ వేడెక్కిన తర్వాత దానిపై వెన్న వేయాలి. వెన్న కొద్దిగా కరిగి.. మిగిలినది నెమ్మదిగా జారిపోతే... పాన్ ఉష్ణోగ్రత కచ్చితంగా ఉన్నట్టు నిర్ధారించుకోవాలి.
- స్టీలు, ఉక్కుపాత్రల అడుగున పదార్థాలు అంటుకుపోవద్దంటే.. పాత్ర వేడెక్కిన తర్వాత మొదట కొద్దిగా నూనె వేసి.. శుభ్రమైన వస్త్రంతో తుడవాలి. తర్వాత కొన్ని నీళ్లు చిలకరించాలి. అప్పుడు నీటి బిందువులు ముత్యాల్లా గుండ్రంగా మారి పాత్రంతా వ్యాపిస్తాయి. ఆ సమయంలో కొద్దిగా నూనె వేసుకుని.. పాకయాగం ప్రారంభిస్తే, పదార్థం అడుగున అంటుకోకుండా ఉంటుంది.



ట్రెండ్ సెట్ చేసే.. మైండ్ సెట్ టెక్నిక్!

'సమస్యలు ఎప్పుడూ చెప్పి రావండీ..!' అచ్చా.. చాలా సార్లు విన్నాంలే గానీ.. కొత్తగా ఏదైనా చెప్పండి అంటారా? రైట్.. 'మేటర్ ఏదైనా మైండ్‌లో నుంచే పుడుతుంది' అబ్బో.. 'ఏంటా మేటర్?' అని ఆలోచిస్తున్నారా? అయితే, ఓ కొత్త మైండ్ సెట్ టెక్నిక్ గురించి తెలుసుకోవాల్సిందే. అదేంటంటే.. 'మైండ్ ఓవర్ మేటర్'. ఈ కాన్సెప్ట్‌ని కామ్‌గా మీరు ఫాలో అయితే.. సమస్యలు చెప్పి వచ్చినా చక్కగా ఫేస్ చేయొచ్చు. ఇట్టే పరిష్కారం వెతికేయొచ్చు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. 'ల్యాగ్ వద్దులేగానీ.. విషయంలోకి రండి!' అనుకోకండి.. మైండ్‌ని కాస్త స్లోడౌన్ చేయండి. గట్టిగా ఊపిరి తీసుకోండి.. అప్పుడే 'మైండ్‌ఫుల్‌నెస్' టెక్నిక్‌ని తెలుసుకోగలం.



ఏదైనా స్టార్ట్ చేసే ముందు దాంట్లో వంద శాతం మునిగిపోవడమే మైండ్‌ఫుల్‌నెస్ అంటే. అప్పటికి ఏం చేస్తున్నామో దాంట్లోనే జీవించడం అన్నమాట. కాస్త ధ్యానం, శ్వాసకు సంబంధించిన వ్యాయామాలు లాంటివి చేస్తే ఈ టెక్నిక్‌ని ఫాలో అయిపోవచ్చు. దీంతో సమస్యకు పాజిటివ్‌గా చెక్ పెట్టొచ్చు. మీలో మీరు.. మీతో మీరు అనుకూల వాతావరణాన్ని సృష్టించొచ్చు. దీన్నే 'పాజిటివ్ అవుట్‌లుక్' టెక్నిక్‌గా పిలుస్తున్నారు. సమస్య తీవ్రతని కాకుండా దానికున్న పరిష్కారం చూస్తారన్న మాట. వాటిని అధిగమించగానే మీలో అహాన్ని కాకుండా.. కృతజ్ఞతా భావాన్ని పెంపొందించుకుంటారు. దీంతో మీకో 'సపోర్ట్ నెట్‌వర్క్' పెరుగుతుంది. ఇది మనం చూస్తున్న సోషల్ నెట్‌వర్క్ కాదండోయ్.. మనం చూపించే కృతజ్ఞతతో మన చుట్టూ చేరే వెల్‌విషర్స్ అన్నమాట. 'ఫ్రెండ్స్, ఫ్యామిలీ, మెంటార్స్.. మన మంచి కోరే వారందరూ ఈ సపోర్ట్ నెట్‌వర్క్‌లోకి వస్తారు. సో.. ఈ టెక్నిక్స్ మీరు ఫాలో అయితే.. ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా 'మైండ్' ఎప్పుడూ 'మేటర్'పైనే ఉండి దిశా నిర్దేశం చేస్తుంది. వెంటనే పాటించేయండి!

పరిశ్రమకు బంగ్లా బెంగ



పొరుగు దేశంలో సంక్షోభంపై భారతీయ కంపెనీల్లో ఆందోళన

ఉత్పత్తి, డెలివరీలపై ప్రభావం • స్టాక్ మార్కెట్లలోనూ ప్రకంపనలు

భారీ నష్టాల్లో ఆయా సంస్థల షేర్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 6: బంగ్లాదేశ్‌లో నెలకొన్న సంక్షోభంపై భారతీయ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. పొరుగు దేశంలో కర్మాగారాలను నడిపిస్తున్న, వ్యాపారాలను నిర్వహిస్తున్న దేశీయ కంపెనీలు.. తమ ఉత్పత్తి, ఆర్డర్ల డెలివరీపై బెంగ పెట్టుకుంటున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక నిరసనల నడుమ బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అల్లరి మూకలు విధ్వంసం సృష్టిస్తుండటంతో అన్ని కార్యకలాపాలు స్తంభించిపోయాయి. మార్కెట్ మూతబడగా, వ్యాపారం ఆగిపోయింది. పరిశ్రమల్లో ఉత్పత్తి కూడా నిలిచిపోయింది. దీంతో వివిధ రంగాలపై ఆ ప్రభావం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నది.

వస్త్ర పరిశ్రమ దిగాలు

బంగ్లాదేశ్ పరిస్థితులు భారతీయ టెక్స్‌టైల్, దుస్తుల రంగాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. అక్కడి అల్లర్లు, హింస రవాణా వ్యవస్థను స్తంభింపజేయడంతో అటు నుంచి ఇటు రావాల్సిన సరకుల సప్లై నిలిచిపోతున్నదని మంగళవారం భారతీయ టెక్స్‌టైల్ పరిశ్రమ సమాఖ్య (సీఐటీఐ) ఆందోళన వెలిబుచ్చింది. బంగ్లాదేశ్‌లో ఫ్యాక్టరీలను నిర్వహిస్తున్న భారతీయ సంస్థలకు ప్రస్తుతం అక్కడి పరిస్థితులు సవాలేనని వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. సరఫరా లేక మార్కెట్ డిమాండ్‌ను అందుకోలేకపోతున్నాయని సీఐటీఐ పేర్కొన్నది. మరోవైపు బంగ్లా సంక్షోభం.. భారత్‌లో వస్త్ర పరిశ్రమకు కేంద్రంగా ఉన్న తిరుప్పూర్‌కు లాభిస్తుందన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి. అక్కడి నుంచి సరకు రాకపోతే ఇక్కడ తయారీ మరింత పుంజుకోవచ్చంటున్నారు. కాగా, భారతీయ టెక్స్‌టైల్స్‌కు బంగ్లాదేశ్ కీలక మార్కెట్‌గా వర్ధిల్లుతున్న సంగతి విదితమే. ప్రపంచవ్యాప్తంగా కూడా ఇక్కడి దుస్తుల తయారీ పరిశ్రమకు పేరున్నది. భారత్ నుంచే ఇక్కడికి నూలు పెద్ద ఎత్తున ఎగుమతి అవుతున్నది.

స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అలజడి

బంగ్లాదేశ్‌లో వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలతో సంబంధాలున్న భారతీయ సంస్థల షేర్లు.. దేశీయ స్టాక్ మార్కెట్లలో విపరీతంగా నష్టాలను చవిచూస్తున్నాయి. సఫోలా వంటనూనెల తయారీదారు మారికో షేర్ ధర 6 శాతానికిపైగా పడిపోయింది. కంపెనీ రెవిన్యూలో బంగ్లాదేశ్ అమ్మకాల వాటా 11-12 శాతంగా ఉండటమే కారణం. అక్కడి అల్లర్లతో వ్యాపారం నిలిచిపోయింది. ఇదే తరహాలో పెర్ల్ గ్లోబల్ ఇండస్ట్రీస్, ఇమామీ, బాయర్ కార్ప్, జీసీపీఎల్, బ్రిటానియా, వికాస్ లైఫ్ కేర్, డాబర్, ఏషియన్ పెయింట్స్, పిడిలైట్, జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్, బజాజ్ ఆటో షేర్లు నష్టపోతున్నాయి. టాటా మోటర్స్, హీరో మోటోకార్ప్ సేల్స్ కూడా బంగ్లాదేశ్‌లో భారీగానే జరుగుతున్నాయి. అయితే భారత్‌పైనే ఆధారపడి వ్యాపారం చేస్తున్న టెక్స్‌టైల్, దుస్తుల కంపెనీల షేర్లకు డిమాండ్ ఏర్పడింది. ఆయా సంస్థల వ్యాపారం పెరుగుతుందన్న అంచనాలే ఇందుకు కారణం.

బంగ్లాదేశ్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నది. అక్కడి పరిణామాలన్నింటినీ నిశితంగా గమనిస్తున్నాం. టెక్స్‌టైల్ రంగంలో బంగ్లాదేశ్ వృద్ధిరేటు ఆదర్శనీయం. మొత్తం ఉపఖండం వాణిజ్యానికే అది బలం. కానీ ఇప్పుడు అక్కడ సంక్షోభం నెలకొన్నది. రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. భారత్‌లో ఉత్పత్తి, సరఫరాపై ఆ ప్రభావం పడుతున్నది. పరిస్థితులు త్వరలోనే చక్కబడుతాయని ఆశిస్తున్నాం.

-చంద్రిమా చటర్జీ,
సీఐటీఐ ప్రధాన కార్యదర్శి

స్థిరాస్తి యజమానులకు ఊరట

ఎల్‌టీసీజీ పన్నుపై కొత్త, పాత విధానాల్లో ఆప్షన్ • బడ్జెట్ ముందు ఇల్లు కొంటేనే..



న్యూఢిల్లీ, ఆగస్టు 6: పన్ను చెల్లింపుదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. ఈ ఏడాది జూలై 23 కంటే ముందు ఇండ్లను కొనుగోలు చేసినవారు.. వాటిని అమ్ముకున్నప్పుడు చెల్లించే దీర్ఘకాల మూలధన లాభాల (లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ లేదా ఎల్‌టీసీజీ) పన్నుకు సంబంధించి ఉన్న కొత్త, పాత విధానాల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకునే అవకాశాన్ని కల్పించింది. ఈ మేరకు మంగళవారం లోక్‌సభలో సభ్యులకు అందించిన ఆర్థిక బిల్లు-2024లో సవరణలు చేసింది. దీంతో వ్యక్తులు లేదా హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) ఇండెక్సేషన్ బెనిఫిట్‌తో 20 శాతం పన్ను లేదా అది లేకుండా 12.5 శాతం పన్ను ఏది లాభమైతే అది ఎంచుకునే వీలుంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను గత నెల 23న లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రాపర్టీస్‌పై ఎల్‌టీసీజీ పన్నును 20 నుంచి 12.5 శాతానికి తగ్గించి దానికున్న ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను తొలగిస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. 2001 ఏప్రిల్ 1 తర్వాత కొన్న ఇండ్లకు ఇండెక్సేషన్ ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. దీంతో అటు స్థిరాస్తి క్రయవిక్రయదారుల నుంచి ఇటు నిర్మాణ రంగ వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. దీనిపై పునరాలోచనలోపడ్డ మోదీ సర్కారు వెనక్కి తగ్గుతూ తాజా సవరణల్ని తీసుకొచ్చింది. బడ్జెట్‌లో కేంద్రం తీసుకున్న నిర్ణయంతో పన్ను చెల్లింపుదారులపై అదనపు భారం పడుతుందని, ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను ఉంచాల్సిందేనని ట్యాక్స్ ఎక్స్‌పర్ట్స్ కూడా చెప్తున్నారు. అయితే జూలై 23 కంటే ముందు ఇండ్లు కొన్నవారికే ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను అందించడం సరికాదని, మొత్తం బడ్జెట్ నిర్ణయాన్నే ఉపసంహరించుకోవాలన్న డిమాండ్లూ వ్యక్తమవుతున్నాయి.

10 లక్షల కోట్ల రైటాఫ్

న్యూఢిల్లీ, ఆగస్టు 6: గడిచిన ఐదేండ్లలో రూ.9.90 లక్షల కోట్ల విలువైన రుణాలపై బ్యాంకులు రైటాఫ్ చేసినట్లు పార్లమెంట్‌కు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2023-24లో రూ.1.70 లక్షల కోట్లను రైటాఫ్ చేసిన బ్యాంక్..అంతక్రితం ఏడాదిలో రూ.2.08 లక్షల కోట్లను రైటాఫ్ చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ రాజ్యసభకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. ఈ రైటాఫ్ వల్ల రుణాలు తీసుకున్నవారికి ఎలాంటి ప్రయోజనం లభించదని, తాకట్టు కింద పెట్టిన ఆస్తులను విక్రయించగా వచ్చిన నిధులను రైటాఫ్‌ల కింద జమ చేయనున్నట్లు మంత్రి చెప్పారు. ఇప్పటికే ఈ రైటాఫ్‌ల్లో రూ.1.84 లక్షల కోట్లను బకాయి చేసినట్లు తెలిపారు. అలాగే ఐదేండ్ల క్రితం రూ.8,96,082 కోట్లుగా వున్న షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల నిరర్థక ఆస్తులు రూ.4,80,687 కోట్లకు తగ్గాయని పేర్కొన్నారు.

ఎఫ్‌టీసీసీఐ వైస్ ప్రెసిడెంట్‌గా కృష్ణకుమార్

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ) : ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామ ర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) వైస్ ప్రెసిడెంట్‌గా కృష్ణ కుమార్ మహేశ్వరీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవిలో ఆయన ఏడాది పాటు కొనసాగనున్నారు.

ఎస్బీఐ చైర్మన్‌గా సీఎస్ శెట్టి



న్యూఢిల్లీ, ఆగస్టు 6: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి నియామకానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆయన ఈ పదవిలో మూడేండ్లపాటు కొనసాగనున్నారు. ప్రస్తుతం బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శెట్టి.. దినేశ్ ఖారా స్థానాన్ని భర్తీ చేయనున్నారు. ఈ నెల 28న బ్యాంక్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

తగ్గిన బంగారం ధర

రూ.1,100 దిగిన తులం రేటు

కిలో వెండి ధర కూడా రూ.2,200 చౌక



న్యూఢిల్లీ, ఆగస్టు 6: బంగారం ధరలు భారీగా తగ్గాయి. మంగళవారం ఢిల్లీలో 24 క్యారెట్ 10 గ్రాముల రేటు రూ.1,100 దిగి రూ.71,700 వద్ద నిలిచింది. నగల వర్తకులు, రిటైల్ కొనుగోలుదారుల నుంచి డిమాండ్ అంతంతమాత్రంగా ఉండటం వల్లే రేట్లు తగ్గినట్టు మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక ఆభరణాల పుత్తడి రేట్లూ దిగువ ముఖం పట్టాయి. 22 క్యారెట్ తులం విలువ రూ.71,350గా నమోదైంది. క్రితంతో చూస్తే రూ.1,100 దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.72,450గా ఉన్నది. ఇదిలావుంటే హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాములు రూ. 71,500గా ఉన్నాయి.

దిగొస్తున్న వెండి ధరలు

బంగారం ధరలకుతోడు వెండి రేట్లూ తగ్గుతున్నాయి. మంగళవారం కిలో ధర రూ.2,200 దిగింది. రూ.82,000గా ఉన్నది. అయితే గత నాలుగు రోజుల్లో రేట్లు రూ.4,200 తగ్గినట్టు అఖిల భారత సరఫ సంఘం చెప్తున్నది. రిటైల్ కస్టమర్లతోపాటు ఇండస్ట్రీ వర్గాల నుంచి వెండికి ఆదరణ తగ్గిందని ట్రేడర్లు అంటున్నారు. అందుకే ధరలు క్రమేణా దిగివస్తున్నాయని పేర్కొంటున్నారు. గ్లోబల్ మార్కెట్‌లోనూ రేట్లు పడిపోయాయి. ఈ ఒక్కరోజే ఔన్సు గోల్డ్ ధర ఏకంగా 20 డాలర్లు తగ్గడం గమనార్హం. దీంతో 2,409 డాలర్లుగా ఉన్నది. వెండి ధర 26.94 డాలర్లుగా ఉన్నది. ఫ్యూచర్ మార్కెట్‌లో నెలకొన్న ఒడిదొడుకులతోనే ధరలు తగ్గుతున్నాయని ట్రేడింగ్ వర్గాలు చెప్తున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు.. భారతీయ మార్కెట్‌పైనా ప్రభావం చూపుతున్నాయి.

డైలమాలో ఇన్వెస్టర్లు

స్టాక్ మార్కెట్లు గత మూడు రోజులుగా నష్టాలకే పరిమితమవుతున్నాయి. ప్రతికూల పరిణామాలు ఇందుకు కారణంగా నిలుస్తుండగా.. మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణలకు దిగుతున్నారు.

ఎల్ఐసీ నాలుగు ప్లాన్లు



న్యూఢిల్లీ, ఆగస్టు 6: దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ ఒకేసారి నాలుగు పాలసీలను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఎల్ఐసీ యువ టర్మ్, డిజీ టర్మ్‌తోపాటు యువ క్రెడిట్ లైఫ్, డిజీ క్రెడిట్ లైఫ్ పేర్లతో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సరికొత్త ప్లాన్లను కంపెనీ సీఈవో, ఎండీ సిద్దార్థ మోహంతీ ప్రారంభించారు. టర్మ్ ఇన్సూరెన్స్ కల్పించడంతోపాటు లోన్ రీపేమెంట్స్ కలిగిన ఈ పాలసీలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ లభించనున్నాయి.

యువ టర్మ్/డిజీ టర్మ్ ప్లాన్లు..

- నాన్-లింక్డ్, లైఫ్, వ్యక్తిగత, పూర్తిగా రిస్క్ ప్లాన్ ఇది..
- కనీస వయస్సు 18 ఏండ్లు కాగా, గరిష్ఠ వయస్సు 45 ఏండ్లు
- మెచ్యూరిటీ వయస్సు 33 ఏండ్లు కాగా, గరిష్ఠంగా 75 ఏండ్లు
- బేసిక్ సమ్ అష్యూర్డ్ రూ.50 లక్షలు, గరిష్ఠంగా రూ.5 కోట్లు
- మహిళలకు తక్కువ ప్రీమియం


3 రోజుల్లో 22 లక్షల కోట్లు మటాష్

స్టాక్ మార్కెట్ల నష్టంతో సంపదను కోల్పోయిన మదుపరులు

న్యూఢిల్లీ, ఆగస్టు 6: స్టాక్ మార్కెట్ల భారీ పతనంతో మదుపరులు నిండామునిగారు. గత మూడు రోజుల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు నాలుగు శాతం వరకు నష్టపోవడంతో మదుపరులు ఏకంగా రూ.22 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. గత మూడు సెషన్లలో సెన్సెక్స్ 3,274.48 పాయింట్లు లేదా 3.99 శాతం నష్టపోయింది. ఈ నెల 1న చారిత్రక గరిష్ఠ స్థాయి 82,129.49 పాయింట్లను తచ్చాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ ఆ తర్వాతి నుంచి తిరోగమనబాట పట్టింది. దీంతో మంగళవారం బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.22,02,996.27 కోట్లు కరిగిపోయి రూ.4,39,59,953.56 కోట్లు(5.24 ట్రిలియన్ డాలర్లు) పడిపోయింది.

ప్రారంభ లాభాలు ఆవిరి

స్టాక్ మార్కెట్ల ప్రారంభ లాభాలు ఆవిరైపోయాయి. ఒక దశలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు నష్టల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో 1,100 పాయింట్ల వరకు పెరిగిన సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 166.33 పాయింట్లు నష్టపోయి 78,593.07 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 63 పాయింట్లు కోల్పోయి 24 వేల దిగువకు 23,992.55 వద్దకు జారుకున్నది.



- ఎస్బీఐ, మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, టైటాన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్‌లు అత్యధికంగా నష్టపోయాయి.
- కానీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టెక్ మహీంద్రా, లార్సెన్ అండ్ టుబ్రో, హెచ్‌యూఎల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, రిలయన్స్ షేర్లు తిరిగి లాభాల్లోకి వచ్చాయి.
- రంగాలవారీగా చూస్తే టెలికం, ఆర్థిక సేవలు, కన్స్యూమర్ డ్యూరబుల్, బ్యాంకింగ్ రంగ షేర్లు ఒక్క శాతం వరకు నష్టపోయాయి. కానీ, ఐటీ, రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ, సేవల రంగ షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి.
- అమెరికా ఆర్థిక వ్యవస్థ ఆర్థిక మాంద్యంలోకి జారుకోనుండటంతో ఐటీ, ఫార్మా రంగాలపై తీవ్ర స్థాయిలో ప్రభావం చూపనున్నది.
- సోమవారం 37 ఏండ్ల కనిష్ఠ స్థాయికి జారుకున్న జపాన్ నిక్కీ 225 షేరు మంగళవారం 10 శాతం లాభపడింది.

ఫ్యాన్స్ ఫిక్సయిపోయారు



బాలకృష్ణకు సంబంధించిన ఏ తాజా వార్త వెలుగుచూసినా.. అది సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అయిపోతూ ఉంటుంది. మాస్‌లో ఆయనకున్న క్రేజ్ అలాంటిది. ప్రస్తుతం ఆయన కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఊర్వశీరౌతేలా కథానాయిక. కొత్త విషయం ఏంటంటే.. ఇందులో ఆమెతో పాటు మరో ఇద్దరు హీరోయిన్లు ఉన్నారట. వారే ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్. ఇది నిజమైతే అభిమానులకు నిజంగా పండుగే. ఈ సినిమాలో బాలయ్య రెండు కోణాలున్న పాత్రలో కనిపిస్తారని యూనిట్ వర్గాల సమాచారం. బాబీడియోల్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మాస్ యాక్షన్ అంశాలకు కొదువుండదట. పైగా ఈ సినిమాలో పొలిటికల్ నేపథ్యం కూడా ఉంటుందని టాక్. 'రీసెంట్‌గా రషెస్ చూశాను.. ఫ్యాన్స్‌కి పండగే' అంటూ సంగీత దర్శకుడు తమన్ ఇచ్చిన లీక్ కూడా ఈ సినిమాపై అంచనాలు పెంచేసింది. దీంతో వరుసగా నాలుగో బ్లాక్‌బాస్టర్ పక్కా అని ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోయారు. ఇదిలావుంటే.. మలయాళంలో ఈ ఏడాది భారీ విజయాన్ని అందుకున్న ఫహద్ ఫాజిల్ 'ఆవేశం' సినిమాను, తెలుగులో బాలయ్యతో రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయట. మైత్రీ మూవీమేకర్స్ అధినేతలు ఈ చిత్రం రీమేక్ హక్కులు సొంతం చేసుకోవడంతోపాటు, బాలకృష్ణను ఒప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారట. మరి ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

కమిటీకుర్రోళ్లు కొత్తగా ఉంటారు



'కొత్తదనం ఉన్న మంచి సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉన్నారు. 'కమిటీ కుర్రోళ్లు' ఆ తరహా సినిమానే. ఇది గోదావరి చుట్టుపక్కల ప్రాంతాల్లో జరిగే కథ. నిహారిక మల్టీ టాలెంటెడ్. మంచి చిత్రాలను నిర్మిస్తూ తన అభిరుచిని చాటుకుంటోంది. ఈ సినిమా నేను చూశాను. చాలా బాగుంది. ఈ నెల 9న రాబోతున్నది. మీకూ నచ్చుతుంది. తప్పకుండా చూడండి' అంటూ చిరంజీవి వీడియో ద్వారా సందేశం ఇచ్చారు. నిహారిక కొణిదెల సమర్పణలో రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. యదువంశీ దర్శకుడు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. నాగబాబు, వరుణ్‌తేజ్, సాయిదుర్గతేజ్, అడివిశేష్, వెంకీ అట్లూరి ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'ఈ సినిమా విడుదలయ్యాక దర్శకుడు యదువంశీ పేరు ఎక్కువగా వినిపిస్తుంది. టెక్నికల్ టీమ్ మొత్తం మనసుపెట్టి పనిచేశారు. కొత్తవాళ్లైనా అందరూ అద్భుతంగా నటించారు. కచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని నిహారిక కొణిదెల ఆశాభావం వ్యక్తం చేసింది. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

తొలిప్రేమ జ్ఞాపకాల్లో..



దీపుజాను, వైశాలిరాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన మ్యూజికల్ ఆల్బమ్ 'ఫస్ట్‌లవ్'. బాలరాజు ఎం దర్శకత్వం వహించారు. వైశాలిరాజ్ నిర్మాత. ఈ ఆల్బమ్‌లోని ఓ గీతాన్ని సంగీత దర్శకుడు తమన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పాటలో అద్భుతమైన కథను చూపించారని, ఓ మంచి లవ్‌మూవీ చూసిన అనుభూతికలిగిందని, విజువల్స్ కూడా బ్యూటీఫుల్‌గా ఉన్నాయని చెప్పారు. సిద్‌శ్రీరామ్ గాత్రం ఈ పాటను మరో స్థాయికి తీసుకెళ్లిందని, మనసుకు హత్తుకునే గీతమిదని దర్శకుడు బాలరాజు తెలిపారు. టీమ్ అందరం ఎంతో ఇష్టంతో ఈ పాటను తీర్చిదిద్దామని హీరోయిన్, ప్రొడ్యూసర్ వైశాలిరాజ్ పేర్కొంది. ఈ ఆల్బమ్‌కు సంజీవ్ టి సంగీతాన్నందించారు.

డబుల్ బ్లాక్‌బస్టర్ పక్కా

చిత్రం



' పూరీ జగన్నాథ్ హీరోయిన్ అనిపించుకోవాలని ఎప్పట్నుంచో కోరిక. 'ఇస్మార్ట్ శంకర్'కి ఆడిషన్ కూడా ఇచ్చా.. కుదర్లేదు. డబుల్ ఫన్, డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ వుండే ఈ 'డబుల్ ఇస్మార్ట్'లో అవకాశం దొరికింది. చెప్పలేనంత ఆనందంగా ఉంది. పూరీ అద్భుతమైన విజన్ ఉన్న గ్రేట్ డైరెక్టర్. ఆయన సినిమాలో చేయడమే ఓ గొప్ప విషయం అయితే.. రామ్, సంజయ్‌దత్ లాంటి బిగ్ స్టార్స్ ఉన్న సినిమాలో భాగం కావడం నిజంగా జాక్‌పాటే' అని కథానాయిక కావ్యథాపర్ అన్నారు. రామ్ కథానాయకుడిగా పూరీ జగన్నాథ్ స్వీయ దర్శకత్వంలో ఛార్మీతో కలిసి నిర్మించిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. బ్లాక్‌బాస్టర్ 'ఇస్మార్ట్ శంకర్'కి స్వీక్వెల్‌గా రూపొందిన ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇందులో ఓ కథానాయికగా నటించిన కావ్యథాపర్ మంగళవారం విలేకరులతో ముచ్చటించింది. 'ఇందులో నాది బోల్డ్ అండ్ స్ట్రాంగ్ కేరక్టర్. అలాగే స్మార్ట్‌నెస్, ఇన్నోసెన్స్ కూడా ఉంటుంది. ఇందులో ఫైట్స్ కూడా చేశా. రామ్ హైలీ ఎనర్జిటిక్. మా కెమిస్ట్రీ యూత్‌ని బాగా ఆకట్టుకుంటుంది. నా కెరీర్‌లో బెస్ట్ డ్యాన్స్ ఇందులోనే ఇచ్చాను. అలాగే సంజయ్‌దత్‌సార్‌తో నటించడం మైండ్ బ్లోయింగ్ ఎక్స్‌పీరియన్స్. పేరుకు తగ్గట్టే 'డబుల్ ఇస్మార్ట్' డబుల్ బ్లాక్ బస్టర్ అవుతుంది' అని నమ్మకం వ్యక్తం చేసింది కావ్య థాపర్.

'డ్రాగన్'కు ముహూర్తం ఖరారు?



ప్రస్తుతం 'దేవర' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు అగ్రహీరో ఎన్టీఆర్. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రం సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా తర్వాత ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో ఇంటెన్స్ యాక్షన్ డ్రామాకు సిద్ధమవుతున్నారు ఎన్టీఆర్. అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన మే నెలలో వెలువడింది. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని వార్తలొచ్చాయి. ఆగస్ట్‌లో ఈ చిత్రాన్ని ప్రారంభిస్తామని మేకర్స్ ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం ఈ వారంలోనే ఈ సినిమాను లాంచ్ చేయబోతున్నట్లు తెలిసింది. ఈ విషయంలో త్వరలో ఓ ప్రకటన వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ 'దేవర' చిత్రంతో పాటు హిందీలో 'వార్-2'లో నటిస్తున్నారు. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌పై దేశవ్యాప్తంగా ఇప్పటికే భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.

చర్యకు ప్రతిచర్య తప్పదు



విశ్వక్‌సేన్ తన 13వ సినిమాను షురూ చేశారు. 'దసరా'తో భారీ విజయాన్ని అందించిన ఎస్ఎల్‌వీ సినిమాస్ అధినేత సుధాకర్ చెరుకూరి చిత్రానికి నిర్మాత. శ్రీధర్ గంటా దర్శకుడు. గ్రాండ్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో హైబడ్జెట్‌తో సినిమాను నిర్మించనున్నామని నిర్మాత తెలిపారు. పల్లెటూరి నేపథ్యంలో సాగే పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాలో విశ్వక్‌సేన్ పవర్‌ఫుల్ ఐపీఎస్ అధికారిగా నటించనున్నారు. దానికి సంబంధించిన ప్రీలుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'ఎవ్రీ యాక్షన్ ఫైర్స్ ఎ రియాక్షన్' అనే ట్యాగ్‌లైన్ ఈ పోస్టర్‌పై కనిపిస్తున్నది. 'వీఎస్ 13' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమాకు రచన, దర్శకత్వం శ్రీధర్ గంటా కాగా, కెమెరా: కిశోర్‌కుమార్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.



తెలుసుకదా.. మొదలైంది

బ్లాక్ బస్టర్ 'టిల్లు స్క్వేర్' తర్వాత సిద్దు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'తెలుసుకదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన డైరెక్టర్‌గా పరిచయం అవుతున్న ఈ చిత్రానికి టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మంగళవారం మొదలైంది. 30 రోజుల పాటు జరిగే ఈ భారీ షెడ్యూల్‌లో టాకీ సీన్స్‌తో పాటు రెండు పాటల్ని కూడా తెరకెక్కించనున్నారు. తొలి రోజు సిద్ధూతో పాటు రాశీఖన్నా షూటింగ్‌లో పాల్గొన్నది. వైవా హర్ష ముఖ్య భూమిక పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్, సంగీతం: తమన్, ఎడిటింగ్: నవీన్ నూలి, నిర్మాణం: పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ.

ప్రేమ వర్సెస్ పిచ్చి

విజయ్‌శంకర్, విషిక జంటగా రూపొందిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'పాగల్ వర్సెస్ కాదల్'. రాజేశ్ ముదునూరి దర్శకుడు. పడ్డాన మన్మథరావు నిర్మాత. ఈ నెల 9న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ప్రెస్‌మీట్ జరిగింది. ఇందులో తాను ప్రేయసితో ఇబ్బందులు పడే ఇన్నోసెంట్ అబ్బాయి కార్తీక్‌గా కనిపిస్తానని, ప్రతి ప్రేమికుడుకీ రిలేట్ అయ్యేలా ఈ కథ ఉంటుందని హీరో విజయ్‌శంకర్ తెలిపారు. ఇందులో తన పాత్ర పేరు ప్రియ అని, బాయ్‌ఫ్రెండ్‌ని ఎప్పుడూ అనుమానిస్తూ ఇబ్బందులు పెడుతుంటానని, అందరికీ నచ్చేలా సినిమా ఉంటుదని కథానాయిక విషిక చెప్పారు. బ్రహ్మాజీ, షకలకశంకర్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: నవధీర్, సంగీతం: ప్రవీణ్ సంగడాల, నిర్మాణం: శివత్రి ఫిలింస్.



భవిష్యత్ సినిమాకు బెంచ్‌మార్క్



ధృవ సర్జా నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'మార్టిన్' ట్రైలర్‌ను ముంబైలో గ్రాండ్‌గా విడుదల చేశారు. ఏ.పి.అర్జున్ దర్శకత్వంలో ఉదయ్ కె.మెహతా నిర్మించిన ఈ పాన్ ఇండియా చిత్రం ఈ ఏడాది అక్టోబర్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. భారతీయ సినిమా స్థాయిని పెంచేలా ఈ సినిమా రూపొందిందని, భవిష్యత్ సినిమాకు బెంచ్ మార్క్ సెట్ చేసేలా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. నటుడిగా ధృవ సర్జాను మరో స్థాయిలో ఈ సినిమా నిలబెడుతుందని మేకర్స్ చెబుతున్నారు. వైభవీ శాండిల్య, అన్వేషి జైన్, అచ్యుత్‌కుమార్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కథ: అర్జున్ సర్జా, కెమెరా: సత్య హెగ్డే, సంగీతం: రవి బస్రూర్, మణిశర్మ, నిర్మాణం: వాసవి ఎంటర్‌ప్రైజెస్, ఉదయ్ కె.మెహతా ప్రొడక్షన్స్.

పట్టు, తోలు వస్తువులు కొనను

నా కూతురు కోరికతో శాకాహారిగా మారాను: సీజేఐ

న్యూఢిల్లీ, ఆగస్టు 6: తన కూతురు కోరిక మేరకు తాను శాకాహారిగా మారినట్టు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. ఢిల్లీలో హైకోర్టులో డిజిటల్ న్యాయ నివేదికల ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'నాకు ప్రియాంక, మహి అని ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వారు దివ్యాంగులు. వారే నన్ను శాకాహారిగా మార్చారు. నేను, నా భార్య పట్టు, తోలు వస్తువులు కూడా కొనుగోలు చేయం' అని తెలిపారు. కాగా, 2015లో అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేస్తున్నప్పుడు ఉత్తరాఖండ్‌కు చెందిన ఇద్దరు దివ్యాంగ బాలికలను జస్టిస్ డీవై చంద్రచూడ్ దంపతులు దత్తత తీసుకున్నారు.

ఐఐటీ మద్రాస్‌కు రూ.228 కోట్ల విరాళం

పూర్వ విద్యార్థి కృష్ణ చివుకుల ఉదారత

చెన్నై, ఆగస్టు 6: ఐఐటీ మద్రాస్‌కు ఓ పూర్వ విద్యార్థి భూరి విరాళం అందజేశారు. 1970 ఎంటెక్ ఎయిరో స్పేస్ ఇంజినీరింగ్ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ కృష్ణ చివుకుల రూ.228 కోట్ల విరాళం ప్రకటించారు. దేశ చరిత్రలో ఒక విద్యా సంస్థకు ఇంత పెద్ద మొత్తంలో విరాళం లభించడం ఇదే మొదటిసారి. కృష్ణ అందించిన విరాళానికి గుర్తింపుగా ఐఐటీలోని ఒక అకడమిక్ బ్లాక్‌కు ఆయన పేరు పెట్టారు. మంగళవారం జరిగిన ఈ నామకరణోత్సవానికి కృష్ణ చివుకుల, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ కామకోటి, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

ఇక్కడ కూర్చోండి.. అప్పుడు తెలుస్తుంది!

- మేం ఎంత ఒత్తిడితో పనిచేస్తున్నామో
- దయచేసి మమ్మల్ని శాసించొద్దు
- న్యాయవాదులపై సీజేఐ ఆగ్రహం
- పిటిషన్లపై ముందస్తు విచారణ చేపట్టాలనడంపై తీవ్ర అసహనం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)



హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): సుప్రీంకోర్టులో పలువురు న్యాయవాదుల వైఖరిపై భారత ప్రధాన న్యాయమూర్తి సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. కేసులకు సంబంధించి న్యాయమూర్తులపై పడుతున్న ఒత్తిడిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఒకింత భావోద్వేగానికి గురైన సీజేఐ.. ఒక్కరోజు తమ స్థానంలో కూర్చుంటే ఆ ఒత్తిడేంటో తెలుస్తుందంటూ న్యాయవాదులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిటిషన్‌పై ముందుగా విచారణ చేపట్టాలన్న ఓ అభ్యర్థనపై ఈ మేరకు మంగళవారం సీజేఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

సీజేఐ ఏమన్నారంటే?

'తమ కేసు ముందుగా విచారణ చేపట్టాలని ప్రతీ ఒక్కరూ కోరుతున్నారు. అయితే, న్యాయమూర్తుల మీద ఉన్న పని ఒత్తిడిని ఎవరైనా పట్టించుకొంటున్నారా? మీరు (న్యాయవాదులు) ఒక రోజు జడ్జీల స్థానంలో కూర్చుంటే.. మేం ఎంత ఒత్తిడితో పనిచేస్తున్నామో అప్పుడు అర్థమవుతుంది. మీరు వచ్చి ఇక్కడ ఎందుకు కూర్చోకూడదు? దయచేసి వచ్చి కూర్చోండి. మీ పిటిషన్లను ఎప్పుడు విచారించాలి అనేది కూడా మీరే నిర్ణయించండి. మీరు ఒక్కసారి మా స్థానంలో కూర్చొని చూడండి.. జీవితంలో మళ్లీ ఎప్పుడూ ఇక్కడ కూర్చోవాలనుకోరు. ఇది నేను కచ్చితంగా చెప్తున్నాను. అయినా.. మీ ప్రవర్తన మీకైనా అతిగా అనిపించట్లేదా? మేము ప్రతిఒక్క పిటిషన్‌పై విచారణ జరుపుతాం. దానికి ఒక తేదీని కూడా నిర్ణయిస్తాం. కోర్టులు, న్యాయమూర్తులపై ఉన్న పని ఒత్తిడిని ఇప్పటికైనా అర్థం చేసుకోండి. అంతేగానీ, మమ్మల్ని దయచేసి శాసించొద్దు' అని సీజేఐ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

సీజేఐ ఆగ్రహానికి కారణమేంటంటే?

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలపై అనర్హత వేసేందుకు స్పీకర్ రాహుల్ నార్వేకర్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ శివసేన (యూబీటీ) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దాని విచారణ మంగళవారం బెంచీ ముందుకు వచ్చింది. అయితే, మిగతా పిటిషన్ల విచారణ ఆలస్యం అవుతుండటంతో.. దీనిపై జోక్యం చేసుకొన్న శివసేన (యూబీటీ) తరుపు న్యాయవాదులు.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో దీనిపై ముందస్తు విచారణ చేపట్టాలని ధర్మాసనానికి అభ్యర్థించారు. అయితే, దీనికి సంబంధించిన పత్రాలు అందించేందుకు సమయం కావాలని ప్రతివాదులు ధర్మాసనాన్ని కోరారు. దీంతో పిటిషన్‌ను కోర్టు గురువారానికి వాయిదా వేసింది. అయితే, ఈ వాయిదాపై పిటిషనర్ తరపు న్యాయవాద బృందం అభ్యంతరం వ్యక్తంచేసింది. అంతకంటే ముందుగానే పిటిషన్‌ను విచారించాలని కోర్టును కోరింది. దీంతో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ అసహనంతో పై వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రపతి ముర్ముకు ఫిజి అత్యున్నత పౌర పురస్కారం



సువా (ఫిజి), ఆగస్టు 6: పసిఫిక్ దేశాల్లో పర్యటిస్తున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మంగళవారం ఫిజి దేశపు అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్నారు. 'కంపానియన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ఫిజి' పురస్కారాన్ని ఆ దేశ ప్రభుత్వం రాష్ట్రపతికి ప్రదానం చేసింది. ఇక్కడ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఫిజి అధ్యక్షుడు రటు విలియమే మైవాలిలి కటోనివెరె చేతుల మీదుగా రాష్ట్రపతి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రెండు రోజుల ఫిజి పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ముర్ము, మంగళవారం ఫిజి పార్లమెంట్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల సంబంధాలను ప్రస్తుతించారు.

డెమొక్రటిక్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థిగా టిమ్ వాల్జ్

ఎంపిక చేసుకున్న కమలా హారిస్

వాషింగ్టన్: డెమొక్రటిక్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థిగా మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్‌ను(60) ఆ పార్టీ అధ్యక్ష అభ్యర్థిని కమలా హారిస్ మంగళవారం ఎంపిక చేసుకున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో కీలకమైన మధ్య పశ్చిమ ఎగువ ప్రాంతంలో ఉధృతంగా ప్రచారం చేయాలని హారిస్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతానికి చెందిన సైనిక వ్యవహారాల అనుభవజ్ఞుడు, తన సొంత రాష్ట్రంలో డెమొక్రటిక్ పార్టీ అజెండాను అమలు చేయడంలో కీలకంగా వ్యవహరించిన వాల్జ్‌ను తన 'రన్నింగ్ మేట్'గా హారిస్ వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు.

ముగిసిన ఎన్‌సీడబ్ల్యూ చీఫ్ రేఖాశర్మ పదవీకాలం

న్యూఢిల్లీ: జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) చైర్‌పర్సన్‌గా రేఖా శర్మ పదవీ కాలం మంగళవారంతో ముగిసింది. దీంతో ఆమె తన పదవి నుంచి తప్పుకున్నారు. 2018 ఆగస్టు 7న ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె, ఆ పదవిలో 7 ఏండ్లు కొనసాగారు. మూడు టర్మ్‌లు చైర్‌పర్సన్‌గా పనిచేయటం తనకెంతో గర్వకారణమని, సుదీర్ఘకాలం కమిషన్‌లో పనిచేసిన తాను ఇక్కడి బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు రేఖా శర్మ చెప్పారు. ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌గా రేఖా శర్మ హయాంలో, మణిపూర్‌లో మహిళలపై లైంగికదాడులు, హత్యలపై ఎన్‌సీడబ్ల్యూ పెద్దగా స్పందించలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి.



బ్రిటన్ ఫ్యామిలీ వీసా నిబంధన సడలింపు

- వార్షిక ఆదాయం 41 లక్షలు అక్కర్లేదు
- స్టార్మర్ ప్రభుత్వం నిర్ణయం.. భారతీయులకు లబ్ధి

లండన్: బ్రిటన్‌లో కొత్తగా ఏర్పడ్డ అధికార లేబర్ పార్టీ అక్కడి భారతీయులకు ఊరట కలిగించే నిర్ణయం తీసుకుంది. తమ బంధువులను కుటుంబ వీసాపై బ్రిటన్‌కు తీసుకొచ్చేందుకు ఉన్న నిబంధనలపై కొత్త ప్రభుత్వం వెనక్కి తగ్గింది. వార్షిక ఆదాయ పరిమితిని పెంచుతూ రిషి సునాక్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పక్కన పెట్టింది. దీంతో బ్రిటన్‌లో శాశ్వత నివాస హోదా కలిగిన ప్రవాస భారతీయులకు భారీ ఊరట లభించింది. వీరి కుటుంబ ఆదాయ పరిమితిని 29 వేల పౌండ్ల నుంచి 38 వేల పౌండ్ల(రూ.41.5లక్షలు)కు రిషి సునాక్ ప్రభుత్వం పెంచగా, ఈ నిబంధనను అధికార లేబర్ పార్టీ పక్కనపెట్టింది. ఈ నిర్ణయాన్ని తాత్కాలికంగా పక్కన పెడుతున్నామని బ్రిటన్ హోం మంత్రి యెవెట్ కూపర్ పేర్కొన్నారు. ఈ విధానాన్ని వలసవాద సలహా కమిటీతో సమీక్షించనున్నారు.

విద్యుత్తును ఉత్పత్తి చేసే బూట్లు

- రియల్-టైమ్ లొకేషన్‌ను కూడా చెప్తాయట
- సైనికుల కోసం డిజైన్ చేసిన ఇండోర్ ఐఐటీ



ఇండోర్, ఆగస్టు 6: సాయుధ బలగాల సిబ్బంది భద్రతను, సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ప్రత్యేకమైన బూట్లను తయారు చేసింది. విద్యుత్తును ఉత్పత్తి చేయగలిగే టెక్నాలజీతో కూడిన ఈ బూట్లను ధరించడం ద్వారా సైనికులు తామున్న రియల్ టైమ్ లొకేషన్‌ను తెలుసుకునేందుకు కూడా వీలవుతుందని అధికారులు మంగళవారం వెల్లడించారు. తొలి బ్యాచ్‌లో తయారు చేసిన 10 జతల బూట్లను ఇప్పటికే రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)కు పంపినట్టు ఇండోర్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుహాస్ జోషి తెలిపారు. ప్రొఫెసర్ ఐఏ పళని మార్గదర్శకత్వంలో ప్రయోగాత్మకంగా ఈ బూట్లను తయారు చేసినట్టు చెప్పారు. ట్రైబో-ఎలక్ట్రిక్ నానోజెనరేటర్ (టీఈఎన్‌జీ) టెక్నాలజీతో కూడిన ఈ బూట్లు ప్రతి అడుగుకూ విద్యుత్తును ఉత్పత్తి చేయగలవని, ఆ బూట్ల అడుగు భాగం (సోల్)లోని డివైజ్‌లో నిల్వ చేసుకోగలిగే ఆ విద్యుత్తుతో చిన్న చిన్న పరికరాలను ఆపరేట్ చేసుకోవచ్చని వివరించారు. గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్), రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) సాంకేతికతలను కలిగి ఉండే ఈ బూట్లను ధరించడం ద్వారా సైనికులు తమ రియల్ టైమ్ లొకేషన్‌ను కూడా తెలుసుకోవచ్చని, అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్న సీనియర్ సిటిజన్లు (వృద్ధులు), విద్యార్థులు, పర్వతారోహకులకు సైతం ఈ బూట్లు ఎంతో ఉపకరిస్తాయని ప్రొఫెసర్ సుహాస్ జోషి తెలిపారు.

ప్లాస్టిక్ బాటిల్ నీళ్లు తాగితే రక్తపోటు!



న్యూఢిల్లీ, ఆగస్టు 6: ప్లాస్టిక్ బాటిల్ నీళ్లను తాగితే రక్తపోటు వచ్చే ముప్పు పెరుగుతుందని ఆస్ట్రియాకు చెందిన 'డాన్యూబ్ ప్రైవేట్ యూనివర్సిటీ' పరిశోధకులు తేల్చారు. ప్లాస్టిక్ బాటిల్ నీళ్లు తాగటం ఆపేసి, రెండు వారాల పాటు పంపు నీటిని తాగిన వారిలో రక్తపోటు తగ్గుదల కనిపించిందని పరిశోధకులు వివరించారు. 'జర్నల్ మైక్రోప్లాస్టిక్స్' వార్తా కథనం ప్రకారం, మనం తాగే నీళ్లలో, ఆహార పదార్థాల్లో మైక్రోప్లాస్టిక్ కణాలు ఉన్నట్టు సైంటిస్టులు గుర్తించారు. దీనికి కారణం.. ప్లాస్టిక్ బాటిల్ నీళ్లు తాగటం, ప్లాస్టిక్ పాత్రల్లో నిల్వ చేసిన ఆహారాన్ని తినటం. అత్యంత సూక్ష్మమైన ప్లాస్టిక్ కణాలు (5 మిల్లీమీటర్ల పొడవు).. పేగులు, ఊపిరితిత్తులు, రక్తనాళాల్లోకి చేరుతున్నాయని, దీంతో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అధ్యయనం తెలిపింది.

అద్వానీకి అస్వస్థత



న్యూఢిల్లీ, ఆగస్టు 6: బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ(96) మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను ఢిల్లీలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. గత నెల మొదటి వారంలో కూడా ఆయన రెండు రోజుల పాటు దవాఖానలో వైద్యుల పరిశీలనలో ఉన్నారు. అంతకుముందు ఎయిమ్స్‌లోనూ ఆయన చికిత్స పొందారు.

సూరత్‌లో డైమండ్ సంక్షోభం!

- డిమాండ్ లేక 50 వేల మంది ఉద్యోగులకు వెకేషన్
- ప్రకటించిన డైమండ్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ



సూరత్: గుజరాత్‌లో డైమండ్ పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. మాంద్యం కారణంగా పాలిష్డ్ డైమండ్‌లకు డిమాండ్ లేకపోవడంతో సూరత్‌కు చెందిన ఓ డైమండ్ మాన్యుఫాక్చరింగ్ సంస్థ 50 వేల మంది ఉద్యోగులకు 10 రోజుల వెకేషన్ ప్రకటించింది. 'ఈ నెల 17 నుంచి 27 వరకు 50 వేల మంది మా ఉద్యోగులకు వెకేషన్ ప్రకటించాం. కొంత మొత్తం తగ్గించినా, ఈ వ్యవధికి ఉద్యోగులకు వేతనం అందజేస్తాం. మాంద్యం కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. మాంద్యంతో నేను అలసిపోయా' అని కిరణ్ జెమ్స్ కంపెనీ చైర్మన్ వల్లభ్ బాయ్ లఖాని తెలిపారు. ఇతర సంస్థలు కూడా ప్రభావితమైనప్పటికీ అవి సైలెంట్‌గా ఉన్నాయని, ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలియాలనే తాము ముందుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. తమ ఉత్పత్తిని క్రమబద్ధీకరించేందుకు వెకేషన్ నిర్ణయం దోహదపడుతుందన్నారు. ఈ మాంద్యం వెనుక ఉన్న కారణం ఎవరికీ తెలియదన్నారు. 95 శాతం పాలిష్డ్ డైమండ్లు ఎగుమతి అవుతున్న నేపథ్యంలో, వీటి అమ్మకాలపై అంతర్జాతీయ పరిణామాలు ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధాలు కూడా ప్రస్తుత పరిస్థితికి ఓ కారణంగా చెప్పారు. సూరత్‌లోని 4 వేల డైమండ్ పాలిషింగ్ కంపెనీలు దాదాపు 10 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయని తెలిపారు. ఉద్యోగులకు వెకేషన్ కారణంగా ఉత్పత్తి తగ్గి, డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు.

రైలులో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

భువనగిరి అర్బన్, ఆగస్టు 6: రైలులో ప్రయాణిస్తున్న గర్భిణికి పురిటి నొప్పులు రాగా, భువనగిరి స్టేషన్‌లోనే ఆపి రైలులోనే ప్రసవం చేశారు. వివరాల్లోకి వెళ్తే... హీనా కటోన్ తన అన్నతో కలిసి మంగళవారం ఉదయం సికింద్రాబాద్ నుంచి గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో పాట్నాకు బయల్దేరింది. భువనగిరి స్టేషన్‌కు వచ్చే సరికి పురిటి నొప్పులు మొదలయ్యాయి. రైల్వే టీసీ భువనగిరి స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించగా, ఆయన 108 అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. ఈఎంటీ విష్ణుమోహన్‌రెడ్డి, పైలెట్ మహేశ్ అక్కడికి చేరుకొని రైలులోనే ప్రసవం చేశారు. హీనా కాటున్ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను అంబులెన్స్‌లోనే భువనగిరి జిల్లా దవాఖానకు తరలించారు. ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

సారా తయారీదారులపై ఉక్కుపాదం

- రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా దాడులు
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి వెల్లడి



వీబీ కమలాసన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం నుంచి ఈ నెలాఖరు నాటికి సారా రక్కసిని పారదోలాలనే లక్ష్యంతో ఎక్సైజ్ శాఖ అడుగులు వేస్తున్నది. అందులో భాగంగా సారా తయారీ కేంద్రాలపై ఎక్కడికక్కడ దాడులు నిర్వహిస్తున్నది. బెల్లం అక్రమ రవాణాను నిరోధించేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నది. సారా తయారీదారులపై ఉక్కుపాదం మోపి విస్తృతంగా కేసులు నమోదు చేస్తున్నామని, మంగళవారం ఒక్కరోజే భారీస్థాయిలో సారా, బెల్లం, గంజాయి పట్టుబడిందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి ప్రకటించారు. ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు మొత్తంగా 16,951 లీటర్ల సారాను, 61,739 కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. మొత్తం 3,380 కేసులు నమోదు చేసి, 1,159 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. మొత్తం 906 మందిని బైండోవర్ చేశామని, 211 వాహనాలను సీజ్ చేశామని వివరించారు.

భారీగా సారా, బెల్లం స్వాధీనం

రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం భారీగా బెల్లం, సారా, గంజాయి పట్టుబడినట్టు కమలాసన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అత్తాపూర్ కేశవనగర్‌లోని ఓ గోదాంలో నిల్వ ఉంచిన 7,740 కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ.10 లక్షలపైనే ఉంటుందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇల్లెందు సమ్మక్కల గద్దెల ప్రాంతంలో నాటుసారా తయారీ కోసం కొత్తగూడెం నుంచి తీసుకొస్తున్న 320 కిలోల బెల్లం, 50 కేజీల పటికతోపాటు 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. కొత్తగూడెం శివారులోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 29 లీటర్ల నాటుసారా పట్టుకొన్నామని, ముగ్గురిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. భూపాలపల్లి, ములుగు, ఏటూరునాగరం, కాటారం ప్రాంతాల్లో 55 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, 11మందిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. మెదక్ జిల్లా సదాశివపేట మండలంలో రాజాస్థాన్‌కు చెందిన వ్యక్తి నుంచి 119 గ్రా పప్పి పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని వేర్వేరు తండాల్లో 5 లీటర్లు, మహబూబాబాద్ జిల్లాలో రెండు చోట్ల 16 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఆంధ్రా-ఒడిశా బోర్డర్ నుంచి హైదరాబాద్‌కు 57 కిలోల గంజాయిని తీసుకొస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

చేనేతలో యువ కళాకారుడి ప్రతిభ

- ఉన్నత చదువులు చదివినా కులవృత్తిపై మమకారం
- సహజసిద్ధ రంగులు, వంద డిజైన్లతో చీరె తయారీ
- నేడు జాతీయ పురస్కారం అందుకోనున్న ముఖేశ్



మగ్గం చీరె నేస్తున్న ముఖేశ్

చౌటుప్పల్, ఆగస్టు 6: ఉన్నత చదువులు చదివినా మూలలను మరువకుండా కులవృత్తిలో కొత్తదనం కోసం శ్రమించి జాతీయ స్థాయిలో మెరిశాడు ఈ యువ చేనేత కళాకారుడు. సహజ సిద్ధ రంగులు ఉపయోగించి, తక్కువ బరువు, ఎక్కువ డిజైన్లతో చీరె నేసి కేంద్ర పురస్కారానికి ఎంపికయ్యాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కర్నాటి ముఖేశ్ బీటెక్‌లో ఎలక్ట్రానిక్స్ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం వెంపర్లాడకుండా చేనేతనే ప్రధాన వృత్తిగా ఎంచుకొని పదిహేనేండ్లుగా అద్భుతాలు సృష్టిస్తున్నాడు. సహజ సిద్ధమైన రంగులతో 46 అంగుళాల వెడల్పు, ఏడు మీటర్ల పొడవుతో 600 గ్రాముల తేలికైన చీరెను నేశాడు. దాదాపు 100 రకాల డిజైన్లు వేశాడు. చేనేత దినోత్సవం సందర్భంగా కేంద్ర, చేనేత జౌళి శాఖ జాతీయ స్థాయిలో 14 మంది కళాకారులను పురస్కారానికి ఎంపిక చేయగా తెలంగాణ నుంచి ముఖేశ్ ఒకరు మాత్రమే ఎంపికయ్యాడు. బుధవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా ముఖేశ్ పురస్కారం అందుకోనున్నాడు.

హైటెక్‌సిటీ.. బీటెక్ సిటీ

- ఇంజినీరింగ్‌కు కేరాఫ్‌గా భాగ్యనగరం
- గ్రేటర్ పరిధిలోనే 109 కాలేజీలు
- మేడ్చల్-మల్కాజిగిరిలో అత్యధికంగా 45 కాలేజీలు
- 9 జిల్లాల్లో ఒక్క కాలేజీ లేని వైనం



హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ఇప్పుడు హైటెక్ సిటీ. ఈ హైటెక్ సిటీ ఇప్పుడు బీటెక్ సిటీగా మారిపోయింది. రాష్ట్రంలో బీటెక్ చదువులకు భాగ్యనగరమే కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రాష్ట్రంలో 175 ఇంజినీరింగ్ కాలేజీలుంటే 109 హైదరాబాద్ పరిధిలోనే ఉన్నాయి. మేడ్చల్ - మల్కాజిగిరిలో అత్యధికంగా 45 ఉండగా, ఆ తర్వాత రంగారెడ్డిలో 41, హైదరాబాద్‌లో 21 కాలేజీలున్నాయి. 9 జిల్లాల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా ఇంజినీరింగ్ కాలేజీ లేకపోవడం గమనార్హం. మరో 9 జిల్లాల్లో ఒకటి చొప్పున మాత్రమే ఉన్నాయి. అత్యధిక కాలేజీలు ఈ మూడు జిల్లాల్లోనే కేంద్రీకృతమై ఉండటంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ మూడు జిల్లాల్లోని కాలేజీల్లోనే చేరాల్సి వస్తోంది. దీంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పూర్తి వివరాలతో కూడిన నివేదికను ఇటీవలే అధికారులు సీఎం రేవంత్‌రెడ్డికి సమర్పించారు.

ఆకర్షిస్తున్న హైదరాబాద్..

గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వచ్చాయి. దీనికి తోడు తెలంగాణ ఐటీ రంగం గణనీయమైన పురోభివృద్ధి సాధించింది. ఇదే కోవలో విద్యావకాశాలు గణనీయంగా పెరిగాయి. ప్రపంచ అగ్రశ్రేణి కంపెనీలు హైదరాబాద్ చుట్టుపక్కలే ఉండటం, భవిష్యత్తులో ప్లేస్‌మెంట్స్, క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా కంపెనీలు ఇక్కడి విద్యార్థులనే ఎంపికచేసుకునే అవకాశముండటంతో విద్యార్థులు హైదరాబాద్‌లో చదివేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో హైదరాబాద్ ఎడ్యుకేషన్ హబ్‌గా రూపాంతరం చెందింది.

జిల్లాల వారీగా కాలేజీలు

జిల్లా	కాలేజీ
మేడ్చల్ -మల్కాజిగిరి	45
రంగారెడ్డి	41
హైదరాబాద్	21
హన్మకొండ	09
ఖమ్మం	09
కరీంనగర్	08
యాదాద్రి భువనగిరి	06

రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల వివరాలు..

- రాష్ట్రంలో 175 ఇంజినీరింగ్ కాలేజీలుండగా, 19 ప్రభుత్వ, 156 ప్రైవేట్ కాలేజీలున్నాయి.
- ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, ములుగు, నారాయణపేట జిల్లాల్లో ఒక్క ఇంజినీరింగ్ కాలేజీ కూడా లేదు.
- వనపర్తి, జనగాం, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో ఒకే ఒక్క కాలేజీ ఉంది.
- 2020- 21లో 180 ఉంటే, 2024 -25కు వచ్చే సరికి ఈ కాలేజీల సంఖ్య 174కు చేరింది. ఈ ఐదేండ్లల్లో ఐదు కాలేజీలు మూతపడ్డాయి.
- 2020-21లో ప్రభుత్వ కాలేజీలు 14 ఉండగా, 2024 -25కు వచ్చేసరికి 19కి పెరిగాయి. ప్రైవేట్ కాలేజీల సంఖ్య 166 ఉండగా, 155కు పడిపోయింది. అంటే ఐదు ప్రభుత్వ కాలేజీలు పెరగగా, 9 ప్రైవేట్ కాలేజీలు మూతపడ్డాయి.



సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద పట్టుబడ్డ బంగారం

అక్రమంగా తరలిస్తున్న బంగారం పట్టివేత

- 4 కిలోల 840 గ్రాముల పసిడి స్వాధీనం
- రూ.3.43 కోట్ల విలువ ఉంటుందని అంచనా
- వివరాలు వెల్లడించిన సంగారెడ్డి పోలీసులు

మునిపల్లి, ఆగస్టు 6: ముంబైయి నుంచి హైదరాబాద్‌కు వచ్చే ఆరెంజ్ ట్రావెల్స్ బస్సుల్లో అక్రమంగా తరలిస్తున్న 4 కిలోల 840 గ్రాముల బంగారాన్ని పట్టుకున్నట్టు సంగారెడ్డి జిల్లా డీటీఎఫ్ సీఐ శంకర్ తెలిపారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ శివారులో ముంబైయి జాతీయ రహదారిపై డెక్కన్ టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఆరెంజ్ ట్రావెల్స్‌లో బంగారాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడు చంద్రష్‌ను అదుపులోకి తీసుకున్నట్టు డీటీఎఫ్ సీఐ శంకర్ తెలిపారు. ఉన్నతాధికారుల అదేశాల మేరకు ముంబైయి జాతీయ రహదారిపై కంకోల్ డెక్కన్ టోల్‌ప్లాజా వద్ద క్రమం తప్పకుండా వాహనాలు తనిఖీలు చేస్తున్నామని, తనిఖీల్లో భాగంగా ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులో సోదాలు చేశామని, చంద్రష్ అనే వ్యక్తి బ్యాగుల్లో బంగారం కనిపించిందని వివరించారు. బంగారంతోపాటు చంద్రష్‌ను అదుపులోకి తీసుకొని సంగారెడ్డి పోలీసులకు అప్పగించినట్టు సీఐ చెప్పారు. పట్టుబడిన బంగారం విలువ రూ.3 కోట్ల 43 లక్షల 64 వేలు ఉంటుందని తెలిపారు.

పాటను తూటాగా మార్చిన ప్రజా యుద్ధ నౌక గద్దర్

సీఎం రేవంత్‌రెడ్డి నివాళి

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): 'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా.. పోరు తెలంగాణమా' అంటూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తి గద్దర్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. గద్దర్ వర్ధంతిని పురస్కరించుకొని సీఎం మంగళవారం ఆయన సేవలను స్మరించుకున్నారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్ ఉన్నత కొలువులవైపు దృష్టిసారించకుండా ప్రతి ఒక్కరికీ కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్య పరిచారని పేర్కొన్నారు. తెలంగాణ జన సమితి, తెలంగాణ జనసభతోపాటు పలు ఉద్యమ సంస్థల ఏర్పాటుతో తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరులూదిన వారిలో అగ్రగణ్యుడు గద్దర్ అని గుర్తుచేశారు. పాటను తూటాగా మార్చిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని, ఆయన చేసిన సాంస్కృతిక, సామాజిక సేవలకు గుర్తింపుగా నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా తమ ప్రభుత్వం మార్చిందని తెలిపారు.

స్పీకర్‌కు గడువు పెట్టం

మొదటిపేజీ తరువాయి...

ఏ చర్యలు తీసుకోకుండా స్పీకర్ కాలయాపన చేస్తున్నారని తప్పుపట్టారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో ఒకరు అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన తర్వాత కూడా స్పీకర్ తీరులో మార్పు లేదని తప్పుపట్టారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, నిరుగారుపడమేనని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం స్పీకర్‌కు కోర్టులు (హైకోర్టు/సుప్రీంకోర్టు) ఆదేశాలు జారీ చేయవచ్చునని వాదించారు. తన వాదనకు బలపరిచే పలు తీర్పులను ఆయన ఉదహరించారు. స్పీకర్ మూడు నెలల గడువులోగా పార్టీ ఫిరాయింపుల పిటిషన్లపై విచారణ పూర్తి చేయాలని మణిపూర్ ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం తీర్పు చెప్పిందని తెలిపారు. ఆ తీర్పును హైకోర్టు అమలు చేయాలని కోరారు.

నాలుగు వారాల్లో తేల్చమనండి

మూడు నెలల గడువు ఎప్పుడో ముగిసిందని, మరో నాలుగు వారాల గడువు ఇచ్చి తుది నిర్ణయం తీసుకునేలా స్పీకర్ కార్యాలయానికి ఉత్తర్వులు ఇవ్వాలని గండ్ర మోహన్‌రావు కోరారు. స్పీకర్, పార్టీ ఫిరాయింపుల పిటిషన్లపై చర్యలు తీసుకోకుండా ఉంటే ప్రజాస్వామ్యానికి అర్థమే లేకుండా పోతుందని అన్నారు. అనర్హత వేటు వేయాలనే పిటిషన్‌ను స్పీకర్ విచారణ చేయకుండా కాలయాపన చేసిన పరిస్థితుల్లో ఆ వ్యవహారంపై హైకోర్టు/సుప్రీంకోర్టు న్యాయ సమీక్ష చేయవచ్చునని చెప్పారు. మార్చిలో స్పీకర్‌కు ఫిర్యాదు చేశామని, ఇప్పటికి మూడు నెలల గరిష్ఠ గడువు ముగిసినందున మరో నాలుగు వారాలు స్పీకర్ సమయం తీసుకునేలా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అసెంబ్లీ రూల్స్ 6, 7 ప్రకారం స్పీకర్ వ్యవహరించడం లేదని మోహన్‌రావు వాదించారు. స్పీకర్ నిర్ణయం తీసుకున్నాకే కోర్టులు న్యాయ సమీక్ష చేయవచ్చని ఏజీ చెప్పారు. స్పీకర్ వద్ద పిటిషన్‌కు నంబర్ కేటాయించమని కూడా ఉత్తర్వులు జారీ చేసే పరిధి కోర్టులకు లేదని అన్నారు. ఈ కేసులో వాదనలు బుధవారం కూడా కొనసాగనున్నాయి.

వరంగల్ టు మేడారం గ్రీన్ కారిడార్

స్టేట్ లెవల్ కమిటీ ఆమోదం
మంత్రి కొండా సురేఖ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): హరితనిధి నిధులతో వరంగల్ నుంచి మేడారం వరకు మల్టీ లేయర్ అవెన్యూ, మీడియన్ ప్లాంటేషన్లను రూ.6.63 కోట్లతో, వరంగల్, హనుమకొండ డీఎఫ్‌వోల పరిధిలో అవెన్యూ, మీడియన్ ప్లాంటేషన్లను రూ.5.6 కోట్లతో చేపట్టేందుకు స్టేట్ లెవల్ కమిటీ ఆమోదం తెలిపింది. మంగళవారం అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అధ్యక్షతన సచివాలయంలోని అటవీ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో హరితనిధి పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

కవిత డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ ఉపసంహరణ

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ సీబీఐ కేసులో రౌస్ ఎవెన్యూ కోర్టులో దాఖలు చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను ఎమ్మెల్సీ కవిత ఉపసంహరించుకున్నారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరుగనుండగా.. కవిత తరఫు న్యాయవాదులు మంగళవారమే పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కోర్టును ఆశ్రయిస్తామని న్యాయవాదులు తెలిపారు.

ఒప్పందం 'స్వచ్ఛ'మేనా?

మొదటిపేజీ తరువాయి...

బయోమాస్, సెల్యులోజ్ నుంచి జీవ ఇంధనాలు, జీవ రసాయనాలను ఉత్పత్తి చేసే పేటెంట్ పొందటంతోపాటు అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేసింది.

లేని కంపెనీతో ఒప్పందమా?

'స్వచ్ఛ్ బయో' కంపెనీతో ఒప్పందంపై అనుమానాలు వ్యక్తంచేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. స్వచ్ఛ్ బయో అనే కంపెనీకి సంబంధించిన వెబ్‌సైట్ గానీ, సోషల్ మీడియా ఖాతాగానీ లేకపోవడంతో పులువురు అనుమానాలు వ్యక్తం చేశారు. స్వచ్ఛ్ బయో పేరుతో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌లో ఎటువంటి సంస్థ నమోదు కాలేదని, కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖలో కూడా దీని వివరాలు లభ్యం కాలేదని అంటున్నారు. కంపెనీస్ చెక్ వెబ్‌సైట్‌లో వెతికినా దాని జాడ కానరాలేదని వాపోతున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో 'స్వచ్ఛ్ బయో చైర్మన్ ప్రవీణ్ పరిపాటి' అని పేర్కొన్నారు.. అసలు ఆయన పేరుతో ఆ కంపెనీ లేకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ స్వచ్ఛ్ బయోకు దాదాపు దగ్గరగా 'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో ఓ కంపెనీ ఉన్నట్టు గుర్తించారు. ఈ కంపెనీని 2024 జూలై 21న హైదరాబాద్ కేంద్రంగా రిజిస్టర్ చేశారని అంటున్నారు. ఈ కంపెనీకి సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల జగదీశ్వర్‌రెడ్డి, వేదపల్లి శివానందరెడ్డి డైరెక్టర్లుగా ఉన్నట్టు తెలిపారు. దీని షేర్ క్యాపిటల్ రూ.10 లక్షలుగా వెల్లడించారు. కంపెనీ పేర్లు దగ్గరగా ఉండటం కాకతాళీయమా లేదా? ఏదైనా మతలబు ఉన్నదా అన్న అనుమానాలు వ్యక్తం చేశారు. మరోవైపు సీఎం సమక్షంలో ఒప్పందంపై సంతకాలు చేసిన ఆ సంస్థ చైర్మన్‌గా పేర్కొన్న 'ప్రవీణ్ పరిపాటి' అమెరికాకు చెందిన శాస్త్రవేత్త అని, ఆయన 'సుజెయింట్' అనే బయోటెక్నాలజీ కంపెనీకి చెందినవారని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛ్ బయో కంపెనీ, స్వచ్ఛ్ బయోగ్రీన్ కంపెనీ ఒక్కటేనా? దానికి చైర్మన్ ప్రవీణ్ పరిపాటియేనా? అని అనుమానిస్తున్నారు. కేవలం 15 రోజుల కిందట ప్రారంభమైన కంపెనీ రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి ఎలా పెట్టగలదని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం వివరణ ఇవ్వాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.



అమెరికాలో సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణలో అపార అవకాశాలు

న్యూయార్క్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వర్కింగ్ లంచ్ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఫార్మా, ఐటీ, టెక్నాలజీ, ఈవీ, బయోటెక్, షిప్పింగ్ రంగాల్లో పేరొందిన కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలున్నాయని చెప్పారు. పరిశ్రమల అవసరాలు, అభిరుచికి అనుగుణంగా తమ ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తుందని ప్రకటించారు. అమెరికాలో ఉన్న వ్యాపార అవకాశాలన్నీ తెలంగాణలో ఉన్నాయని, చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదగాలనేది తమ సంకల్పమని అన్నారు. తెలంగాణలో అద్భుతమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని చెప్పారు.

మీ జీవితం స్ఫూర్తిదాయకం

న్యూయార్క్‌లోని భారత అంధుల క్రికెట్ జట్టు (బాలుర)ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. అమెరికా పర్యటనలో ఉన్న జట్టు సభ్యులతో ఆయన కాసేపు ముచ్చటించారు. ఈ జట్టును కలుసుకునే అవకాశం రావటం ఎంతో అమూల్యంగా భావిస్తున్నానని.. ఈ టీమ్ ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఎన్ని అడ్డంకులున్నా ఎదిరించి నిలబడాలనే మానసిక స్థైర్యాన్ని వాళ్ల నుంచి నేర్చుకోవాలని సూచించారు. హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాద్‌లో ట్రైజిన్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్

- **మూడేండ్లలో వెయ్యి మందికిపైగా ఉద్యోగాలు**
- **అమెరికాలో సీఎం బృందంతో కంపెనీల భేటీ**

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సెంటర్ నెలకొల్పేందుకు ట్రైజిన్ టెక్నాలజీస్ కంపెనీ ముందుకొచ్చింది. ఈ మేరకు ఆ కంపెనీ ప్రతినిధులు అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు బృందంతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే సెంటర్‌పై చర్చలు జరిపారు. మరో ఆరు నెలల్లో తమ కార్యకలాపాలు ప్రారంభించనున్నట్టు ఆ కంపెనీ ప్రకటించింది. రాబోయే మూడేండ్లలో వెయ్యికిపైగా ఉద్యోగాలను కల్పించనున్నట్టు తెలిపింది. డాటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌లకు అవసరమయ్యే ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్ ఈ సంస్థ అందిస్తున్నది. సుమారు రూ.1350 కోట్ల ఆదాయం కలిగిన ఈ కంపెనీలో 2500 మంది ఉద్యోగులుండగా వారిలో వెయ్యి మంది భారత్‌లో, సుమారు వంద మంది హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు.

ఆర్సీసీఎం విస్తరణ...

టెక్నాలజీ, సర్వీస్ సొల్యూషన్స్‌లో పేరొందిన ఆర్సీసీఎం కంపెనీ తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు అంగీకరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి బృందంతో ఆ కంపెనీ సీఈవో గౌరవ్ సూరి భేటీ అయ్యారు. ఆర్సీసీయం మొదటిసారిగా హైదరాబాద్‌లో తమ ఆఫీసును విస్తరించనుంది. ఆ సంస్థ అమెరికా వెలుపల కంపెనీ పెట్టడం ఇదే మొదటిసారి. ప్రపంచవ్యాప్తంగా తమ సేవల విస్తరణకు హైదరాబాద్ సెంటర్ కీలకంగా నిలుస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. వచ్చే రెండేండ్లలో హైదరాబాద్‌లో 500 మంది సాంకేతిక నిపుణులను కంపెనీ నియమించుకోనుంది.

బోగస్ కంపెనీలతో రేవంత్ ఒప్పందాలు

- **4 నెలల క్రితం ఏర్పాటైన సంస్థతో ఎంవోయూ**
- **స్ట్రైక్‌ఆఫ్ అయిన కంపెనీ పెట్టుబడి పెట్టగలదా?**
- **ప్రజల సొమ్ముతో బృందాలుగా విదేశీ టూర్లు**
- **బీఆర్‌ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ ఆగ్రహం**



హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బోగస్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. తెలంగాణలో రూ.839 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు వాల్స్ కర్రా హోల్డింగ్స్ కంపెనీ ముందుకొస్తే ఒప్పందం కుదుర్చుకున్నామని సీఎం కార్యాలయం ప్రకటించడంపై మండిపడ్డారు. ఆ సంస్థ నాలుగు నెలల క్రితమే ఏర్పాటైందని, ఇద్దరే డైరెక్టర్లు ఉన్నారని, ఎలాంటి వార్షిక నివేదికలు లేవని వెల్లడించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీశాఖ మాజీ మంత్రి కేటీఆర్ కంటే తాను మెరుగ్గా పనిచేశానని చెప్పడం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి బోగస్ కంపెనీలతో ఒప్పందం చేసుకుంటున్నారని మండిపడ్డారు. సీఎం ఎవరితో, ఏ కంపెనీతో ఒప్పందం చేసుకున్నా వారి ట్రాక్ రికార్డ్ మంచిదై ఉండాలని హితవు పలికారు. తెలంగాణభవన్‌లో మంగళవారం క్రిశాంక్ మీడియాతో మాట్లాడుతూ.. స్ట్రైక్ ఆఫ్ అయిన వాల్స్ కర్రా హోల్డింగ్ కంపెనీ తెలంగాణలో ఎట్లా పెట్టుబడులు పెడుతుంది? అని నిలదీశారు. రాని కంపెనీల కోసం రేవంత్‌రెడ్డి అమెరికాకు వెళ్లారా? అని ప్రశ్నించారు. దావోస్ వెళ్లి గోదీ ఇండియా అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారని, రూ.27 లక్షల వార్షిక ఆదాయం ఉన్న ఈ సంస్థ ఎలా పెట్టుబడిపెడుతుందని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టు అప్పగించే సంస్థపై లుక్ అవుట్ నోటీసు ఉన్నదని చెప్పారు. సీఎం బృందం అమెరికా పర్యటనలో, సీఎం తమ్ముడి బృందం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారని తెలిపారు. ప్రజల ధనంతో విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు తెలంగాణకు పెట్టుబడుల కోసం ఒరిజినల్, మంచి ట్రాక్‌రికార్డ్ ఉన్న కంపెనీలను తీసుకురావాలని హితవుపలికారు. ముఖ్యమంత్రి పర్యటనలను ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికైనా నాటకాలు బంద్ చేసి సరైన కంపెనీల నుంచి పెట్టుబడులు తీసుకురావాలని సూచించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత హైదరాబాద్ ఖ్యాతి గడించిందని క్రిశాంక్ గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ హయాంలో ఐటీ ఎగుమతులు పెరిగాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సైతం వృద్ధి చెందాయని చెప్పారు. హైదరాబాద్ ఐటీకి గమ్యస్థానంగా మారినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. ఇప్పటివరకు తెలంగాణ ఆడబిడ్డలకు ఇస్తామన్న రూ.2,500 ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు.

మహదేవపూర్‌లో కేటీఆర్‌పై కేసు

- **బీఆర్‌ఎస్ ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలపై కూడా..**
- **మేడిగడ్డ బరాజ్‌పై డ్రోన్ ఎగరేశారంటూ ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు**

మహదేవపూర్, ఆగస్టు 6 : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గండ్ర వెంకటరమణరెడ్డిపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జూలై 26న కేటీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, సోషల్ మీడియా కార్యకర్తలు కాళేశ్వరం ప్రాజెక్టులను సందర్శించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్‌పై అనుమతి లేకుండా డ్రోన్ కెమెరా ఎగరేసి చిత్రీకరించారని ఇరిగేషన్ శాఖ అధికారులు అభియోగంమోపారు. వారి ఫిర్యాదు మేరకు మహదేవపూర్ పోలీసులు జూలై 29న కేటీఆర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గండ్ర వెంకటరమణరెడ్డిపై సెక్షన్ 223(బీ) కింద కేసు నమోదు చేశారు. వీరితోపాటు నాయకులు, కార్యకర్తలనూ జోడించారు.

14 జిల్లాలకు ఇన్‌చార్జి డీఐఈవోలు

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో 14 జిల్లాలకు ఇన్‌చార్జి డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్(డీఐఈవో)ను నియమిస్తూ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పలువురు ప్రిన్సిపాళ్లు బదిలీ కాగా, ఇన్‌చార్జి డీఐఈవోలుగా వ్యవహరిస్తున్న వారికి స్థానచలనం కలిగింది. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి డీఐఈవోలను నియమించారు. కొత్తగా నియమితులైన డీఐఈవోలు ఆయా జిల్లాల్లో వెంటనే బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

ఖైదీల వివరాలివ్వండి: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 6, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని జైళ్లలో ఉన్న ఖైదీలు, విచారణ ఖైదీల వివరాలను నివేదించాలని జైళ్ల శాఖను హైకోర్టు పీపీ కార్యాలయం కోరింది. ఖైదీల ఆరోగ్య స్థితిగతులు, బెయిల్ పిటిషన్ల పరిస్థితి, వివరాలన్నింటినీ ఇవ్వాలంటూ లేఖ రాసింది. ఇటీవల ఓ కేసులో నిర్దోషిగా తీర్పు వచ్చిన నిందితుడు పోచయ్య అప్పటికే జైలులో మరణించాడు. ఈ విషయం కోర్టు దృష్టికి రాలేదు. ఫలితంగా కోర్టులపై జనానికి తేలిక భావన ఏర్పడే అవకాశం ఉంటుందని ఖైదీల వివరాలను పీపీ కార్యాలయం కోరింది.

• కేంద్రం కులగణన చేపట్టాలి



కేంద్ర ప్రభుత్వం జన గణనలో భాగంగా కులగణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీలు మల్లు రవి, బీద మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు. –హైదరాబాద్

బాలికపై కౌన్సిలర్ అఘాయిత్యం!

- **మాట కలిపి.. కారులో తీసుకెళ్లి దారుణం**
- **నిందితుడికి స్థానికుల దేహశుద్ధి**
- **కౌన్సిలర్‌పై కేసు.. రిమాండ్**



కౌన్సిలర్ రాధాకృష్ణ

శక్కర్‌నగర్, ఆగస్టు 6: బాలికతో మాట కలిపిన ఓ కౌన్సిలర్ నమ్మించి వంచించాడు. ఇంటికి తీసుకెళ్తానని చెప్పి కారులో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత దర్జాగా వైన్స్ వద్ద మద్యం సేవిస్తుండగా, ఏడుస్తున్న బాలికను గమనించిన స్థానికులు నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బోధన్‌లోని మూడో వార్డు (శక్కర్‌నగర్) కౌన్సిలర్ కొత్తపల్లి రాధాకృష్ణ నిజామాబాద్ వెళ్లాడు. అక్కడ ఆటోలో వెళ్తున్న తన ప్రాంతానికి చెందిన, పరిచయమున్న పదహారేండ్ల బాలిక కనిపించింది. ఆటో వద్దకు వెళ్లి ఆమెతో మాట కలిపాడు. తాను బోధన్‌కే వెళ్తున్నానని చెప్పి తన కారులో ఎక్కించుకున్నాడు. మార్గమధ్యంలో ఎడపల్లి వద్ద దారి మళ్లించి మంగళ్‌పాడ్ రోడ్డులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం ఎడపల్లికి వచ్చి వైన్స్‌లో మద్యం తీసుకుని తాగుతుండగా, కారులో ఉన్న బాలిక కేకలు వేసింది. గమనించిన స్థానికులు అనుమానం వచ్చి కౌన్సిలర్‌ను పట్టుకుని ప్రశ్నించగా, పొంతన లేని సమాధానం చెప్పాడు. బాలికను ప్రశ్నించగా జరిగింది చెప్పడంతో అతడిని చితకబాది ఎడపల్లి పోలీసులకు అప్పగించారు. సదరు కౌన్సిలర్‌ను బోధన్ సీఐ కార్యాలయానికి తరలించగా, బాధితురాలి తరఫు వారు పెద్దసంఖ్యలో వచ్చి ఆందోళనకు దిగారు. నిందితుడిని తప్పించే ప్రయత్నంచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కౌన్సిలర్‌పై కిడ్నాప్‌తో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని, చట్టపరంగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అఘాయిత్యానికి పాల్పడిన ప్రాంతాన్ని ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ నరేశ్, ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ మంగళవారం పరిశీలించారు. బాధితురాలిని వైద్య పరీక్షలకు పంపి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కాగా కౌన్సిలర్ రాధాకృష్ణ సోదరుడు రవీందర్ సైతం గతంలో ఇలాగే ఓ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఏడాదిన్నర క్రితం మూడో వార్డుకు చెందిన ఓ మైనర్‌పై దారుణానికి ఒడిగట్టిన కేసులో రవీందర్‌తోపాటు రాధాకృష్ణ కూడా జైలుకు వెళ్లొచ్చారు.

కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో పెరిగిన వలస పులులు

- **జిల్లా కేంద్రానికి 5 కి.మీ దూరంలో సంచరిస్తున్న పెద్దపులి**
- **పంట పొలాల్లో పులి సంచారంతో భయాందోళనలో రైతులు**

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): అడవుల జిల్లా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దు మహారాష్ట్రలో పులుల సంఖ్య గణనీయంగా పెరగడం, ఆవాసం కోసం జిల్లాలోని అడవుల్లోకి వస్తుండటంతో కాగజ్‌నగర్ కారిడార్‌లో పులుల సంచారం పెరిగింది. జిల్లా కేంద్రానికి 5 కిమీ దూరంలోని గోవింద్‌పూర్, గుండి, కేస్లాపూర్‌లోని పంట చేన్లలో పెద్దపులి సంచరించడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. సమీప పొలాల్లో పులి పాదముద్రలు కనిపించడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎఫ్‌ఆర్వో గోవింద్‌చంద్, డీఆర్వో యోగేశ్, ఎఫ్‌ఎస్‌వో విజయ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి పెద్దపులి పాదముద్రలుగా నిర్ధారించారు. గోవింద్‌పూర్ మీదుగా జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయం వెనుక నుంచి పెద్దవాగు దాటి కాగజ్‌నగర్ మండలం అంకుషాపూర్ వైపు వెళ్లి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

ప్రతినెలా క్రైమ్ రివ్యూలు నిర్వహించాలి

- **రౌడీలు, అసాంఘిక శక్తులపై దృష్టిపెట్టాలి**
- **డయల్ 100 రెస్పాన్స్ టైమ్‌ను మెరుగుపర్చాలి**
- **అర్ధవార్షిక నేర సమీక్షలో డీజీపీ జితేందర్ స్పష్టీకరణ**
- **గత 6 నెలల్లో పోలీసుల పనితీరుపై తీవ్ర ఆగ్రహం**



సమీక్షలో వివరాలు వెల్లడిస్తున్న డీజీపీ

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నేరాలను కట్టడి చేసేందుకు ఇక నుంచి ప్రతినెలా ప్రత్యక్షంగా, వర్చువల్‌గా క్రైమ్ రివ్యూలు నిర్వహించాలని డీజీపీ జితేందర్ పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. నేరాల తీరును విశ్లేషించడం, కొత్త చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన భద్రతను కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం డీజీపీ ఆఫీసులో అర్ధవార్షిక సమీక్ష నిర్వహించారు. గత 6 నెలల్లో జరిగిన దారుణాలను డీజీపీ ఈ సమావేశంలో ప్రస్తావిస్తూ.. పలు జిల్లాల ఎస్పీలు, కమిషనర్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్న రౌడీలు, ఇతర అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవడంలో పోలీసులు విఫలమతున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. ఈ ధోరణిని వెంటనే మార్చుకోవాలని హితవు పలికారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలతోపాటు సైబర్, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నేరాలను సమర్థంగా నిరోధించకపోతే ఎవరినీ ఉపేక్షించేది లేదని, ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డుప్రమాదాల నివారణపై దృష్టిపెట్టాలని, అన్ని వర్గాల ప్రజలతో రోడ్డు భద్రతా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

టైమ్‌కు ఎందుకు చేరుకోలేకపోతున్నారు?

రాష్ట్రంలో డయల్ 100 ప్రతిస్పందన సమయం దారుణంగా పడిపోయిందని డీజీపీ జితేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. సకాలంలో బాధితుల వద్దకు ఎందుకు చేరుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. డయల్ 100 రెస్పాన్స్ టైమ్‌ను మెరుగుపర్చేందుకు పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 6 నెలల నుంచి కొందరు పోలీసుల పనితీరు సరిగా లేకపోవడం వల్ల మొత్తం వ్యవస్థకే చెడ్డపేరు వచ్చిందని మండిపడ్డారు. ఇకనుంచైనా శాంతిభద్రతల నిర్వహణలో అందరూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్ర సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలని డీజీపీ జితేందర్ ఆదేశించారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో నక్సల్స్‌పై విస్తృతంగా దాడులు జరుగుతున్నందున వారు తెలంగాణలోకి రాకుండా అడ్డుకునేందుకు ఇంటెలిజెన్స్ అధికారులు, కూంబింగ్ పార్టీలు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

విభాగాల వారీగా నివేదికలు

సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ల దొంగతనాలు, మానవ అక్రమ రవాణా, వాహనాల చోరీ, తదితర అంశాలపై సీఐడీ ఏడీజీ శిఖాగోయెల్.. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించేందుకు చేపడుతున్న చర్యలపై టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య డీజీపీకి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇతర అంశాలపై ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ బీ శివధర్‌రెడ్డి, అడిషనల్ డీజీలు అభిలాష బిస్త్ (ట్రైనింగ్), వీవీ శ్రీనివాసరావు (టెక్నికల్ సర్వీసెస్), విజయ్ కుమార్ (పర్సనల్, వెల్ఫేర్), సంజయ్ కుమార్ జైన్ (బెటాలియన్స్) నివేదికలు సమర్పించారు. 27 హత్యలు, 6 అత్యాచారాలకు సంబంధించిన కేసుల్లో దోషులకు జీవిత ఖైదు పడేలా చర్యలు చేపట్టిన 36 మంది అధికారులు, 30 మంది ప్రాసిక్యూటర్లకు ఈ సమావేశంలో డీజీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు.

'స్థానిక' బీసీ రిజర్వేషన్లకు చేపట్టిన చర్యలేమిటి?

ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు అధ్యయనం నిర్వహించే అంశంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుప్రీం కోర్టు తీర్పులకు అనుగుణంగా బీసీల స్థితిగతులపై అధ్యయనం జరిపేందుకు కమిషన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలేమిటో చెప్పాలని కోరింది. స్థానిక సంస్థ ల్లో రిజర్వేషన్లకు సంబంధించి జీహెచ్‌ఎంసీ చట్టంలోని సెక్షన్ 5ను సవాలు చేస్తూ జాజుల శ్రీనివాస్‌గౌడ్, దాసోజు శ్రవణ్‌కుమార్ తదితరులు దాఖలు చేసి న వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం మంగళవా రం విచారణ జరిపింది. 2010లో కృష్ణమూర్తి కేసు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కల్పనకు ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాలను కాకుండా రాజకీయ వెనుకబాటుతనాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని, దీనిపై అధ్యయనం జరగాల్సి ఉన్నదని ఏజీ ఏ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. దీంతో ఆ అధ్యయనానికి చేపట్టిన చర్యలేమిటో నివేదించాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను 12కి వాయిదా వేసింది.

• ప్రింటెడ్ ఇక్కత్ చీరల తయారీపై నేతన్నల నిరసన



జనగామ జిల్లా కేంద్రంలో నేతన్నలు 'చేనేత పరిరక్షణ ర్యాలీ' నిర్వహించారు. రైల్వేస్టేషన్ నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. చేనేత ఇక్కత్ ప్రింటెడ్ చీరలకు నిరసనగా చేనేత చీరను దహనం చేశారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రాచీన చేనేత కల కనుమరుగయ్యేలా సూరత్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో బడా కంపెనీలు పోచంపల్లి ఇక్కత్ గుర్తింపు పొందిన చీరలను ప్రింట్ చేస్తూ చేనేత కార్మికుల వృత్తిని కొల్లగొడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. – జనగామ, నమస్తేతెలంగాణ

• పింఛన్లు పెంచాలని బీడీ కార్మికుల బైఠాయింపు



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం జీవనభృతి పింఛన్లు పెంచాలని, ఇతర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీడీ కార్మికులు ధర్నా నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాలో ఇందల్వాయిలో కార్మికులు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. – ఇందల్వాయి

మొక్కల పెంపకంపై నివేదిక ఇవ్వండి

రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా చెట్ల పెంపకంపై గణాంకాలతో సమగ్ర వివరాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 12న తదుపరి విచారణ జరిగే నాటికి నివేదిక సమర్పించాలని తెలిపింది. నగరాలు, పట్టణాల్లో ప్రజల జీవితాలు ఉరుకులు పరుగులుగా మారిందని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు సేద తీరాలన్నా, ఊరట పొందాలన్నా పార్కులు ఎంతో అవసరమని, పార్కుల అభివృద్ధితోపాటు మొక్కలు నాటేవిధంగా ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ హైదరాబాద్ హిమాయత్‌సాగర్‌కు చెం దిన కే ప్రతాప్‌రెడ్డి పిల్ దాఖలుచేశారు. దీ నిపై ప్రధాన న్యాయమూర్తి జస్టి స్ అలో క్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస్‌రావు ధర్మాసనం మంగళవారం విచార ణ జరిపింది. అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపిస్తూ.. 'గ్రీనరీ విషయంలో అంతర్జాతీయ ప్రమాణాలు 8 శాతం గా ఉండగా, రాష్ట్రంలో 8.2 శాతంగా ఉందని చెప్పారు. శ్మశానా ల్లో కూడా మొక్కలు పెంచుతున్నామని తెలిపారు. 2022– 23లో 77,87,561 మొక్కలు, 2023– 24లో 72,28, 127 మొక్కలు నాటినట్టు వివరించారు.



24 మంది సజీవదహనం

అవామీ లీగ్ నేత హోటల్‌కు నిప్పు పెట్టడంతో ఘోరం

అల్లర్లలో ఇప్పటివరకు 440 మందికి పైగా మృతి

ఢాకా, ఆగస్టు 6: రాజకీయ సంక్షోభంలో చిక్కుకున్న బంగ్లాదేశ్‌లో అరాచక శక్తులు పేట్రేగిపోతున్నాయి. దేశవ్యాప్తంగా బీభత్సం సృష్టిస్తున్నాయి. షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ నేతలపై ఆందోళనకారులు దాడులకు తెగబడుతున్నారు. వారి ఇండ్లు, వ్యాపారాలను ధ్వంసం చేస్తున్నారు. జోహోర్ జిల్లాలో అవామీ లీగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షహిన్ ఛక్లదర్‌కు చెందిన జబీర్ ఇంటర్నేషన్ హోటల్‌కు సోమవారం రాత్రి అల్లరిమూక నిప్పు అంటించింది. ఈ ఘటనలో 24 మంది సజీవ దహనమయ్యారు. మృతుల్లో ఇండోనేషియాకు చెందిన ఒక వ్యక్తి కూడా ఉన్నారు. పలువురు హోటల్ సిబ్బంది తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. హోటల్ శిథిలాల్లో మరిన్ని మృతదేహాలు లభించే అవకాశం ఉందని సిబ్బంది చెప్తున్నారు.

440కు చేరిన మృతుల సంఖ్య

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారగా, ఇప్పటివరకు 440 మంది మరణించారు. ఆదివారం, సోమవారం చెలరేగిన హింసతో ఎక్కువ ప్రాణనష్టం జరిగింది. పోలీసులు, ఆందోళనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో దాదాపు 250 మందికి పైగా మరణించినట్టు స్థానిక మీడియా పేర్కొన్నది. సోమవారం హసీనా రాజీనామా తర్వాత అల్లర్లు మరోరూపం దాల్చాయి. అప్పటివరకు పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య గొడవలు జరగగా.. హసీనా రాజీనామా తర్వాత ఆందోళనకారులు అవామీ లీగ్ పార్టీకి చెందిన నేతలను లక్ష్యంగా చేసుకున్నారు.

బంగ్లా సంక్షోభంలో పాక్, చైనా పాత్ర ?

హసీనాను గద్దె దింపి బీఎన్‌పీని అధికారంలోకి తేవడమే లక్ష్యం

న్యూఢిల్లీ, ఆగస్టు 6: బంగ్లాదేశ్‌లో సంక్షోభం వెనుక పాకిస్థాన్, చైనా పాత్ర ఉందని బంగ్లాదేశ్ ఇంటెలిజెన్స్ అధికారులు భావిస్తున్నారు. షేక్ హసీనాను గద్దె దించి, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ)ని అధికారంలోకి తేవడానికి ఐఎస్‌ఐ సహకారంతో లండన్‌లో ప్రణాళిక రచించినట్టు చెబుతున్నారు. ఈ మేరకు బీఎన్‌పీ అధ్యక్షురాలు ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ ఐఎస్‌ఐ అధికారులను కలిసినట్టు ఆధారాలు ఉన్నాయని అంటున్నారు. గత కొన్ని రోజులుగా బంగ్లాలో అల్లర్లను ప్రేరేపించేలా, షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పాకిస్థాన్‌కు చెందిన అకౌంట్ల నుంచి పోస్టులు పెడుతున్నట్టు గుర్తించారు. బంగ్లాలో ఆందోళనలను ప్రేరేపించడంలో ఐఎస్‌ఐ ద్వారా చైనా కూడా కీలక పాత్ర పోషించిందని భావిస్తున్నారు. ఆందోళనల్లో కీలకంగా వ్యవహరించిన జమాతే ఇస్లామీ బంగ్లాదేశ్‌కు చెందిన విద్యార్థి విభాగం ఇస్లామీ ఛత్ర శిబిర్(ఐసీఎస్) వెనుక ఐఎస్‌ఐ ఉందని అనుమానిస్తున్నారు. కాగా, షేక్ హసీనా భారత్ అనుకూల వ్యక్తిగా గుర్తింపు పొందగా, ఖలీదా జియా మాత్రం చైనా, పాక్‌కు అనుకూలంగా ఉంటారనే పేరుంది.

యూనస్‌కు బంగ్లా పగ్గాలు

- తాత్కాలిక ప్రభుత్వాధినేతగా నోబెల్ గ్రహీత
- యూనస్ పేరు ప్రతిపాదించిన విద్యార్థులు
- ఆమోదం తెలిపిన దేశ అధ్యక్షుడు షహబుద్దీన్
- బంగ్లా రాజకీయ సంక్షోభానికి తాత్కాలిక తెర

ఢాకా, ఆగస్టు 6: షేక్ హసీనా రాజీనామాతో బంగ్లాదేశ్‌లో మొదలైన రాజకీయ సంక్షోభం తాత్కాలికంగా కొలిక్కి వచ్చింది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా నోబెల్ అవార్డు గ్రహీత మహమ్మద్ యూనస్‌ను నియమిస్తూ దేశ అధ్యక్షుడు షహబుద్దీన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం అర్ధరాత్రి అధ్యక్షుడి ప్రెస్ సెక్రటరీ ప్రకటన చేశారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉద్యమం నడిపిన 'స్టూడెంట్స్ అగైనెస్ట్ డిస్క్రిమినేషన్' ప్రతినిధులు మహమ్మద్ యూనస్ పేరును కొత్త ప్రభుత్వాధినేతగా ప్రతిపాదించారు. దేశంలో సైనిక పాలనను, సైనిక మద్దతు ఉండే ప్రభుత్వాన్ని, నియంత పాలనను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని 'స్టూడెంట్స్ అగైనెస్ట్ డిస్క్రిమినేషన్' జాతీయ సమన్వయకర్త నహీద్ ఇస్లాం మంగళవారం ప్రకటించారు. విద్యార్థులు ప్రతిపాదించిన ప్రభుత్వం కాకుండా వేరే ప్రభుత్వ ఏర్పాటుకు అంగీకరించబోమని ఆయన స్పష్టం చేశారు.

యూనస్ వైపు విద్యార్థుల మొగ్గు

ఆర్థికవేత్త మహమ్మద్ యూనస్(84) సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాలని విద్యార్థి నేతలు మంగళవారం డిమాండ్ చేశారు. తాము యూనస్‌తో మాట్లాడామని, ప్రభుత్వాన్ని నడిపించేందుకు ఆయన అంగీకరించారని విద్యార్థి నేత నహీద్ ఇస్లాం ప్రకటించారు. ప్రస్తుతం యూనస్ విదేశాల్లో ఉన్నారు. యూనస్‌కు పాలన అందించేందుకు సైన్యాధ్యక్షుడు ఉజ్జమాన్ అంగీకరిస్తారా అనే అనుమానం మొదట తలెత్తింది. ఒకవేళ అంగీకరించకపోతే ప్రభుత్వ ఏర్పాటుపై విద్యార్థులు, సైన్యం మధ్య పేచీ మొదలవుతుందని అంతా అనుకున్నారు. అయితే, ఈ అవకాశం ఇవ్వకుండా మహమ్మద్ యూనస్‌నే తాత్కాలిక ప్రభుత్వాధినేతగా దేశాధ్యక్షుడు ఎంపిక చేశారు.

బంగ్లా పార్లమెంటు రద్దు

బంగ్లాదేశ్ పార్లమెంటు(జాతీయ సంసద్)ను రద్దు చేస్తున్నట్టు దేశ అధ్యక్షుడు షహబుద్దీన్ మంగళవారం ప్రకటించారు. హసీనా రాజీనామా అనంతర పరిణామాలపై సోమవారం రాత్రి ఆయన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ అధినేతలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థి ఉద్యమ నేతలతో సమావేశమై చర్చించారు. తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు షహబుద్దీన్ అనుమతి తెలిపారు. మళ్లీ ఎన్నికలు జరిపేందుకు వీలుగా పార్లమెంటును రద్దు చేస్తున్నట్టు చెప్పారు.

భయం గుప్పిట బంగ్లా హిందువులు

షేక్ హసీనా రాజీనామా తర్వాత బంగ్లాదేశ్‌లో హిందువులను అల్లరిమూకలు లక్ష్యంగా చేసుకున్నాయి. దేశవ్యాప్తంగా 27 జిల్లాల్లో సోమవారం హిందువుల ఇండ్లు, వ్యాపారాలపై మూకలు దాడికి పాల్పడి, లూటీ చేసినట్టు స్థానిక మీడియా తెలిపింది. అనేక హిందూ ఆలయాలపై దాడులు జరిగాయి. మెహెర్‌పూర్‌లోని ఇస్కాన్ ఆలయం, కాళీ మాత ఆలయానికి దుండగులు నిప్పు పెట్టారు. ఇస్కాన్ ఆలయానికి నిప్పుపెట్టినప్పుడు అక్కడ ఉన్న ముగ్గురు భక్తులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారని ఇస్కాన్ అధికార ప్రతినిధి యుధిస్టిర్ గోవిందదాస్ తెలిపారు. రంగ్‌పూర్ నగర కార్పొరేషన్‌లో కౌన్సిలర్‌గా ఉన్న హరధన్ రాయ్‌ను దుండగులు హత్య చేశారు. దేశవ్యాప్తంగా హిందువులకు చెందిన 54 ఆలయాలు, ఇండ్లు, ఆస్తులపై దాడులు జరిగాయని బంగ్లాదేశ్ హిందూ బుద్ధిస్ట్ క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ తెలిపింది.

బెంగాల్‌కు కోటి మంది హిందువులు: సువేందు అధికారి

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతుండటంతో, హసీనా రాజీనామాతో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ, జమాతే ఇస్లామీ బలపడే అవకాశం ఉండటంతో పెద్ద ఎత్తున హిందువులు భారత్‌కు శరణార్థులుగా వచ్చే అవకాశం ఉంది. బంగ్లాదేశ్‌లో పరిస్థితులు అదుపులోకి రాకపోతే కోటి మంది బంగ్లాదేశీ హిందువులు బెంగాల్‌కు వచ్చే అవకాశం ఉందని, వారికి ఆశ్రయం ఇచ్చేందుకు మానసికంగా సిద్ధంగా ఉండాలని బీజేపీ నేత, పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి పేర్కొన్నారు.

ఆర్మీ చీఫ్‌పై ముందే భారత్ హెచ్చరిక

బంగ్లాదేశ్‌లో నిరసనకారులకు ఆర్మీ తెరవెనుకుండి మద్దతు పలికిందన్న మాటలు వినిపిస్తున్నాయి. బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వకార్-ఉజ్-జమాన్ వ్యవహారశైలి వివాదాస్పదంగా మారింది. ఈ ఏడాది జూన్ 23న బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్‌గా ఆయన నియమితులయ్యారు. అయితే ఎంపికకు ముందే.. అతడి గురించి ప్రధాని షేక్ హసీనాను భారత్ హెచ్చరించినట్టు సమాచారం. అతడు చైనా అనుకూల వ్యక్తి. అతడితో జాగ్రత్తగా వ్యవహరించాలని భారత జాతీయ భద్రతా మండలికి చెందిన కొందరు ఉన్నతాధికారులు హసీనాను అప్రమత్తం చేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయినప్పటికీ హసీనా ప్రభుత్వం అతడి నియామకానికే మొగ్గుచూపింది.

న్యూయార్క్‌లోని బంగ్లా రాయబార కార్యాలయంపై దాడి

న్యూయార్క్‌లోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంపై కూడా కొందరు దాడికి పాల్పడ్డారు. కార్యాలయంలోకి చొచ్చుకుపోయి వస్తువులను ధ్వంసం చేశారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. షేక్ హసీనా తండ్రి, బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రెహ్మాన్ చిత్రపటాన్ని తొలగించారు.

'పేదల బ్యాంకర్' మహమ్మద్ యూనస్



అమెరికాలోని వాండెర్‌బిల్ట్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ చేసిన మహమ్మద్ యూనస్(83) బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ యూనివర్సిటీలో అధ్యాపకుడిగా పని చేశారు. 1983లో ఆయన ప్రారంభించిన గ్రామీణ్ బ్యాంకు బంగ్లాదేశ్ ఆర్థిక ప్రస్థానంలో కీలక భూమిక పోషించింది. గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు రూ.2 వేల నుంచి ఈ బ్యాంకు రుణాలు ఇచ్చింది. వేలాది కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ బ్యాంకు ఉపయోగపడింది. దీంతో యూనస్‌కు 'పేదల బ్యాంకర్'గా పేరు దక్కింది. ఆయన ప్రారంభించిన గ్రామీణ బ్యాంకు తరహాలో దాదాపు 100 దేశాల్లో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ప్రారంభమయ్యాయి. 2006లో యూనస్‌కు నోబెల్ బహుమతి దక్కింది. 2007లో బంగ్లాదేశ్ రాజకీయ నేతలపై విమర్శలు గుప్పించిన యూనస్ సొంత పార్టీని స్థాపిస్తానని ప్రకటించి తర్వాత వెనక్కుతగ్గారు. కాగా, ఆయనకు చెందిన గ్రామీణ్ టెలికం అనే కంపెనీలో కార్మిక సంక్షేమ నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. దీంతో జనవరిలో ఆయనను అరెస్టు చేయగా బెయిల్‌పై బయటకు వచ్చారు.

జైలు నుంచి విడుదలైన ఖలీదా

2018లో అవినీతి ఆరోపణలతో అరెస్టయి జైలు జీవితం గడుపుతున్న ఖలీదాను విడుదల చేయాల్సిందిగా దేశ అధ్యక్షుడు షహబుద్దీన్ ఆదేశాలు ఇచ్చారు. షేక్ హసీనా రాజీనామా చేసిన గంటల్లోనే షహబుద్దీన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఖలీదా జైలు నుంచి విడుదలయ్యారు. బుధవారం ఖలీదా నేతృత్వంలో బీఎన్‌పీ ర్యాలీ నిర్వహించనుంది. బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహ్మాన్ సతీమణి అయిన ఖలీదా జియా 1991 – 96, 2001 – 06 వరకు రెండు పర్యాయాలు బంగ్లాదేశ్ ప్రధానిగా పని చేశారు. ఆ దేశ తొలి మహిళా ప్రధాని అయిన ఖలీదా.. మాజీ ప్రధాని షేక్ హసీనాతో సుదీర్ఘ రాజకీయ పోరాటం చేశారు.





మరికొన్ని రోజులు భారత్‌లోనే హసీనా!

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ నుంచి ఉన్నపళంగా తన సోదరి షేక్ రెహానాతో కలిసి భారత్‌కు వచ్చిన ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా లండన్ వెళ్లాలని భావిస్తున్నారు. రెహానా కూతురు తులిప్ సిద్దిఖ్ బ్రిటన్ పార్లమెంటు సభ్యురాలిగా ఉన్నారు. అయితే, హసీనాకు ఆశ్రయం కల్పించేందుకు యూకే ఆసక్తి చూపించడం లేదు. ఆశ్రయం కోరేందుకు, తాత్కాలిక శరణార్థిగా యూకేకు ప్రయాణించేందుకు అనుమతించే నిబంధన తమ దేశంలో లేదని యూకే హోం కార్యాలయ అధికార ప్రతినిధి చెప్పారు. అంతర్జాతీయ రక్షణ కోరేవారు ముందుగా ఏ సురక్షిత దేశానికి అయితే చేరుకున్నారో ఆ దేశాన్నే ఆశ్రయం కోరాలని తెలిపారు. బంగ్లాదేశ్‌లో జరిగిన హింసపై విచారణ జరిపితే, తమ దేశంలో హసీనాకు న్యాయపరంగా ఎలాంటి రక్షణ ఉండబోదని యూకే ప్రభుత్వం పరోక్షంగా చెప్పింది. దీంతో లండన్ వెళ్లాలనే నిర్ణయాన్ని హసీనా వాయిదా వేసుకునే అవకాశం ఉందని, కొన్ని రోజుల పాటు ఆమె భారత్‌లోనే ఉండే అవకాశం ఉంది.

హిందూ కవి పాటనే బంగ్లా నిరసనకారులకు స్ఫూర్తి

ఢాకా: బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలై, ప్రధానిని గద్దె దింపే వరకు కొనసాగిన నిరసనలకు ఒక హిందూ కవి రాసిన పాట కూడా స్ఫూర్తి నింపింది. దేశవిభజనకు ముందు బెంగాల్ గొప్పతనాన్ని, ఆ ప్రాంత వైభవాన్ని వర్ణిస్తూ ప్రముఖ బెంగాలీ కవి ద్విజేంద్రలాల్(డీఎల్) రాయ్ 'ధన ధాన్య పుష్ప భార' అనే పాటను రాశారు. జూలై 16 నుంచి బంగ్లాదేశ్‌లో మొదలైన ఆందోళనల్లో నిరసనకారులు ఈ పాటను ఆలపిస్తూ, వింటూ పాల్గొన్నారు. కాగా, ప్రస్తుత పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్‌లో 1863 జూలై 19న డీఎల్ రాయ్ జన్మించారు. ఆయన రచించిన పాటలను 'ద్విజేంద్రగీతి'గా పిలుస్తారు.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా డ్రోన్ల దాడి

బీరూట్: లెబనాన్ సాయుధ గ్రూప్ హెజ్బొల్లా మంగళవారం డ్రోన్లు, రాకెట్లతో ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంపై విరుచుకుపడింది. అయితే గత వారం తమ టాప్ కమాండర్‌ను హత్య చేసినందుకు ఇంకా ప్రతీకారం తీర్చుకోలేదని ఆ సంస్థ వెల్లడించింది. లెబనాన్ దాడి వల్ల నహరియా నగరంలో పలువురు పౌరులు గాయపడ్డారని ఇజ్రాయెల్ తెలిపింది. దక్షిణ లెబనాన్‌లోని రెండు హెజ్బొల్లా స్థావరాలపై తమ వైమానిక దళం దాడి చేసిందని చెప్పింది. మరో వైపు లెబనాన్‌లోని మెఫడౌన్ పట్టణంపై జరిగిన దాడిలో నలుగురు చనిపోయారని భద్రతా వర్గాలు తెలిపాయి. చనిపోయినవారిని హెజ్బొల్లా ఫైటర్లుగా భావిస్తున్నారు.

బీరుట్‌పై ఇజ్రాయెల్ యుద్ధ విమానాల గర్జన

బీరుట్: ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు మంగళవారం లెబనాన్ రాజధాని బీరుట్ మీదుగా దూసుకెళ్లాయి. లెబనాన్ హెజ్బొల్లా హెడ్ కీలక ప్రసంగం కోసం దేశ ప్రజలంతా టీవీల ముందు ఎదురుచూస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో లెబనాన్‌లో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. నగరంలోని ప్రజలంతా భయాందోళనలకు గురయ్యారు. ఇండ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. యుద్ధ విమానాలు మూడుమార్లు బీరుట్ మీదుగా వెళ్లాయి.

హమాస్ కొత్త చీఫ్ యాహ్యా సిన్వార్

గాజా, ఆగస్టు 6: గాజాస్ట్రిప్ చీఫ్ యాహ్యా సిన్వార్ హమాస్ కొత్త చీఫ్‌గా నియమితులయ్యారు. తమ ఉద్యమానికి సంబంధించి రాజకీయ బ్యూరో అధిపతిగా యాహ్యా సిన్వార్‌ను ఎంపిక చేసినట్టు ద 'ఇస్లామిక్ రెసిస్టెన్స్ మూవ్‌మెంట్ హమాస్' మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. హమాస్ కొత్త చీఫ్ ఎంపిక జరిగిన కొద్ది నిమిషాల్లోనే హమాస్ సాయుధ బలగం 'ఎజ్జెడైన్ అల్ కస్సమ్' బ్రిగేడ్స్ ఇజ్రాయెల్ వైపు రాకెట్లను ప్రయోగించింది. వారం రోజుల క్రితం ఇజ్రాయెల్ నిఘా ఏజెంట్స్ దాడిలో హమాస్ చీఫ్ హనియా హతమైన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్, లెబనాన్‌లోని హెజ్బొల్లా ప్రకటించటంతో పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి.

20 ఏండ్లలో 10 మంది

ప్రజల నిరసనలతో పదవులు కోల్పోయిన దేశాధినేతలు

2024 ఆగస్టు: హసీనా రాజీనామా
ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లపై బంగ్లాదేశ్‌లో నిరసనలు రేగడంతో ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేసి భారత్‌కు పారిపోయారు.

2022 : శ్రీలంక అధ్యక్షుడు రాజపక్సే
ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవటంతో శ్రీలంకలో నిరసన జ్వాలలు చెలరేగాయి. అధ్యక్షుడు గోటబయ రాజపక్సే అధికార నివాసాన్ని నిరసనకారులు చుట్టుముట్టడంతో 2022 జూలైలో అధ్యక్ష పదవికి రాజీనామా చేసి దేశం విడిచి వెళ్లిపోయారు.

2017: రాబర్ట్ ముగాబే
జింబాబ్వే అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే పాలనకు వ్యతిరేకంగా 2017 నవంబర్‌లో పెద్ద ఎత్తున నిరసనలు చోటుచేసుకున్నాయి. సైన్యం జోక్యం చేసుకొని ఆయన చేత బలవంతంగా రాజీనామా చేయించింది.

2018: అర్మేనియా ప్రధాని సార్గిసన్
ప్రధాని సెర్జ్ సార్గిసన్ పాలనకు 2018 ఏప్రిల్ 23న తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. నిరసనకారులు, సైన్యం చేతులు కలిపి.. పదవి నుంచి సెర్జ్ సార్గిసన్‌ను తప్పించారు.

2013: బల్గేరియా ప్రధాని బోరిసోవ్
పెరిగిన విద్యుత్ బిల్లులకు వ్యతిరేకంగా బల్గేరియాలో నిరసనలు రేగాయి. 2013 ఫిబ్రవరిలో ప్రధాని బోరిసోవ్ రాజీనామా చేశారు.

2011: హోస్నీ ముబారక్
ఈజిప్ట్‌లో హోస్నీ ముబారక్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనకు దిగడంతో 2011 ఫిబ్రవరిలో ముబారక్ తప్పుకున్నారు.

2011: అబిదిన్ బెన్ అలీ
నిరుద్యోగం, ధరలకు వ్యతిరేకంగా ప్రజాగ్రహం పెల్లుబుకడంతో 2011 జనవరి 15న ట్యునీషియా అధ్యక్ష పదవికి అబిదిన్ బెన్ అలీ రాజీనామా చేసి సౌదీకి పారిపోయారు.

2009: ఐస్‌ల్యాండ్ ప్రధాని హార్డే
దేశ కరెన్సీ, బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలటంతో ప్రజలు ఆందోళనకు దిగడంతో ఐస్‌ల్యాండ్ ప్రధాని పదవికి హార్డే రాజీనామా చేశారు.

2006: నేపాల్ రాజు జ్ఞానేంద్ర
రాచరిక వ్యవస్థపై ప్రజాగ్రహం పెల్లుబుకడంతో నేపాల్ రాజు జ్ఞానేంద్ర గద్దె దిగాల్సి వచ్చింది.

2005: ఒమర్ కరామి
మాజీ ప్రధాని రఫిక్ హరిరి హత్యతో లెబనాన్‌లో నిరసనలు మిన్నంటడంతో ప్రధాని ఒమర్ కరామి రాజీనామా చేయాల్సి వచ్చింది.

బట్టలు సర్దుకునే టైమూ లేక!

- చివరి గంటలో హసీనా ఆగమాగం
- సూట్‌కేసు వదిలిపెట్టి మరీ పరారీ
- తొలుత రాజీనామాకు విముఖం
- కొడుకు ఒత్తిడితో అయిష్టంగానే ఓకే
- జాతినుద్దేశించి చివరి ప్రసంగం చేద్దామన్నా కుదరని సమయం
- హసీనా విమానానికి గగనతలంలో రఫెల్ యుద్ధ విమానాల సెక్యూరిటీ



హసీనా నివాసాన్ని లూటీ చేసి వివిధ వస్తువులు తీసుకెళ్తున్న ప్రజలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): బంగ్లాదేశ్ ప్రధానమంత్రి అధికారిక నివాసం గణభవన్‌కు నిరసనకారుల లాంగ్ మార్చ్ సమీపిస్తున్న సమయంలో కూడా ప్రధాని పదవికి రాజీనామా చేయడానికి షేక్ హసీనా విముఖంగానే ఉన్నారట. అయితే, కుమారుడి ఒత్తిడితో ఎట్టకేలకు తలొగ్గిన ఆమె చివరకు రాజీనామాకు ఒప్పుకొన్నారని సమాచారం. రాజీనామా చేశాక ప్రధాని నివాసాన్ని ఖాళీ చేయాలనుకొన్న హసీనా.. తొలుత తన వ్యక్తిగత వస్తువులు, దుస్తులు అన్నీ సర్దుకొందామనుకొన్నారట. అయితే, అప్పటికే గణభవన్‌కు నిరసనకారుల బృందం అతి సమీపంలోకి రావడంతో తన సూట్‌కేసును కూడా వదిలిపెట్టి హసీనా దేశాన్ని వదిలిపెట్టి వెళ్లిపోయారట. ఈ మేరకు బంగ్లాదేశ్‌కు చెందిన ప్రోథమ్ అలో సహా మరికొన్ని స్థానిక పత్రికలు పేర్కొన్నాయి.

ఉదయం నుంచి ఆగమాగం

నిరసనకారులపై పోలీసులు జరుపుతున్న కాల్పుల్లో మరణిస్తున్న విద్యార్థుల సంఖ్య అంతకంతకూ పెరుగుతుండటంతో ఆందోళనల తీవ్రత రెట్టింపైంది. దీంతో ఈ విషయాన్ని సోమవారం ఉదయం త్రివిధ దళాల ప్రధాన అధికారులు.. షేక్ హసీనా దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఆందోళనలను నియంత్రించడంలో విఫలమయ్యారంటూ హసీనా అంతర్గతంగా వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో.. పీఎం పదవికి రాజీనామా చేసి సైన్యానికి పాలనా పగ్గాలు అప్పగించాలంటూ ఐజీపీతో సహా అవామీ లీగ్ పార్టీ నాయకులు కూడా హసీనాకు సూచించారు. దీనికి ఆమె విముఖత వ్యక్తం చేశారు.

కుమారుడి ఒత్తిడితో..

అప్పటికే సమయం 10 గంటలు కావొస్తోంది. నిరసనకారుల లాంగ్ మార్చ్ పీఎం కార్యాలయం రూటులోకి వస్తున్నట్టు తెలుసుకొన్న సీనియర్ అధికారి ఒకరు.. పక్కగదిలో ఉన్న హసీనా సోదరి రెహానాకు పరిస్థితిని వివరించారు. ఆమె కూడా రాజీనామా చేయాలంటూ సూచించినా.. హసీనా వినలేదు. పరిస్థితి చేజారిపోతుండటంతో అమెరికాలో ఉంటున్న హసీనా కుమారుడు సజీబ్ అహ్మద్ వాజెద్ జోయ్‌ను అధికారులు రంగంలోకి దించారు. పరిస్థితిని వివరించారు. దీంతో ఫోన్‌లో హసీనాతో మాట్లాడిన సజీబ్.. రాజీనామాకు ఆమెను ఒప్పించారు.

45 నిమిషాల టైమ్


దేశాన్ని విడిచిపెట్టే కంటే ముందు జాతిజనులకు ప్రధానిగా తన చివరి ప్రసంగాన్ని ఇవ్వాలనుకొని రికార్డింగ్‌కు సిద్ధమయ్యారు. అయితే, గణభవన్‌కు నిరసనకారులు అత్యంత సమీపంగా వచ్చారన్న ఇంటెలిజెన్స్ రిపోర్ట్‌తో అది వీలు కాలేదు. 45 నిమిషాల్లోగా రాజీనామాకు సంబంధించిన పత్రాలు, ఇతరత్రా అధికారిక విధులను పూర్తిచేయాలని ఆర్మీ ఇచ్చిన సూచనల మేరకు వెంటనే ఆమె రాజీనామా కార్యక్రమాలను పూర్తిచేశారు.

రాష్ట్రపతి నివాసానికి.. అటు నుంచి బయటకు

గణభవన్ నుంచి రహస్య మార్గంలో బయటపడ్డ హసీనా.. రాష్ట్రపతి నిలయమైన బంగాభవన్‌లో తన రాజీనామా లేఖను సమర్పించారు. అనంతరం.. కట్టుదిట్టమైన భద్రత నడుమ మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఢాకాలోని మిలిటరీ ఎయిర్‌బేస్‌లో సైనిక విమానాన్ని ఎక్కారు.

రగులుతున్న బ్రిటన్

- వలసదారులకు వ్యతిరేకంగా ఆందోళన
- దేశవ్యాప్తంగా అల్లర్లు.. ఆస్తుల ధ్వంసం
- పెట్రోల్ బాంబులతో పోలీసులపై దాడి
- 370 మంది ఆందోళనకారుల అరెస్టు



లండన్, ఆగస్టు 6: వలసదారులకు వ్యతిరేకంగా కొనసాగుతున్న అల్లర్లతో బ్రిటన్ అట్టుడుకుతున్నది. జూలై చివరి నుంచి అక్కడక్కడ కొనసాగుతున్న ఆందోళనలు శుక్రవారం నుంచి తీవ్రరూపం దాల్చాయి. యూకే వ్యాప్తంగా ఆందోళనకారులు హింసాత్మక చర్యలకు దిగారు. ఇంగ్లాండ్‌లోని ప్లైమౌత్‌లో ఆందోళనకారులు పోలీసులపై దాడులకు పాల్పడ్డారు. నార్తర్న్ ఐర్లాండ్‌లోని బెల్‌ఫాస్ట్‌లో నిరసనకారులు పోలీసులపైకి పెట్రోల్ బాంబులు విసిరారు. బర్మింగ్‌హామ్‌లోనూ ఉద్రిక్తతలు తలెత్తాయి. నార్తర్న్ ఇంగ్లడ్‌లోని రొథెర్హమ్, సెంట్రల్ ఇంగ్లండ్‌లోని టామ్‌వర్త్ పట్టణాల్లో వలసదారులు నివసిస్తున్నారని భావిస్తున్న హోటళ్లపై దాడి చేసి నిప్పు పెట్టారు. పలు నగరాల్లో ప్రభుత్వ ఆస్తులను, వాహనాలను ధ్వంసం చేశారు. కాగా, హింసాత్మక ఘటనలకు పాల్పడిన 370 మందిని అరెస్టు చేశారు.

ఎందుకు మొదలయ్యాయి ?

గత సోమవారం ఉత్తర ఇంగ్లండ్‌లోని సౌత్‌పోర్ట్‌లో ముగ్గురు అమ్మాయిల హత్య జరిగింది. ఈ హత్యలను ఒక ముస్లిం వలసదారుడు చేశాడనే ప్రచారం జరగడంతో ఆగ్రహజ్వాలలు అంటుకున్నాయి. వలసదారులకు వ్యతిరేకంగా రైట్‌వింగ్ సంస్థలు నిరసనలకు దిగాయి. తాజా ఆందోళనలతో స్టార్మర్ ప్రభుత్వానికి తొలి సవాల్ ఎదురైంది. బ్రిటన్‌లో అల్లర్ల నేపథ్యంలో భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం అడ్వైజరీ జారీచేసింది.

భారత్ చుట్టూ అస్థిరత

- సంక్షోభంలో కూరుకుపోయిన సరిహద్దు దేశాలు
- ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థలకు ముప్పు
- ఇప్పటికే దేశాల ప్రజల మధ్య దెబ్బతిన్న సంబంధాలు
- భారత్ పెద్దన్న పాత్ర పోషించాలంటున్న పరిశీలకులు

న్యూఢిల్లీ, ఆగస్ట్ 6: ఉపఖండంలోని దేశాల్లో నెలకొన్న అస్థిర పరిస్థితులు భారత్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. పాకిస్థాన్, శ్రీలంక, అఫ్గానిస్థాన్, మయన్మార్, నేపాల్ తాజాగా బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభాలు.. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా భారత్‌ను ప్రభావితం చేస్తున్నాయి. దేశం చుట్టూ నెలకొన్న పరిస్థితులు భారత విదేశాంగ విధానానికి సవాలు విసరడమే కాకుండా ఆర్థిక పరంగా కూడా నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ ఉపఖండంలో పెద్దన్న పాత్ర పోషించి శాంతి, సుస్థిరత కోసం కృషి చేయాలని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

- **బంగ్లాదేశ్:** గత పదిహేనేండ్లలో బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థ అనూహ్యంగా పుంజుకున్నది. నీరు, మానవ వనరులు సమృద్ధిగా ఉన్న బంగ్లాదేశ్‌లో పలు బహుళజాతి సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. దీంతో 1994-2023 మధ్య కాలంలో బంగ్లాదేశ్ 5.8% వృద్ధి రేటును నమోదుచేసింది. ఓ వైపు దేశం అభివృద్ధి దిశగా దూసుకుపోతుండగా.. అదే స్థాయిలో మతోన్మాదం, అరాచకత్వం పెనుముప్పుగా తయారయ్యాయి. చివరికి జమాతే ఇస్లామీ వంటి అతివాద శక్తులు ప్రజాస్వామికంగా ప్రభుత్వాన్ని కూలదోయడంలో సఫలమయ్యాయి.
- **శ్రీలంక:** కొవిడ్ ప్రభావంతో శ్రీలంక అతలాకుతలమైంది. నిత్యావసర ధరలు భారీగా పెరిగిపోగా అధిక ద్రవ్యోల్బణం, జీడీపీ పతనం ఆ దేశాన్ని తీవ్రంగా కుంగదీశాయి. దీంతో ప్రజలు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వంపై తిరుగుబాటుకు దిగారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడంలో మహింద రాజపక్స ప్రభుత్వం విఫలమైంది. దేశంలో తీవ్ర స్థాయిలో చెలరేగిన హింస, అస్థిరత నేపథ్యంలో ప్రధాని పదవికి రాజీనామా చేసిన రాజపక్స ట్రింకోమలై నౌకాశ్రయానికి పారిపోయి తలదాచుకున్నారు.
- **పాకిస్థాన్:** రెండేండ్ల క్రితం ఏప్రిల్‌లో పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీలో అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అర్ధంతరంగా తన పదవి నుంచి వైదొలిగారు. అప్పటినుంచి పాకిస్థాన్ తీవ్ర రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయింది. దేశంలో నెలకొన్న ఆర్థిక అస్థిరత, సామాజిక, రాజకీయ సంక్షోభంతో పాక్ కోలుకోలేని స్థితికి దిగజారిపోయింది. దీంతో ప్రస్తుత పాలనకు వ్యతిరేకంగా ఉగ్రవాదం, తిరుగుబాట్లు పెచ్చుమీరుతున్నాయి.
- **అఫ్గానిస్థాన్:** ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం, దేశమంతటా పేదరికం విస్తరించడంతో అఫ్గానిస్థాన్ సైతం తీవ్రమైన రాజకీయ, సామాజిక సంక్షోభంలో కూరుకుపోయింది. 2021 ఆగస్టులో అమెరికా దళాలు ఆకస్మికంగా వైదొలగడంతో దేశం మళ్లీ తాలిబన్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. దీంతో రెండు దశాబ్దాల పాటు ఆ దేశ పౌరులు అనుభవించిన విద్యా, పౌర, మహిళా హక్కులను తాలిబన్లు అణచివేశారు. ఇస్లామిక్ చట్టాలను కఠినాతి కఠినంగా అమలు చేస్తుండడంతో దేశంలో లక్షల మంది పౌరులు తీవ్రమైన ఆహార, వైద్య సదుపాయాల కొరతను ఎదుర్కొంటున్నారు.
- **మయన్మార్:** భారత్ చుట్టూ ఉన్న దేశాల్లో అత్యంత కల్లోలంగా ఉన్న ప్రదేశం మయన్మార్. అధికార జుంటా (సైనిక పాలకులు) పౌరులను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతుండగా, తిరుగుబాటుదారులు వైమానిక దాడులకు పాల్పడుతుండటంతో దేశంలో అంతర్యుద్ధం ఉచ్ఛస్థితికి చేరింది. దీంతో అక్కడి పౌరులు శరణార్థులుగా మన దేశంలోని మిజోరం, మణిపూర్ రాష్ట్రాలకు తరలివస్తున్నారు.

